RNI No. APTEL/2003/12253

భావవీణ

కళలు, సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

ज्ञान-विज्ञान विमुक्तये
UGC
University Grants Commission
UGC Care List Group - 1
Journal Sl. No 34 under
Arts and Humanities
Category

BHAVA VEENA

Journal of Arts, Literary, Culture & Language Study

Vol : 19 Issue No. 6(1) Monthly June 2022 ISSN No. : 2456-4702 Rs. : 15/-



బొజ్జా తారకం



మాతెలుగు తల్లికి మల్లెపూదండ - మాకన్న తల్లికి మంగళారతులు

BHAVA VEENA (భావ వీణ)

Journal of Arts, Literary, Culture & Language Study

(కళలు - సాహిత్య-సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక)

Editor : Kolla Sri Krishnarao
E-mail : parisodhanatelugu@gmail.com

7989781963,
9490847482.
Rohini Towers,
2/11 Brodipet,
GUNTUR-2.

Vol. 19 - Issue. 6 (1) - June 2022 - ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 - Rs. : 15/-

EDITORIAL BOARD

Chief Editor

Dr. PITTA SANTHI

M.A.(Tel), M.Sc(Psy).,M.Ed.,M.Phil(Edu), Ph.D.,

C/o. Dr. Busi Venkataswamy

Holy Homes Apartment, Postal colony ,
4 Th Line,- 522 002, Guntur Dist., A.P. Cell no : 7386529274, 7989781963.

ADVISORY COMMITTEE

1. **Prof. G. Yohan Babu,** M.A., PhD.
Dept. of Telugu,
Andhra University, Visakhapatnam.
2. **Prof. K. Madhu Jyothi,** M.A., PhD.
Dept. of Telugu,
Sri Padmavathi Mahila University,
Tirupathi.
3. **Prof. C. Srirama Chandra Murthy,** M.A., PhD.
Dept. of Telugu, Faculty of Arts,
Benaras Hindu University, Varanasi, Utter Pradesh.
4. **Dr. Busi Venkataswamy,** M.A. (Tel)., M.A (San)., M.A (Ling)., PhD.
Associate Professor, Dept. of Telugu,
Andhra University, Visakhapatnam.
5. **Thottempudi Sree Ganesh,** M.A., M.Phil (Computational Linguistics) (Ph.D)
Research Scientist, Centre for Applied Linguistics and Transalation Studies, Universityof Heidelberg, Germany.
6. **Prof. Darla Venkateswara Rao,** M.A., M.Phil., Ph.D.
HOD, Dept. of Telugu,
Hyderabad Central University, Hyderabad, Telangana.

ASSOCIATE EDITORS

1. **Dr. N. R. SADASIVA REDDY**, M.A.,M.Phil,PhD.
Associate Professor,
Dept. of Telugu & Comparative Literature,
Sri Krishna Deva Raya University,
Ananthapuram, Andhra Pradesh.
2. **Prof. V.SANKARA RAO**, M.A.,M.A.,M.Phil,PhD.
HOD, Dept. of Telugu,
Madras University,
CHENNAI, Tamilnadu.
3. **Dr. D. SESHUBABU**, M.A.,M.Phil,PhD.
Associate Professor, Dept.of Hindi,
Moulana Azad National Urdu University,
HYDERABAD, Telangana.
4. **Dr. K. Lavanya,** M.A., M.Phil., PhD.
HOD, Dept. of Telugu
Telangana University, Dichpally,
Nizamabad, Telangana.
5. Prof. **N.V. KRISHNA RAO,** M.A.,M.Phil,PhD.
Dept. of Telugu & O.L.,
Acharya Nagarjuna University,
Nagarjuna Nagar, Guntur District.
6. **Prof. A. JYOTHI,** M.A.,M.Phil,PhD.
Dept. of Telugu,
Kakatiya University, Warangal District.
Telangana.

7. **Dr. J. VENKATA RAMANA,** M.A.,M.Phil,PhD.
Associate Professor, Dept.of Modern Indian Languages,
Madhurai Kamaraj University, Madhurai,
Tamilnadu.

8. **Dr. N. Eswar Reddy,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
Yogi Vemana University, Kadapa.

9. **Prof. P.R. Harinadh,** M.A., M.Ed., M.Phil,PhD.
Dept. of Telugu,
Regional Institute of Education (NCRT)
Manasa Gangothri, Mysore, Karnataka.

10. **Dr. B. Tirupathi,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
Dravidian University, Kuppam, Chittor Dist.

11. **Dr. T.SATYANARAYANA,** M.A.,M.Phil,PhD.
Asst.Professor, Dept. of Telugu,
Adikavi Nannaya University,
RAJAMUNDRY, East Godavari, A.P.

12. **Mr. D.ESWARA RAO,** M.A.,
Principal,
P.A.S.College, PEDANANDIPADU-522 235,
Guntur, A.P.

13. **Dr. P. VIJAYA KUMAR**, M.A.,M.Phil,PhD.
Vice Principal,
Govt. Degree College, Yemmiganuru.

14. **Dr. K. RAVI**, M.A., M.Phil,PhD.
HOD, Dept. of Telugu,
Govt. Degree College, Narayanapuram.

15. **Dr. Kakani Sudhakar,** M.A., M.Phil., PhD.
Dept. of Telugu,
Govt. Arts College, Rajahmundry.

16. **Dr. P. Srinivasa Rao,** M.A., M.Phil., PhD.
Guest Faculty, Dept. of Telugu,
Potti Sriramulu University, Bommuru.

17. **Dr. Ch. Praveen Kumar,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
Kakatiya University, Warangal.

18. **Dr. N. Rambabu,** M.A., M.Phil., PhD.
Project Senior Fellow, Dept. of Classical
Literature, Nellore.

19. **Dr. G. Sailamma,** M.A., M.Phil., PhD.
Editorial Assistat,
Centre for Publications Dravidian University,
Kuppam, Chittor Dist.

20. **Dr. M. Sangeetha Rao,** M.A., M.Phil., PhD.
Guest Faculty, Dept. of Telugu,
Central University of Andhra Pradesh,
Ananthapuram District. A.P.

21. **Dr. M. Prasad,** M.A., M.A. (San)., PhD. Diploma in Maliyalam.
School Assistant (Telugu)
Govt. High School,
Rapuru, SPSR Nellore.

22. **Dr. Mark Poloneyes,** M.A., M.Phil., PhD.
Principal & HOD,
P.G. Centre, Gadwal,
Palamuru University, Mahabobnagar, Telangana.

LEGALADVISER

Dr. A. GURAVAIAH, ***M.A., L.L.M., PhD.,***
Principal & Research Guide, Dept., of Law, A. C. Law College, GUNTUR - 522 002, A.P.

DTP & PRINTING

TENALI PRAKASH, G.L.S. GRAPHICS, LEMALLE, Guntur. 94 94 660 509.

గమనిక : రచయితల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు - **ఎడిటర్.**

Edited, Printed, Published and owned by Kolla Srikrishna Rao, Rohini Towers, 2/11 Brodipet,
GUNTUR - 522 002. Andhra Pradesh. Cell : 7386529274, 7989781963.
E-mail : parisodhanatelugu@gmail.com.Printed at : GLS Enterprises, Kavitha Nagar, Guntur - 522 002. Ph. 94 94 660 509.

బొజ్జా తారకం

బొజ్జా తారకం ప్రముఖ న్యాయవాది, దళిత హక్కుల ఉద్యమనేత, దళిత విద్యార్థి నేత, హక్కుల ఉద్యమాలకు కేంద్ర బిందువు. మార్క్సిజాన్ని, అంబేడ్కరిజాన్ని మేళవించి ఉద్యమించిన ఉద్యమ నాయకుడు.

బొజ్జా తారకం తూర్పు గోదావరి జిల్లా కాట్రేనికోన మండలం కందికుప్ప గ్రామంలో బొజ్జా అప్పలస్వామి, మావూళ్ళమ్మ దంపతులకు జన్మించారు. తారకం ఉద్యమ స్ఫూర్తి తాత తండ్రులనుండే అలవడిందని చెప్పవచ్చు. వీరి తాత గోవిందదాసు ఉపాధ్యాయుడైన తత్వాలు పాడుతూ ఆధ్యాత్మిక ప్రసంగాలు చేసేవారు. అలాగే వీరి తండ్రి అప్పలస్వామి వృత్తి రీత్యా ఉపాధ్యాయుడైన బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం ఉద్యమించారు.

తారకం విద్యాభ్యాసం స్వగ్రామంలోనే ప్రారంభమైంది. తాత తండ్రుల స్ఫూర్తితో అలాగే అంబేడ్కర్ భావజాలంతో న్యాయవాద విద్యను అభ్యసించారు. విద్యను పూర్తిచేసి కాకినాడలో ప్రాక్టీస్ ప్రారంభించారు. తారకం మొట్టమొదటి ఎస్సీ లాయర్‌గా ప్రాక్టీస్ ప్రారంభించారు. అలాంటి రోజుల్లో పాలెం అనే ఊళ్ళో ఆ ఊరి భూస్వామి తన దగ్గర పనిచేసే వ్యక్తిని కొట్టి చంపాడు. దీనిపై ఎందరూ నోరు మెదపలేదు. తమ బతుకులింతేననుకున్నారు. అందరు భూస్వామికి భయపడ్డారు. అయితే తారకం ఇలాంటి దారుణాలను ప్రశ్నించకపోతే, దోషులకు శిక్ష పడుకపోతే ఇంకెన్ని సంఘటనలు జరుగుతాయో, ఎంతమంది అమాయకపు దళితులు బలైపోతారోనని ఆలోచించి తన అనుచరులను వెంట పెట్టుకుని పాలెం వెళ్ళారు. అక్కడ దళితులంతా భూస్వామని ఎదుర్కొని మనం నిలబడలేము వెనక్కి వెళ్ళండి లేదంటే చంపేస్తారని హెచ్చరించారు. చావాల్సివస్తే మొట్టమొదట నేనే చస్తాను. మీరేం భయపడవచ్చు అని పిలుపునిచ్చారు. ఊర్లో ర్యాలీ ప్రారంభించారు. ఆత్మహత్యను నిరసిస్తూ పెద్ద ఎత్తున నిరసన సభ నిర్వహించారు. అప్పటి వరకు భయంగా ఉన్న దళితులంతా కదలివచ్చారు. ఈ సంఘటన దళితుల్లో గొప్ప ఆత్మస్థయిర్యాన్ని కలిగించింది. న్యాయపోరాటం సాగించారు. ఒకవైపు పోరాటం కొనసాగుతుండగానే మరోవైపు 'అంబేడ్కర్ యువజన సంఘాన్ని' స్థాపించి అగ్రవర్ణాల దౌర్జన్యాలను, అణచివేతలకు వ్యతిరేకంగా అంటరానితనాన్ని నిర్మూలనే లక్ష్యంగా పోరాటాలు చేశారు.

న్యాయవాద వృత్తిలో ఉంటూ దళిత సమస్యలపై పోరాడారు. కారంచేడు సంఘటన తర్వాత హైకోర్టు న్యాయవాద పదవికి రాజీనామా చేసి కత్తి పద్మారావుతోపాటు కారంచేడు శిబిరంలో నిరసన దీక్ష చేపట్టారు. న్యాయవాద వృత్తి, ఉద్యమాల్లో పాల్గొంటూనే రచయితగా కూడా కీర్తి ప్రతిష్టలు సంపాదించారు. వీరి రచనల్లో పోలీసులు అరెస్ట్ చేస్తే, నది పుట్టిన గొంతుక, కులం, వర్గం నాలాగే గోదావరి, నేల నాగలి మూడెద్దులు, దళితుల రాజ్యం, ఎస్సీఎస్టీలపై అత్యాచారాలు, ఎస్సీ ఎస్టీ నిధులు విదిలింపు - మళ్ళింపు, పంచతంత్రం (నవల), చరిత్ర మార్చిన మనిషి - ఆదిరుద్రాంధ్ర ఉద్యమంలో బొజ్జా అప్పలస్వామి (జీవిత చరిత్ర), అంబేడ్కర్ రచించిన రాముడు, కృష్ణుడు రహస్యాలు పుస్తకాన్ని తెలుగులోకి అనువదించారు. అంబేడ్కర్ స్థాపించిన రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా పార్టీలో కీలకంగా పనిచేశారు. ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం అమలుకు ఏర్పాటు చేసిన కేంద్ర కమిటీలో తారకం కీలకపాత్ర పోషించారు.

ఉద్యమాలు నడిపిస్తూనే ఎన్నో ఉన్నత పదవులను అధిరోహించారు. దళిత మహాసభ (వ్యవస్థాపకుడు), కమిటీ ఫర్ రిలీజ్ ఆఫ్ పొలిటికల్ ప్రిజనర్స్(అధ్యక్షుడు), తెలంగాణా ప్రజాస్వామిక వేదిక (కన్వీనర్)గా అనేక పదవులకు చేపట్టారు. దళితులను అనునిత్యం చైతన్యపరుస్తూ వారి హక్కులను వారికి దక్కేలాచేస్తూ చివరిశ్వాస వరకు పోరాటం చేస్తూ 2016 సెప్టెంబర్ 16న మరిణించారు.

- సంపాదకవర్గం

Contents (విషయ సూచిక)

1. 'పొత్తి' నవల పాత్రలు - పాత్ర చిత్రణ	- దేవులపల్లి సాయికృష్ణ	5
2. మానవీయ విలువలెన్నో బోధించే మహాభారతం	- డా॥. సూరపరాజు వసంత కుమారి	13
3. 'పెనుగొండ లక్ష్మి' కవితా వైశిష్ట్యం	- డా॥. వి. పవన్ కుమార్ రెడ్డి	22
4. సాహిత్యంలో సమాజ ప్రతి ఫలనం "తీరొక్క ముత్యం"	- గునుగుంట్ల శైలజ	25
5. అతడు అడవిని జయించాడు - ఒక పరామర్శ	- డా॥. జరుపుల రమేష్	30
6. కన్నడ కథ - కాలిక స్పృహ	- డా॥. మల్లేశప్ప సిద్రాంపూర్ & - డా॥. శ్రీనివాసరావు కాసర్ల	34
7. జానపద సంప్రదాయ విజ్ఞానం - రజక కులం	- కుడతల యేసుప్రభువు	40
8. "సారాజ్ఞెం" నవల - గ్రామీణ కుల వ్యవస్థ	- పిల్లి ఉషారాణి	44
9. 'అముద్రిత గ్రంథ చింతామణి' పూండ్ల రామకృష్ణయ్య సాహిత్య సేవ	- ఆచార్య డి.వి. శ్రవణ్‌కుమార్	50
10. విడదల సాంబశివరావు - దృశ్య రూపకం, సామాజిక ప్రయోజనం	- టి. డేవిడ్‌రాజు	54
11. వేమన పద్యాలు - నీతి ప్రబోధ గుళికలు	- డా॥. పెండ్యాల లావణ్య & - డా॥. బూసి వెంకటస్వామి	58
12. A study of the similarities, cultural specificities	- Bobita Sarangthem & - Lhingneilam Lhouvum	63
13. Parental Involvement and Academic Stress in Long ...	- Phani Kumari Bavisetty & - Dr. Sangeeta Bhamidipati	69
14. In defense of the Rights of Animals and Birds	- Siva Nagaiah Bolleddu & - Yash Raj	82
15. The Changing Face: The Role of Social Media	- Krishnaiah K	85
16. A Brief Surveryof Historical Novels in Kannada	- Manjegowda. T	91
17. An introduction to Cumbum Kannada	- Dr. M.N. Mahesha	95
18. Absolving the 'Constructed East' and Congratulating ...	- K. Koteshwar & - Mr. Ch. Maruthi	98
19. The Challenges and Job Gratification of Working ...	- Anjali S Babu & - Dr. S.Rajesh Kumar	104
20. The Influenceof Social Media on Purchasing Behaviour..	- R. Archanaa & - Dr. S. Rajesh Kumar	112
21. Witi Ihimaera's Sky Dancer through the lens of Feminism	- V. Jansi & - Dr. T. Jayakumar	118
22. Contemporary Relevance of Modern India by J C Kumarappa	- V. Saranya & - Dr T. Asokan	125
23. Exploring the Sociolinguistic Changes of Kisan Tribe	- Dr. Anup Kumar Kujur	131

BHAVAVEENA
Vol. 19, Issue. 6(1), June 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

'పొత్తి' నవల పాత్రలు – పాత్ర చిత్రణ

– దేవులపల్లి సాయికృష్ణ, పరిశోధక విద్యార్థి తెలుగు విభాగం, కాకతీయ విశ్వవిద్యాలయము.

తెలంగాణ మలిదశ ఉద్యమాన్ని చిత్రించిన నవల 'పొత్తి'. ప్రధాన ఉద్యమ ఘట్టాలకు కేంద్రబిందువైన ఉస్మానియా విశ్వవిద్యాలయం ఇందులో ప్రధానమైన కథాకేత్రం. 2014కు ముందు కాలం ఈ నవలలోని కథా కాలం. ఊరు, ఉస్మానియా విశ్వవిద్యాలయం ఇందులోని ప్రధాన క్షేత్రాలు.

సృజనాత్మక రచయితగా పేరుపొందిన నర్రా ప్రవీణ్‌రెడ్డి 'పొత్తి' నవలను రాశారు. ప్రవీణ్ నల్లగొండ జిల్లాలోని వట్టిమర్తి గ్రామానికి చెందినవాడు. వ్యవసాయిక కుటుంబ నేపథ్యం వాళ్లది. ప్రవీణ్‌రెడ్డి ప్రాథమికోన్నత పాఠశాలలోనూ జూనియర్, డిగ్రీ కళాశాలల్లోనూ ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణుడయ్యాడు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎంఏ తెలుగులో అత్యుత్తమ శ్రేణి సాధించి, స్వర్ణ పథకాన్ని పొందాడు. ప్రవీణ్ ఎంఏ చదువుతున్న రోజుల్లోనే యూజీసి నెట్ అండ్ జేఆర్ఎఫ్ సాధించి తన ప్రతిభను నిరూపించాడు. కుటుంబ నేపథ్యం అంతగా లేకున్నా స్వయంకృషితో, నిర్విరామ శ్రమతో అనవరతం సాహిత్య అధ్యయనంతో అంచెలంచెలుగా ఎదుగుతూ నల్లగొండ మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయంలో తెలుగుశాఖ సాధించేందుకు కృషి చెయ్యడమేగాక, శాఖ ఏర్పిడిన తర్వాత తొట్టతొలి తెలుగు ఆచార్యులు ప్రవీణ్‌రెడ్డి.

ప్రవీణ్‌రెడ్డి చిన్ననాటి నుండే కవిత్వం, కథ, వ్యాసం, పరిశోధనలాంటి అనేక ప్రక్రియల్లో కృషి చేస్తూ మంచి ప్రతిభావంతుడిగా గుర్తింపు పొందాడు. ఈయన రాసిన 'పానం' అనే కథ ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా నిర్వహించిన కథల పోటీలలో ప్రథమ బహుమతిని పొందింది. ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా తెలంగాణ సాహిత్య అకాడమీ నుండి 'తెలంగాణలో తెలుగు శాసనాలు' అనే పరిశోధన వ్యాసానికి, 'తరతరాల తెలంగాణ చరిత్ర' అనే వ్యాసానికి రాష్ట్ర స్థాయి బహుమతులు లభించాయి. ఇవేకాక ప్రవీణ్‌రెడ్డి రాసిన కవితలు, కథలు, వ్యాసాలు, పుస్తక సమీక్షలు అనేకాలు వివిధ పత్రికల్లో ప్రచురిత మయ్యాయి. కరోనాపై 'కాలం బంధించిన క్షణాలు' అనే సంకలనం తీసుకువచ్చాడు. పుల్వామా సంఘటన నేపథ్యంలో వచ్చిన 'ఎవరెస్టు కన్నా ఉన్నతం' కవితా సంకలనానికి సంపాదకత్వం వహించాడు. ఇలా అనేక సాహిత్య ప్రక్రియల్లో విలక్షణంగా కృషి చేస్తూ ఇప్పుడు "పొత్తి" నవలను రాశారు. ఒక చక్కని రచనను తెలుగు సాహిత్యానికి అందించిన ఆదర్శ యువరచయిత నర్రా ప్రవీణ్‌రెడ్డి.

ఇది ప్రవీణ్ మొదటి నవల. అయితే ప్రవీణ్ ఇదివరకు రచించిన రచనలన్నీ ఒక ఎత్తైతే ఈ నవల ఒక్కటే ఒక ఎత్తు. ఎందుకంటే అన్ని సాహితీ ప్రక్రియల కంటే నవలా ప్రకియ చాలా కష్టతరమైంది. ఇతర సాహిత్య ప్రకియలని తనలో ఇముడ్చుకున్న విశాలమైన ప్రక్రియ నవల. నవలలో సమకాలీన జీవితాన్ని లోతుగా, సమగ్రంగా చిత్రించటానికి ఉన్నంత అవకాశం మరే ఇతర సాహిత్య ప్రక్రియకు లేదు. సమకాలీన మహోజ్వల రూపమే నవల. ఈ నవలను ప్రవీణ్ తెలంగాణ మాండలికంలో రాశాడు. పొత్తి అంటే తెలంగాణ వ్యవసాయకంగా ధాన్యరాశి చుట్టూ గీసే రక్షణరేఖ. తెలంగాణ భాష, కవితాత్మక వచనం, ప్రతీకలు, పలుకుబడులు, సామెతలు, సందర్భోచిత పాటలు ఇలా అనేకం ఈ నవలలో విలక్షణంగా సాగాయి. తెలంగాణ భాషా సాహిత్య సాంస్కృతిక వికాసాల్లో భాగంగా ఈ నవలను "తెలంగాణ భాషా సాంస్కృతిక మండలి" ప్రచురించింది.

పొత్తి నవలలో ప్రధాన పాత్రలు గంగ, శంకర్. గంగ, శంకర్ చదువు ద్వారా వికసించిన ప్రేమకు బ్యాక్ డ్రాప్‌గా తెలంగాణ మలిదశ పోరాటం నడుస్తుంది. మలిదశ పోరాట ఘట్టాలు విస్తరించడం, తెలంగాణ రాష్ట్రం ఏర్పడడం, శంకర్ తండ్రి మాల్లారెడ్డి ఆసుపత్రి పాలవడం, మల్లారెడ్డికి గంగ తండ్రి వీరయ్య రక్తాన్ని ఇవ్వడం వలన గంగ, శంకర్ కులాంతర వివాహానికి మార్గం సుగమం కావడం ఇందులోని కథా వస్తువు. మహావిస్తృత నిడివితో రాయగలిగిన వస్తువు పొత్తిలో వుంది. కాని పరిమితమైన నిడివితో ఉద్యమచిత్రణ లక్ష్యంగా సాగిందీ 'పొత్తి'.

పాత్రలు :

నవలేతివృత్తంలో 62 పాత్రలు ప్రత్యక్షంగా ప్రవర్తిస్తాయి. ప్రసక్తి వచ్చిన పాత్రలు 29 ఉన్నాయి. 62 పాత్రలలోనూ ప్రధాన పాత్రలు మొదలుకొని ఒకటి రెండు మాటలు మాట్లాడిన పాత్రలు కలిపి డైలాగ్ ఉన్న పాత్రలు 52 అయితే డైలాగ్ లేని పాత్రలు 10 ఉన్నాయి. ఈ ప్రత్యక్ష పాత్రలలో స్త్రీపాత్రలు 20 కాగా పురుష పాత్రలు 42 ఉన్నాయి. అట్లాగే ప్రసక్తికి వచ్చిన పాత్రలలో స్త్రీ పాత్రలు 5 కాగా పురుష పాత్రలు 24 ఉన్నాయి. నవలేతివృత్తంలో ప్రత్యక్ష, పరోక్ష పాత్రలలో స్త్రీ పాత్రలు 25 కాగా పురుష పాత్రలు 66 ఉన్నాయి.

ఈ మొత్తం పాత్రలలో ఏదో ఒక పేరుతో 20 స్త్రీ పాత్రలు. 45 పురుష పాత్రలు పరిచయమౌతాయి. అలాగే మానవ సమూహాల్లో సంఖ్యా నియమం గల పాత్రలు ఉదా : తన తండ్రి, ఓఎస్పీ, ఓ గాయకుడు, నలుగురు విద్యార్థి నాయకులు, అమ్మఅయ్యలకు వంటి పాత్రలు నవలేతివృత్తలంలో 11 వరకు ఉన్నాయి. అట్లే సంఖ్యా నియమం లేని మానవ సమూహాలు 29 చోట్ల ప్రస్తావన వచ్చింది.

నవలేతివృత్తంలో చిత్రింపబడిన పాత్రలలో కులం పేరుతో సంబంధం గల పాత్రలుకొన్ని కనిస్తాయి. ఉదా॥ గొల్లోల్ల యెంకటమ్మ, సాకలి సాలమ్మ, పెద్దగొల్ల వీరమల్లు, వడ్ల లచ్చువమ్మ బిడ్డ, కుమ్మరి పెద్దులు, సాకలి నర్సిమ్మ, బైండ్ల పాపయ్య, బాలసంతులోడు మొదలగునవి. విశేషణాలతో సంబంధం గల పాత్రలలో ఒక రింగురింగుల జుట్టోడు, సుదరోళ్ల పిల్ల మొదలగునవి కన్పిస్తాయి. వృత్తి హెూదా పేర్లతో గల పాత్రలలో డాక్టర్ దానయ్య, ఆటోడ్రైవర్, గవర్నర్ నరసింహన్, గంటకొట్టే పిచ్చయ్యతాత, హెూమంత్రి, డీజీపి, కానిస్టేబుల్ ఎల్లయ్య, గాయకుడు వెంకన్నన్న, కాలేజి విద్యార్థులు మున్నగు పాత్రలు కన్పిస్తాయి. బంధుత్వ సంబంధం గల పాత్రలలో మల్లారెడ్డి అమ్మ, గొండ్లోల్ల వెంకటగాని నాయన, ఆని కొడుకు నర్సిగాడు, యెంకటమ్మ పెద్దమ్మ, వడ్ల లచ్చువమ్మ బిడ్డ, కుమ్మరి లచ్చువమ్మ మనుమరాలు తదితర పాత్రలు కన్పిస్తాయి.

ఈవిధంగా నవలేతివృత్తంలో రచయిత నర్రా ప్రవీణ్‌రెడ్డి చిత్రించిన ప్రత్యక్ష, పరోక్ష మానవ సమూహాలన్నికలిపి కథా గమనానికి తగిన సామాజిక వాతావరణాన్ని కల్పించటానికి దోహదం చేస్తున్నాయి. 'పొత్త' నవలలేతి వృత్తంలో ప్రధానమైన పాత్రలలో శంకర్, గంగ, మల్లారెడ్డి, యాదమ్మ, వీరయ్య, సోమిరెడ్డి, పుల్లారెడ్డి, రంగారావు, సూరి, రవి మున్నగునవి. ఈ పాత్రల స్వరూప స్వభావాల్ని విశ్లేషించి చూచినట్లయితే, అవి కథాగమనంలో చూపిన ప్రభావం స్పష్టమవుతుంది.

పాత్ర చిత్రణ :

శంకర్ :

1969 తెలంగాణ ఉద్యమంలో తొలుత అమరుడ ైనది 'శంకర్'. అతని పేరే కథానాయకునికి పెట్టాడని రచయిత ముందు మాటలో చెప్పుకున్నాడు. నవలలో ప్రధాన భూమికను పోషించిన శంకర్ నేటి తరానికి ప్రాతినిధ్యం వహిస్తాడు. పల్లెనుండి నగరానికి అడుగులు వేస్తూ తన చదువును నిర్లక్ష్యం చేయకుండానే తన ప్రాంత విముక్తికోసం, పల్లె అభివృద్ధికోసం తపించిపోతాడు. అందుకనుగుణంగా నిర్మాణాత్మకంగా అడుగులు వేస్తూ అందరికి ఆదర్శనీయుడిగా నిలబడుతాడు శంకర్. శంకర్ మల్లారెడ్డి, శారదమ్మల కొడుకు. మల్లారెడ్డి ఆ ఊళ్లో ఒక

వ్యవసాయదారుడు. అమ్మనాన్నలు చేసే కష్టం విలువ శంకర్‌కు బాగా తెలుసు. తన తండ్రి మల్లారెడ్డి పంటకోసం అప్పుతెచ్చిన ప్రతీసారి తన తండ్రికి అప్పుల గురించి భయపడవద్దు నేనున్నాను అని ధైర్యం చెప్తూ ఉంటాడు. శంకర్ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పీజీ రెండవ సంవత్సరం చదువుతుంటాడు. సెలవుల్లో మాత్రమే ఇంటికి వస్తాడు. శంకర్‌లో అభ్యుదయభావాలు, పోరాట తత్వమూ ఉంటుంది. మానవులందరూ సమానమేనని, పేద ధనిక, అగ్రకులాలకు నిమ్నకులాలకూ చెందిన వారంతా సమానమేనని అనే అభ్యుదయభావాలు శంకర్ కుంటాయి. ఉద్యమనాయకునిగా శంకర్ అన్నిదశల్లో ఉత్తమునిగా కనిపిస్తాడు.

వూళ్ళో మంచివ్యక్తిగా, తెలివైనవాడిగా పేరు తెచ్చుకోవడంతో గంగ రాస్తున్న పీజీ పరీక్షలకొరకు సలహాలు అడగడానికి శంకర్ వాళ్ళ పాలం దగ్గరికి వెళ్తుంది. ఆర్థికంగా, సామాజికంగాను క్రింది స్థాయిలో వున్న గంగతో శంకర్ మాట్లాడిన మాటలు, అందించిన ప్రోత్సాహం అతడి సామాజిక చైతన్యానికి నిదర్శనం. శంకర్ చిన్ననాటి నుంచే పేదవాళ్ల గురించి, వాళ్ళ మంచి చెడ్డలగురించే ఆలోచించే గుణం కలిగినవాడు. వూరిలో ఉద్యమకారుల ప్రభావం, చదివిన పుస్తకాల ప్రభావం శంకర్‌ను కులానికి వ్యతిరేకంగా ఆలోచింపజెయ్యగలిగినవి. బాగా చదివే గంగలాంటి పేద అమ్మాయిలకు సహాయపడే గుణాన్ని పెంచింది. గంగ శంకర్‌ని 'పటేలా..' అని సంబోధిస్తుంది. దానికి శంకర్ మనుషులంతా సమానమే. ఈ కులం మసి అంటించుకోకు, చదువుకాడ అందరం ఒక్కటే అని చెప్పడం వలన శంకర్‌లోని సర్వమానవ సమానత్వం తెలుస్తుంది. స్నేహంతో ప్రారంభమైన గంగ, శంకర్‌ల జీవితాలు త్వరలోనే ఒకర్నొకరు ప్రేమించుకొని పెళ్లి చేసుకునే వరకు వెళ్తాయి. అయినా వారు చదువును, ఉద్యమాన్ని విడిచిపెట్టరు.

శంకర్ బాబాయి సోమిరెడ్డి భూమిని కొనడానికి పట్నం నుంచి రియలెస్టేట్ వ్యాపారులు వస్తారు. తన బాబాయి భూమి అమ్మబోతుండని తెలిసి హితవు చెప్తాడు. అయినా సోమిరెడ్డి వినడు. దాంతో శంకర్‌కి కోపం వచ్చి భూమి కొనడానికి పట్నం నుండి వచ్చిన రంగారావు మీదికి శంకర్ పోయి ''మీరు మాకాడి భూములు అడ్డికి పావుశేరుకు కొని లాభంతో అమ్ముకుంటరు. రైతులను మోసం చేస్తున్నరు మీరు. పారేసే ధనాన్ని పెట్టుబడిపెడుతుండ్రు. మా దగ్గరున్న పది రూపాలు మాకు జీవితం. మా ఆర్థిక బలహీనత మీద ఒక వల వేస్తున్నరు మీరు. కన్నతల్ల సొంటి పల్లెను నాశనం జేస్తున్నరు'' అని వారిని గద్దించి వూరినుంచి వెళ్ళగొడతాడు. అయినా శంకర్ మాటలు వినకుండా తన బాబాయి తక్కువ ధరకే పొలాన్ని అమ్మి వచ్చిన డబ్బుతో అప్పులు తీర్చగా మిగిలిన డబ్బును పుల్లారెడ్డి చెప్పుడు మాటలు విని ఫైనాన్స్‌లో పెట్టి, మోసపోయి, పట్నంపోయి కూలీగా మారతాడు. పట్నంలో శంకర్ తన బాబాయిని చూసి ఎంతో దు:ఖించి మళ్లీ ఊరుకి తీసుకువస్తాడు.

జోగినీ వ్యవస్థపై ఎన్నో సంవత్సరాలు తిరుగుబాటు చేసిన శంకర్ మిత్రుడు సూరి విప్లవ పంథాను ఎంచుకొని పోలీసుల చేతిలో మరణిస్తాడు. అహింసతో ఏదీ సాధించలేమంటూ అడివిలోకి పోయిన సూరిని తల్చుకొని 'న్యాయంగ బతికేటోడి బతుకు ఇంతేనా. ఈ పాడు లోకంలోనా మనం బతికేది. ఎంత ఘోరం జరిగిపోయింది. కన్నపేగులు ఎంత కుమిలిపోతున్నాయో...' అని శంకర్ ఎంతో దు:ఖిస్తాడు. మిత్రుడు సూరి మరణించిని తరువాత అతన్ని తలుచుకుంటూ శంకర్ అనుకున్న మాటలు రచయిత ఏ దిశగా అడుగులు వేయాలనుకుంటున్నా డనేది అర్థమవుతుంది.

వచ్చే తెలంగాణని రానివ్వకుండా సీమాంధ్రులు అడ్డుకోవడం వలన తెలంగాణ వస్తదో రాదో అనే దిగులుతో శంకర్ మిత్రుడు రవి అనే విద్యార్థి చెట్టుకు ఉరివేసుకుంటాడు. ఈ విషయాన్ని చెప్పడానికి రచయితకు నేరుగా నోటిమాటరాలేదు. ఆ భయంకర విషాదవేదనాదృశ్యాన్ని ఒక ప్రాజ్ పోయమై రచయిత

కళ్లముందు వేలాడుతాడు. శంకర్ తన మిత్రుడు ఇకలేడని తీవ్ర మనస్తాపానికి లోనవుతాడు.

తెలంగాణ బిల్లును రాజ్యసభల ఆమోదం కానున్నదని సమైక్యవాదులు దానిని అడ్డుకోడానికి ప్రయత్నిస్తారని తెలిసి పోరును కొనసాగిస్తూ క్యాంపస్ విద్యార్థులు క్యాంపస్‌లో ఉన్న పోలీసువ్యానుపై కంకర్రాళ్లను విసురుతారు. పోలీసులు కాల్పులు ప్రారంభించడంతో ముందు వరుసలో ఉన్న శంకర్‌కు తూటాలు తగులుతాయి. శంకర్‌ని అంబులెన్స్‌లో ఆసుపత్రికి చేర్చుతారు. శంకర్ వెంట గంగ వెళ్తుంది. కొడుకు శంకర్ ఆసుపత్రి పాలయ్యాడని తెలిసి తల్లిదండ్రులు ఆసుపత్రికి వస్తారు. ఈ ఉద్యమాలు మనకొద్దూ ఇంటికిపోదాం పద అంటాడు శంకర్ తండ్రి. శంకర్‌కి తల్లిదండ్రులపట్ల అనురాగం ఉంది. అయినా తండ్రి మాటలకు శంకర్ "నాయ్నా.. గీ తెలంగాణొస్తే ఎందరో బాగుపడ్తరే.. వందల మంది ఉరివెట్కిని సచ్చిర్రు నాయ్న. వాళ్లు మా చేతుల పెట్టిన జెండాను దించలేం నాయ్న. దాన్ని గెలిపించాలె. అందుకే ఎన్ని కష్టాలచ్చినా పోరు ఆపం. తెలంగాణ సాధించుకుంటం నాయ్న. తెలంగాణ వచ్చినంకనే నేను వూళ్ళ అడుగుపెడ్త నాయ్న.. తెలంగాణొస్తే బతుకులు బాగుపడుతయయ్యా.." అని అనడంతో తనలో ఒక గొప్ప ఉద్యమ కారుడు కన్పిస్తాడు.

శంకర్ గంగను ప్రేమిస్తున్నాని తన తండ్రికి చెప్పడంతో తన తండ్రి నిరాకరిస్తాడు. పొలంలో మల్లారెడ్డి ప్రమాదవశాత్తు పడి తలకు దెబ్బతగలడంతో రక్తం బాగాపోతుంది. అపుడు గంగ తండ్రి వీరయ్యే తనకు రక్తదానం చేస్తాడు. అపుడు శంకర్ తన తండ్రికి వీరయ్యే ఇచ్చాడని తెలిపి చనిపోయాక అందరం ఒకేచోటుకి పోతాం. కులం మతం అంటే మనుషులు విడిపోతున్నారు. సమాజం ఎత్తుపల్లాలతో కూరుకుపోతున్నది. ఇవ్వన్నీ పోయిన నాడే మనం బాగుపడతం అని తన తండ్రి కళ్లు తెరిపిస్తాడు.

ఈ నవలలో శంకర్ పల్లెనుండి నగరానికి అడుగులు వేస్తూ తన చదువును నిర్లక్ష్యం చేయకుండానే తన ప్రాంత విముక్తికోసం, పల్లె అభివృద్ధికోసం తపించిపోయే వ్యక్తిగా నిలిచిపోతాడు.

గంగ :

"అయిదున్నర అడుగుల ఎత్తు. నిండు బతుకమ్మ లాంటి మొకం. పూరిక్కలసోంటి పెదాలు. సెలయేటి సప్పుడసోంటి మాటలు. యాసమంత ఇసంలేని తనం. అన్నింటికీ మించి మంచి వ్యక్తిత్వం ఆమెసొంత. వూళ్ళ ఆమె సూదరోళ్ళ పిల్లైనా తెలివిగల్లదని మంచిపేరు" ఇది రచయిత వర్ణించిన కథానాయిక గంగ వర్ణన. గంగ పాత్రను అమాయకత్వం, నిర్మలమైన ప్రవర్తనతో ఒక ముద్దమందారంలో తీర్చిదిద్దాడు. గంగ తల్లిదండ్రులు యాదమ్మ, వీరయ్య. గంగ ఒక్కతే కావడంతో ఆమె తల్లిదండ్రులు ఆమెను అల్లారుముద్దగా పెంచుతారు. గంగ ఆ ఊరిలో అందరికంటే ముందే లేచి ఆకిలంతా ఊడ్చి, కల్లాపిచల్లి, ముగ్గేస్తుంది. తల్లి యాదమ్మకు ఏ భాధ కలుగకుండ ముందుముందుగా పనులన్నీ చేసి చదువుకునేది. అమ్మానాన్నలు తన కోసం పడే కష్టాన్ని చూసి వాళ్లు చెప్పే మాటలను ఎప్పుడూ గుర్తుంచుకొని చదువుకుంటుంది. గంగ డిగ్రీ పూర్తి చేసిన తర్వాత యూనివర్సిటీలో సీటు సాధించి సీటు సాధించాలనుకుంటుంది. తల్లిదండ్రులు కూడా గంగ బాగా చదువుతుందని ఆమె చదువుకు ఎలాంటి అడ్డుచెప్పరు.

యూనివర్సిటీలో చదువుతున్న శంకర్ నుంచి సలహాలు పొందితే తను తప్పకుండా యూనివర్సిటీలో సీటు సాధించగలనని అతని కలుసుకోవాలనుకుంటుంది. తల్లి సూచన మేరకు వాళ్ల పొలానికి పనికి పోతుంది గంగ. అదేరోజు శంకర్ పొలానికి వస్తాడు. గంగ శంకర్ దగ్గరికి వెళ్లి ఎలా మాట్లాడాలని సంకోచంలో ఉండగా శంకర్ తనను పలకరించడంతో ఎంతో ఆనందిస్తుంది. గంగ యూనివర్సిటిలో సీటు వస్తాదోరాదో అనే సంకోచాన్ని శంకర్‌కి తెలుపగా శంకర్ మాటల వలన గంగకు కొండత

ధైర్యం వస్తుంది. అక్కడ వాళ్ళు తాటిపండ్లు తిని గింజలు పారవేస్తారు. వాళ్ళ మనసులో తొలిప్రేమ జనిస్తుంది. దాని భవిష్యత్తును సూచిస్తూ 'కుంకమసొంటి మట్టిల పాతిన తాటిగింజలు రేపటి గేగులకు సిద్ధమైతున్నయ్' అని రాస్తాడు. అదేసందర్భంలో 'రేగ్గంపను తొలగించే గంగను చూస్తే కులకంప పల్లెపల్లెనా తొలగుతున్నట్లనిపిస్తుంది. అని కూడా రాస్తాడు.

గంగ పరీక్ష బాగా రాయడంతో యూనివర్సిటీలో సీటు సాధిస్తుంది. తనకు తల్లిదండ్రులను, వూరిని వదిలి వెళ్ళాల్సొనే బాధ ఉన్నా క్యాంపస్‌లో శంకర్‌ను కల్సుకోవచ్చనే ఆనందం కూడా ఉంది. తండ్రి వీరయ్య గంగను యూనివర్సిటీలో దింపి ఇంటికి వెళ్తాడు. తన తండ్రి వదిలి వెళ్తుంటే గంగ ఎంతో దు:ఖిస్తుంది. గంగ క్లాస్‌కు వెళ్లిన మొదటి రోజే శంకర్‌ని చూస్తుంది. శంకర్‌ని చూడగానే తనలో ఏదో ఆనంద, తెలియని వింత అనుభవం కల్గుతుంది. గంగ పట్నం వచ్చినా తన సంస్కృతిని సంప్రదాయాలను మర్చిపోదు. తన రూంలో ఉండే గీత కూడా తనలాంటి అమయాకత్వం, నిర్మలమైన మనస్సుగలది. ఈ ఇద్దరు కాకుండా మరో ఇద్దరు వీరి రూంలో పట్టణం సంస్కృతికి మోజు పడ్డవాళ్ళుంటారు. వీరు గంగ హాస్టల్‌కి వచ్చినప్పటినుండి విచిత్రంగా చూస్తారు. ఇవన్నీ గంగ జీవితంలో వింత అనుభవాలు. కాలేజీలో పరిచయ వేదిక సందర్భంగా లేడీస్ హాస్టల్‌లో అందరూ రెడీ అవుతుండగా పట్టణం సంస్కృతి అలవాటు పడిన పింకీ, సోని గంగను తమలా మార్చాలని ప్రయత్నించగా గంగ వారికి మన వూరు, మన సంస్కృతిని మర్చిపోతే మనం మనుషులం ఎలా అవుతాం అని వారిని ప్రశ్నిస్తుంది. గంగ మాటలకు గీత కూడా వంతపలుకు తుంది. గంగ మాటలకు పింకీ, సోనిలో ఆలోచన మొదలవుతుంది. మట్టిలో కలిసేవరకు మన మూలాలను మర్చిపోకూడదని అనుకోని అందరూ తెలుగుదనం కొట్టొచ్చేలా లంగాఓనిలు వేసుకొని పరిచయ వేదికకు వెళ్తారు.

క్యాంపస్‌కి వచ్చినపుడు అమాయకంగా అనిపించే గంగ విద్యార్థినాయకులు అరెస్టు అయినపుడు వారిని విడుదల చేయాలని లేడీస్ హాస్టల్ నుండి బయల్దేరిన ఒకగుంపుకు గంగ నాయకత్వం వహిస్తుంది. పోలీసుల కాల్పుల్లో శంకర్‌కి తూటాలు తగిలినపుడు అతని వెంట అంబులెన్స్‌లో ఆసుపత్రికి వెళ్తుంది. డాక్టర్ రెండు రోజులు ఇక్కడే ఉండాలన్నపుడు గంగ ఎంతో దు:ఖిస్తుంది. శంకర్ స్పృహలోకి వచ్చేసరికి అతని పాదాలపైనే పడుకొని ఉంటుంది. గంగను శంకర్ అలాగే చూస్తుండగా గంగ మేల్కంటుంది. ఇక్కడి వీరిద్దరు మనస్సువిప్పి మాట్లాడు కొని, ఒకరిప్రేమను ఒకరు తెలుపుకుంటారు. తెలంగాణ వచ్చిన తర్వాత గంగ శంకర్‌తో కలిసి వూరికి వెళ్తుంది. ఇంటికెళ్లాక తల్లి యాదమ్మతో తన ప్రేమగురించి చెప్తుంది గంగ. గంగ అంటే ఎంతో ప్రేమ. కాని తన ప్రేమ విషయం చెప్పగానే తల్లికి ఎంతో కోపం వస్తుంది. మల్లారెడ్డి ఆసుపత్రిపాలవ్వడంతో గంగ తల్లి యాదమ్మతో కలిసి ఆసుపత్రికి వెళ్తుంది. అక్కడే గంగ శంకర్‌లు ఒక్కటవుతారు. గంగ, శంకర్ ప్రేమ సన్నివేశాల్లో హద్దులు మీరకుండా ఔచిత్యపు సరిహద్దుల మధ్య కథ హుందాగా కదిలింది 'పొత్తి'.

ఈవిధంగా ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన కుటుంబాల్లో, పల్లెల్లో జన్మించి బాగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగిన ఎందరో పల్లెపడుచులకు ప్రతీకగా గంగ పాత్ర నిలుస్తుంది.

మల్లారెడ్డి :

శంకర్ తండ్రి, శారదమ్మ మొగుడు. భూమిపై, వూరిపై రైతుకు ఎనలేని ప్రేమ ఉంటుందని చెప్పడంలో ఈ నవలలోని మల్లారెడ్డి పాత్ర ఆదర్శం. మల్లారెడ్డి తమ్ముడు సోమిరెడ్డి భూమి అమ్ముతున్నాడని తెలిసి అమ్మొద్దని వారిస్తాడు. ఇది నచ్చని సోమిరెడ్డి అన్నను బాగా కొడతాడు. ఆ సందర్భంలో చుట్టుప్రక్కల ఉన్న వాళ్ళు అక్కడికి వచ్చి గొడవను ఆపుతారు. వ్యవసాయ దారులతో ఇతర వర్గాల వారికి ఉన్న ఆత్మీయ

అనుబంధం ఈ సంఘర్షణలో తెలుస్తుంది. అదే సంధర్భంలో మల్లారెడ్డి, సోమిరెడ్డిల తల్లి బాధపడిన తీరు, రాత్రి మంచంలో పడుకొని దీర్ఘాలోచన చేస్తూ మల్లారెడ్డి బాధపడిన తీరు పాఠకుడి గుండెను బరువెక్కించకమానవు. తమ్ముడు భూమి అమ్మడం గురించి భార్య శారదమ్మతో మల్లారెడ్డి అన్న మాటలు గమనించదగినవి. "మనకు అంతో ఇంతో బువ్వ బెట్టేది భూమే. మెతుకుబోతే బతుకుబోతదని ఆనికి అర్థమైతలేదే.." అంటాడు. ఎవరిమాటలు వినకుండా సోమిరెడ్డి భూమి అమ్మాడని తెలిసి మల్లారెడ్డి ఎంతో బాధపడతాడు.

శంకర్ ఆసుపత్రి పాలయ్యాడని తెలిసి భార్యతో కలిసి ఆసుపత్రికి వెళ్తాడు మాల్లారెడ్డి. ఈ ఉద్యమాలు మనకు అని చెప్పి కొడుకు శంకర్‌ను వూరికి తీసుకువచ్చే ప్రయత్నం చేస్తాడు మాల్లారెడ్డి. అయినా శంకర్ వినకుండా తెలంగాణ వచ్చేదాకా వూరికి రానని అనడంతో చేసేదేం లేక ఇంటికి బయల్దేరుతారు. తెలంగాణ వచ్చిన తర్వాత కొడుకు ఇంటికి రావడంతో మల్లారెడ్డి కొడుకును చూసి ఎంతో ఆనందిస్తాడు. శంకర్ మీద మల్లారెడ్డికి ఎంత ప్రేమ ఉన్నా కొడుకు ప్రేమ విషయం తెలిసాక కులాలలు వేరు కావడంతో అతని ప్రేమను మాత్రం అంగీకరించడు. ఈ సందర్భంలో కొడుకుపై ఉన్న ప్రేమను కులం అధిగమించిందని చెప్పవచ్చు. తన అనంగీకారాన్ని తెలిపి మల్లారెడ్డి ఇంటి నుండి పాలానికి వెళ్లి అక్కడ ప్రమాదవశాత్తు కిందపడి తలకు గట్టి దెబ్బ తగులి రక్తం బాగా పోతుంది. చుట్టుప్రక్కల ఉన్నవాళ్ళ సహాయంతో వీరయ్య మల్లారెడ్డిని ఆసుపత్రిలో చేర్పించి తను రక్త దాని చేస్తాడు. అనంతరం శంకర్ ద్వారా ఈ విషయం తెలిసుకున్న మల్లారెడ్డి ఆలోచించి గంగ శంకర్‌ల ప్రేమను అంగీకరిస్తాడు.

మల్లారెడ్డి పంట చేతికి రావడంతో కల్లంల ఒడ్లరాశిని కాంట పెట్టడానికి షావుకారు గుమాస్తాను వెంటబెట్టుకొని వస్తాడు. పొత్తి పోయడానికి వీరయ్య బూడిదతో కలిపిన వడ్లను కలిపి శాటల పోసుకొస్తాడు. మల్లారెడ్డి శాటలున్న వడ్లు తీసుకొని పొత్తిపోసి, ఓంకారం గీస్తాడు. మల్లారెడ్డి కల్లనిండా ఒడ్లరాశే కన్పిస్తది. ఇన్ని నెలలు కష్టపడి పండించిన పంట కాసేపట్లో శావుకారి బస్తాల్లోకి పోతుందన్న బాధ మల్లారెడ్డిని కమ్మేస్తుంది.

ఈవిధంగా పల్లెల్లో ఉండి భూమినే నమ్ముకొని బతుకుతున్న ఎందరో అన్నదాతలకు ప్రతీకగా మల్లారెడ్డి పాత్ర నిలుస్తుంది.

యాదమ్మ :

ఈ నవలలో పాఠకుడికి ఇష్టంగా అనిపించే పాత్ర యాదమ్మ. వ్యవసాయం అంటే కేవలం పంట పండించడమే కాదు. పశువులను మేపడం, వాటి ద్వారా ఆదాయాన్ని పొందడం. పొత్తిలో కూడా ఈ విషయం చెప్పబడింది. యాదమ్మ వ్యవసాయ కూలి. భర్త యాదయ్య, కూతరు గంగ. యాదమ్మ చిన్నప్పుడే ఒక బర్రె అర్ణం కింద తన ఇంటికి వస్తుంది. ఆ బర్రె అంటే యాదమ్మకు చాలా ఇష్టం. బర్రెను 'బంగారం'గా ప్రేమించే అంత ఇష్టం. అందుకే ఆ బర్రెను బంగారం అని ముద్దుగా పిలుచుకుంటుంది. పసులపట్ల బర్రె చూపె ప్రేమకు వూళ్ళ ఉన్నోళ్లందరు ఆశ్చర్యపోతుంటారు. అందుకే రచయిత నవలను యాదమ్మ, బంగారంల కథనంతో ఆరంభిస్తాడు. ఆ బర్రెను యాదమ్మ గావురంగా చూసుకున్న తీరు ఆనందాన్ని, పాఠకుడి మొఖంపై చిరునవ్వు వచ్చేలా చేస్తుంది. దానిని తన కూతురైన గంగతో సమానంగా సొంత బిడ్డలా చూసుకుంటుంది యాదమ్మ. బర్రెను చెరువులో స్నానం చేయించడం, గడ్డి మేపించడం, బర్రె అనారోగ్యంగా ఉన్నప్పుడు డాక్టర్లకు చూయించడం, బర్రె ఈనినప్పుడు జాగ్రత్తలు తీసుకోవడం వంటివి యాదమ్మ చేస్తుంది. బంగారం ఈనినపుడు పడేకష్టం, అవస్థను, దాన్ని ప్రాణంగా ఆర్థంగా చూసుకునే యాదమ్మ పడే వేదనను అత్యంత సహజంగా వర్ణించాడు.

యాదమ్మకు తన కూతురు గంగ అంటే ఎంతో ప్రేమ. తన కూతురు గంగ బాగా చదువుతుందని మంచి పేరు ఉండడంతో ఇంకా బాగా చదువించాలని

అంటుంది. గంగ శంకర్‌ను కలిసి సలహాలు సూచనలు పొందాలని తన తండ్రి వీరయ్యకి చెప్తే తను నిరాకరించినా యాదమ్మ మాత్రం గంగ అండగా ఉంటుంది. గంగకు యూనివర్సిటీలో సీటురావడంతో యాదమ్మ ఎంతో సంతోషిస్తుంది కాని తన కూతురు తనను వదలి వెళ్లిపోతుందని మళ్లీ బాధపడుతుంది. గంగ శంకర్‌ని ప్రేమిస్తుందని తెలిసి కూతురు గంగను బాగా తిడుతుంది. తర్వాత వారి సఫలం పొందడంతో ఎంతో సంతోషిస్తుంది.

ఇందులో యాదమ్మ జంతు ప్రేమికురాలిగా, తను కష్టపడి పనిచేసినా తను కూతరు బాగా చదివించాలను కునే ఎందరో తల్లులకు యాదమ్మ ప్రతీకగా నిలుస్తుంది.

సోమిరెడ్డి :

మల్లారెడ్డి తమ్ముడు, శంకర్‌కి బాబాయి. సోమిరెడ్డి అప్పులపావు అవ్వడంతో తన భూమిని అమ్మి ఆ అప్పు తీర్చుకొని, మిగిలిన డబ్బుతో పట్టణానికి వెళ్ళి ఏదైనా వ్యాపారం చేసుకుందామనుకుంటడు. భూమి అమ్మే సమయంలో శంకర్ తనకు భూమి అమ్మకూడదని ఎంత చెప్పినా వినడు. ఆ సందర్భంలో సోమిరెడ్డి ఆవేదనతో చెప్పిన వాక్యాలు గమనించదగినవి. 'అమ్మకేం జేస్తం. భూములల్ల లెస్స పంట పండుతున్నాది. అప్పులోల్లు పీకుతున్నరు. ఎన్ని బోర్లేస్తే ఏం లాభం? గంటెడు నీళ్లెల్లవాయె' అంటాడు. భూమి అమ్మకూడదని అడ్డుపడుతున్న తన అన్న మల్లారెడ్డిని కొట్టడంతో ఆస్తి సంబంధాలలోని వైరం అన్నదమ్ముల మధ్య ఎంత ఘర్షణను సృష్టించగలదో తెలుస్తుంది. రంగారావు అనే రియలెస్టేటు వ్యాపారికి భూమిని తక్కువ ధరకే అమ్ముతాడు. వచ్చిన డబ్బుతో సగం అప్పులకు పోగా మిగిలిన మొత్తాన్ని బ్రోకర్ పుల్లారెడ్డి మాట విని ఫైనాన్స్‌లో పెట్టి మోసపోయి పట్నం చేరి కూలీగా మారతాడు.

ఫైనాన్స్ పేరుతో రైతులు అత్యాశతో ఆర్థికంగా చితికి పోవడం, అవకాశవాదుల మాయమాటల వలన మోసం పోవడం ఈ పాత్ర ద్వారా తెలుస్తుంది.

పుల్లారెడ్డి :

నవలలో చిత్రింపబడిన గ్రామనికి సర్పంచ్ పుల్లారెడ్డి. ఎన్నికల్లో డబ్బులు బాగా రెండుసార్లు సర్పంచ్‌గా ఎన్నికవుతాడు. పంచాయితికి వచ్చే నిధులన్నీ వూరికోసం ఖర్చుచేయకుండా తన జేబులోనే వేసుకుంటాడు. వూరిలో ఒక్కరి దగ్గరకూడా మంచిపేరు లేదు కాని డబ్బులున్న పెద్దమనిషిగా మాత్రం పేరుంది. రంగారావు లాంటి రియలెస్టేట్ వ్యాపారులతో చేతులు కలిపి కమీషన్‌లకై కక్కుర్తిపడి వూళ్ల భూములు అమ్మిపిస్తుంటాడు. అమాయకులను మోసం చేయడం పుల్లారెడ్డికి వెన్నెతో పెట్టిన విద్య.

సోమిరెడ్డికి మాయా మాటలు చెప్పి తన భూమిని రంగారావుకు తక్కువ ధరకే అమ్మించి రంగారావు దగ్గర కమీషన్ పొందుతాడు. సోమిరెడ్డికి తన దగ్గరున్న డబ్బును ఫైనాన్స్‌లో పెడ్తే రెట్టింపు డబ్బు వస్తుందని మాయ మాటలు చెప్తాడు. చివరకు సోమిరెడ్డి పుల్లారెడ్డి మాటలు విని మోసపోతాడు. పరాయి సంస్కృతిని పల్లెకు తెచ్చి తన బాబాయి లాంటి ఎందరో అమాయకులను మోసం చేస్తున్నందుకు శంకర్ పుల్లారెడ్డిని హెచ్చరిస్తాడు. చివరికి శంకర్ మాటలకు భయపడిన పుల్లారెడ్డి కాళ్లబేరానికి వస్తాడు.

పల్లె ప్రజల్లోనూ చోటుచేసుకుంటున్న వ్యాపార ధోరణిని, కమీషన్ల కక్కుర్తిని రచయిత పుల్లారెడ్డి పాత్రద్వారా ఎత్తిచూపాడు.

సూరి :

సూరి శంకర్ మిత్రడు. ఈదమ్మను దేవునికిచ్చి పెళ్ళి చేసినందుకు సూరికి వూరివారంటే కోపం. జోగినీ వ్యవస్థపై పోరాడి జోగినీ అయిన ఈదమ్మను విడిపిస్తాడు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలోనూ సూరి ఉస్మానియా విశ్వ విద్యాలయం కేంద్రంగా చేసుకొని ఉద్యమాన్ని నడిపిస్తాడు. అహింసతో ఏం సాధించలేమంటూ విప్లవ బాటపట్టి పోలీసు ఎన్‌కౌంటర్‌లో హతమవుతాడు. సూరి పాత్ర ద్వారా తెలంగాణలో నెలకొన్న దురాచారాలను,

సమస్యలను విప్లవోద్యమాలను ప్రస్థావించాడు. కరీంనగర్ మారుమూల పల్లెలోంచి వచ్చిన సూరి పాత్ర ద్వారా యువత ఎలా విప్లవోద్యమంలోకి వెలుతున్నారనేది రచయిత సూచిస్తాడు. ఈవిధంగా ప్రత్యక్ష పరోక్ష పాత్రలు పల్లె జీవనాన్ని, తెలంగాణ మలిదశ ఉద్యమ వాతావరణాన్ని కల్పించడానికి దోహదం చేస్తున్నాయి.

ఆధార గ్రంథాలు :

1. 'పొత్తి' నవల - నర్రా ప్రవీణ్‌రెడ్డి
2. నవలా శిల్పం - వల్లంపాటి వెంకటసుబ్బయ్య
3. మన తెలుగు నవలలు - కడియాల రామమోహన రాయ్

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 6(1), June 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

మానవీయ విలువలెన్నో బోధించే మహాభారతం

– డా॥. సూరపరాజు వసంత కుమారి, తెలుగు అధ్యాపకురాలు, శ్రీ గోవిందరాజస్వామి ఆర్ట్స్ కళాశాల, తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

భారతీయ విజ్ఞాన సర్వస్వంగా, లక్ష శ్లోకాలతో పద్దెనిమిది పర్వాలతో ప్రపంచంలో అతి పెద్ద కావ్యంగా, వేదాలలోని పరమార్థాన్నంతా ప్రతిపాదించే పంచమ వేదంగా, వైదిక సంస్కృతిని ప్రతిబింబించే మహాకావ్యంగా, మానవుల పాలిట కల్పవృక్షంగా అలరారుతున్న గొప్ప ఇతిహాసము మహాభారతము. అడిగిన కోర్కెలన్నీ అందించే దివ్య దేవతా వృక్షం పారిజాతం. అలాగే పురుషార్థ ఫలాలతో సహా మానవులకు అవసరమైన అన్ని ఫలాలు అందించే కల్పవృక్షం మహాభారతం. 'యదహాస్తి తదన్యత్ర యన్నేహాస్తి నతత్ క్వచిత్' ఈ కావ్యంలో ఉన్నది ఎక్కడైనా ఉంది. ఈ కావ్యంలో లేనిది ఎక్కడా లేదు. కానీ మహాభారతంలో లేని అంశం మరెక్కడా ఉండదని ఘంటాపథంగా చెప్పడం చేత, ఈ మహాకావ్యం యొక్క గొప్పతనం మరింత ఇనుమడించింది. ఎన్నో అద్భుతమైన విషయాల సమాహారమైన మహాభారతంలో మానవతా విలువలను బోధించే సుగంధ పరిమళాలు వెదజల్లే సుమాలెన్నో వున్నాయి. వానిలో కొన్నింటిని పరిశీలించి వివరించడం జరిగింది.

పాండవుల వనవాసకాలంలో వారు తీర్థయాత్రకు వెళ్ళిన సందర్భంలో, లోమశుడు అనే మహర్షి విభిన్న తీర్థాల మహిమను ధర్మరాజుకు తెలియచేస్తూ, యమునానదికి ఇరువైపులా ప్రవహించే జల, ఉపజల అనే నదుల మహిమను వివరిస్తూ, శిబిచక్రవర్తి యజ్ఞంచేసి ఇంద్రుని మించిన గొప్పస్థానం దక్కించుకొన్న పుణ్య ప్రదేశమని తెలిపి, ఆ చక్రవర్తి గురించి తెలియచేశాడు. ఉశీనర రాజ్యాన్ని పరిపాలించే శిబిచక్రవర్తి ధర్మపరుడు, వీరుడు, శరణాగత రక్షకుడు, మానవతా విలువల పరిరక్షకుడు. ఆ నదీతీరాన యజ్ఞము చేస్తున్న శిబిచక్రవర్తిని పరీక్షించుటకు అగ్నిదేవుడు పావురం, ఇంద్రుడు డేగ రూపాల్ని ధరించారు. డేగ పావురాన్ని తరుముతూ రాగా, యజ్ఞం చేస్తున్న శిబి తొడలపై దాగి ఆ పావురం ప్రాణ భయంతో శిబి శరణుకోరింది. దాన్ని తరుముతూ వచ్చిన డేగ, పావురం శిబిచక్రవర్తి రక్షణలో వుండడంతో, మానవ భాషలో రాజుతో ఇలా పలికింది. రాజా! నీవు గొప్ప ధర్మాత్ముడవని, కళంకం లేని వాడవు అని విన్నాను. నేను, నా పిల్లలు చాలా ఆకలితో వున్నాము. ఈ పావురాన్ని ఆహారంగా స్వీకరించి మేము ప్రాణాలను నిలబెట్టు కొంటాము, దానిని విడిచిపెట్టు. లేదంటే నీవు ఒక్క పావురాన్ని రక్షించి మా కుటుంబంలో చాలా మందిని చంపిన వాడవు అవుతావు, అని డేగ పలికింది.

ధర్మం యో బాధతే ధర్మ: న స ధర్మ: కుధర్మ తత్।
అవిరోధాత్ తు యో ధర్మ: సత్యవిక్రమ్॥
విరోధిషు మహీపాల నిశ్చిత్య గురులాఘనమ్।
న బాధా విద్యతే యత్ర తం ధర్మం సముపాచరేత్॥
(శ్రీ మహాభారతము -రెండవ సపుటం-
వనపర్వము- అధ్యాయం131-శ్లోకాలు -11,12)

ఎవని ధర్మం పరుల ధర్మాన్ని బాధిస్తుందో అది చెడ్డ ధర్మం. అసలు ధర్మమే కాదు. పర ధర్మానికి విరోధం కాని ధర్మమే ధర్మం. పరస్పర ధర్మాలు ఎదురుపడినప్పుడు గురు-లాఘవ (ఎక్కువ - తక్కువ) చర్చ చేయాలి. ఇద్దరికీ బాధలేని ధర్మాన్ని ఆచరించాలి అని, డేగ శిబిచక్రవర్తితో పలికింది.

నీవు ధర్మజ్ఞుడవే, చాలా శుభప్రదంగా మాట్లాడుతున్నావు, కానీ శరణాగతులను విడిచిపెట్టడం మానవత్వం కాదు. నీకు కావాల్సిన ఆహారాన్ని ఈ పావురం కన్నా ఎక్కువగా అందిస్తాను, ఏ జంతువు ఆహారం కావాలో

కోరుకో అని శిబిచక్రవర్తి డేగను కోరాడు. అందుకు డేగ నాకు ఏ జంతువు మాంసము వద్దు. నాకు పావురం మాంసం మాత్రమే కావాలి, దానిని విడిచిపెట్టు అని కోరింది.

రాష్ట్రం శిబీనామృద్ధం వై దదాని తవ ఖేచర।
యం వా కామయసే కామం శ్యేన సర్వం దదాని తే॥
వినేమం పక్షిణం శ్యేన శరణార్థినమాగతమ్।
యేనేమం వర్జయేధాస్త్వం కర్మణా పక్షిసత్తమ॥

(శ్రీ మహాభారతము -రెండవ సంపుటం- వనపర్వము - అధ్యాయం - 131- శ్లోకాలు 21,22)

నీవు కోరిన ఏ వస్తువైనా, చివరికి నా రాజ్యాన్ని అయినా నీకు కావాలంటే అర్పిస్తాను. శరణు కోరివచ్చి ప్రాణభయంతో వణుకుతున్న ఈ పావురాన్ని మాత్రం విడవను. ఏ కోరిక తీరిస్తే ఈ పావురాన్ని విడిచిపెడతావో ఆ కోరిక కోరుకో, తీరుస్తాను, అని శిబిచక్రవర్తి డేగతో పలికాడు.

ఉశీనర కపోతే తే యది స్నేహో నరాధిప।
ఆత్మనో మాంసముత్కృత్య కపోతతులయా ధృతమ్॥
యదా సమం కపోతేన తవ మాంసం నృపోత్తమ్।
తదా దేయం తు తన్మహ్యం సామే తుష్టిర్భవిష్యతి॥

(శ్రీమహాభారతము- రెండవ సంపుటం - వనపర్వము- అధ్యాయము 131-శ్లోకాలు 23,24)

రాజా! నీకు ఈ పావురంపై అంత ప్రేమ ఉన్నట్లయితే దాని శరీర మాంసానికి సమానమైన మాంసాన్ని నీ శరీరం నుండి కోసి త్రాసులో తూచి ఇవ్వు, నాకు తృప్తి కలిగి ఈ పావురాన్ని వదిలేస్తాను, అని డేగ శిబిచక్రవర్తితో పలికింది. నీవు ఇలా కోరడమే నాపై నీవు చూపిన అనుగ్రహంగా భావిస్తాను, ఇప్పుడే నా శరీర మాంసాన్ని కోసి, తూచి ఇస్తాను అని శిబిచక్రవర్తి తన మాంసాన్ని స్వయంగా తానే కోసి పావురాన్ని త్రాసులో ఒకవైపు పెట్టి ఇంకోవైపు తన మాంసాన్ని పెట్టి తూచడం ప్రారంభించాడు.

ధ్రియమాణ : కపోతస్తు మాంసేనాత్యతిరిచ్యతే।
పునశ్చోత్కృత్య మాంసాని రాజా ప్రాదాదు శినర:॥
న విద్యతే యదా మాంసం కపోతేన సమంధృతమ్।
తత్ ఉత్కృత్తమాంసో సౌ ఆరురోహ స్వయం తులామ్॥

(శ్రీ మహాభారతము - రెండవ సంపుటం- వనపర్వము - అధ్యాయము 131- శ్లోకాలు 27,28)

మాంసం వేసే కొద్దీ త్రాసులో రెండవ వైపువున్న పావురం బరువు పెరగసాగింది. శిబిచక్రవర్తి మళ్ళీ మళ్ళీ కోసి తన శరీర మాంసాన్ని వేయసాగాడు. ఎంత కోసివేసినా అది ఆశ్చర్యంగా పావురం బరువుతో సమానం కాక పోతుండటంతో, చివరికి శిబిచక్రవర్తి తానే స్వయంగా వెళ్ళి త్రాసులో కూర్చున్నాడు.

ఇంతలో ఇంద్రుడు అగ్నిదేవుడు డేగ పావురాల రూపం నుండి తమ అసలు రూపానికి మారి, మానవతా విలువల ఆచరణలో నీ ధర్మాన్ని తెలుసుకోవడానికి మేము నీకీ పరీక్ష పెట్టాము అని తెలిపి, శిబిచక్రవర్తి కీర్తి చిరస్థాయిగా వుంటుందని అతనికి స్వర్గలోక ప్రాప్తి కలుగుతుందని దీవించి మాయమయ్యారు.

ఇతర జీవుల రక్షణ, శరణాగత పరిరక్షణ, ఇతరులకు ఉపకారం చేయడానికే మానవులకు ఈ శరీరం వున్నదన్న ఉద్బోధ లాంటి మానవతా విలువలను, పైన పేర్కొన్న శిబివృత్తాంతం ద్వారా, మహాభారతము మానవకోటికి ప్రబోధిస్తూ వున్నది.

మహాభారతంలోని అశ్వమేధపర్వము చతుర్థాశ్వాసములో వైశంపాయ మహర్షి జనమేజయునికి సక్తుప్రస్థుని కథను తెలియచేశాడు. కురుక్షేత్ర యుద్ధంలో విజయానంతరం ధర్మరాజు అశ్వమేధ యాగం చేసి ఋత్విక్కులకు, బ్రాహ్మణులకు, ప్రజలకు అన్నదానాలు, గోదానాలు, ధన దానాలు, భూదానాలు, బంగారు దానాలు విశేషంగా చేశాడు. అప్పుడు అక్కడ వున్న వారంతా ధర్మరాజు దానగుణాన్ని వేయినోళ్ళ పొగడుతూ వుండగా, అక్కడికి ఒక ముంగిస వచ్చింది. దాని శరీర భాగం ఒకవైపు బంగారు వర్ణంలో మెరిసిపోతువుంది. ఇక్కడ కూడా నా ప్రయత్నం వృధా అయ్యింది. ధర్మరాజు

దానగుణం సక్తుప్రస్థుడి దానగుణం ముందు దిగతుడపే అని మానవభాషలో పలికింది. అక్కడవున్నవారు ఆ మాటలు విని నీ ఏ ప్రయత్నం వృధా అయ్యింది? ఎవరా సక్తుప్రస్థుడు అని ఆశ్చర్యంగా అడిగారు. సక్తుప్రస్థుడు మానవతా విలువలు కలిగిన మహాదానగుణ సంపన్నుడు, అతను అతిధి కాళ్ళు కడిగిన ఆ పుణ్య జలాలు తగిలి నా శరీరం ఒకవైపు సువర్ణమయం అయ్యింది. అంతటి గొప్పదానం జరిగే చోటికెళ్ళి నాశరీరపు ఇంకోవైపును కూడా నేను బంగారుమయం చేసుకోవాలని ప్రయత్నం చేస్తూవున్నాను. ఆ ప్రయత్నం ఇక్కడ కూడా వృధా అయ్యింది, అని తెలిపిన ముంగిస సక్తుప్రస్థుడి గురించి అక్కడ వారికి ఇలా వివరించింది.

సక్తుప్రస్థుడు ఒక సాత్విక బ్రాహ్మణుడు. అతను ఏ జీవులకు బాధ కలిగించక, అరిషడ్వర్గాలను జయించిన వాడై, కేవలం పొలాల్లో రాలిన గింజల్ని ఏరుకొని వాటిని ఆహారంగా తీసుకొనేవాడు. అతడితో పాటు అతని భార్య, కుమారుడు, కోడలు వారి కుటుంబంలో నివసించేవారు. ఒక సంవత్సరం వర్షాలు కురవక క్షామం ఏర్పడింది. దానితో వారికి ఆహారం నాలుగురోజుల పాటు లభించక ఆకలితోనే పస్తులున్నారు. తర్వాత రోజువారికి కొన్ని వరిగింజలు లభించాయి. దానితో కొంచెం పేలపిండిని తయారుచేసుకొని నలుగురూ నాలుగు పిడికిళ్ళ పేలపిండిని సమానంగా పల్లెంలో పెట్టుకొని సంధ్యా వందనాది నిత్యకర్మలను పూర్తిచేసి తినడానికి సిద్ధపడ్డారు. సరిగ్గా ఆ సమయానికి ఒక బ్రాహ్మణుడు ఆకలితో అల్లాడిపోతున్నానంటూ వారి ఇంటికి వచ్చాడు. సక్తుప్రస్థుడు ఆ బ్రాహ్మణునికి అతిధి సత్కార్యాలు చేసి, తన భాగం ఆహారాన్ని అతనికి అందించాడు. అతిధి ఆకలి తీరకపోవడంతో తర్వాత సక్తుప్రస్థుడి భార్య ఆహారము, కొడుకు ఆహారము, కోడలు ఆహారము కూడా అతిధికి అందించి, అతని ఆకలిని పోగొట్టాడు. అప్పుడా అతిథి యమధర్మరాజు రూపాన్ని ధరించి, నీవు నాలుగురోజుల నుండి ఆహారం లేక ఆకలితో అల్లాడుతూ కూడా ఎదుటి వారి ఆకలిని తీర్చిన గొప్ప మానవత విలువలు కలిగిన సదాచార సంపన్నుడవు, అతిధిల పట్ల నీకు గల ప్రేమ, భక్తి, శ్రద్ధ, ఓర్పు, మర్యాదలు భారతీయ సంస్కృతికి నిలువెత్తు నిదర్శనాలు, తన కడుపునింపుకొని మిగిలిన దానిని భారీగా దానం చేయడం కన్నా తన కడుపు కాల్చుకొని అయినా సరే తనకున్న దానినే దానం చేయడం ఉత్తమ ధర్మం అని పలికి, సక్తుప్రస్థుడికి అతని కుటుంబానికి స్వర్గప్రాప్తిని వరంగా ఇచ్చాడు, అని ముంగిస అక్కడవున్న వారికి తెలియచేసింది.

ఇతరుల ఆకలిని తీర్చడం, తాను ఆకలితో బాధ పడుతున్నా ఎదుటి వారి ఆకలి బాధను తీర్చడం, తనకున్న దానిని అవసరంలో వున్న ఇతరులకు ఇవ్వడం, అతిథులను సేవించడం, ఇత్యాది మానవతా విలువలను పైన వివరించిన సక్తుప్రస్థుడి కథ ద్వారా మహా భారతం మానవాళికి బోధిస్తూ వున్నది.

పాండురాజుకు అన్నయైన ధృతరాష్ట్రుడు పుట్టు గ్రుడ్డివాడు. గాంధారి ధృత రాష్ట్రులకు వందమంది పుత్రులు, ఒక పుత్రిక. కౌరవులలో పెద్దవాడు దుర్యోధనుడు. ధృతరాష్ట్రుడు ధర్మరాజును యువరాజు చేశాడు. పాండవుల వృద్ధిని, వారి పట్ల ప్రజల ప్రేమను చూచి దుర్యోధనుడు బాధపడి, వారిని వారణావత పురానికి పంపివేయమని తండ్రి ధృతరాష్ట్రుని కోరాడు. పాండవులు అంగీకరించి కుంతి మాతతో కలసి వెళ్ళారు. కౌరవులు కుట్రపన్ని లక్కగృహంలో వారిని చంపడానికి నిప్పు అంటించారు. పాండవులు సొరంగ మార్గం ద్వారా ఆ లక్క ఇంటి నుండి తప్పించుకొన్నారు. కుంతిదేవి తన కుమారులతో కలసి ఏక చక్రపురంలో ఒక బ్రాహ్మణుని ఇంటిలో నివసిస్తూ వుండేది. ఆ పురానికి దగ్గరలోని అడవిలో బకాసురుడనే రాక్షసరాజు వుండేవాడు. రోజుకొకరి ఇంటి వంతుగా ఆ రాక్షసుడికి రెండు దున్న పోతులు, బండెడు ఆహారాన్ని, ఒక మనిషిని పంపాలి. అందులో భాగంగా ఒకనాడు కుంతీదేవి నివసిస్తున్న బ్రాహ్మణుని ఇంటి వంతు వచ్చింది. ఇంటి నుండి

రాక్షసుడికి ఆహారంగా నేను వెళతాను, నేను వెళతాను, అంటూ కుటుంబ సభ్యులైన భార్య, భర్త, కొడుకు, కూతురు, అందరూ భోరున రోదించడం కుంతిదేవి విన్నది. మీకు ఒక్కగానొక్క కొడుకు వున్నాడు. నాకు ఐదుమంది కొడుకులున్నారు, వారిలో నా ఒక్కకొడుకుని మీకు బదులు నేను రాక్షసుడి కడకు పంపుతాను, మీరు బాధపడకండి, అని కుంతి దేవి తెలిపింది. అతిధిగా వచ్చిన మీ ప్రాణాలను పణంగా పెట్టి మేము ఆత్మ రక్షణ చేసుకోవడం ధర్మం కాదు అన్న బ్రాహ్మణుడిని, నా బిడ్డ మహా బలవంతుడు, మంత్ర సిద్ధి గలవాడు, అతనికేమీ హాని కలగదు అని నచ్చజెప్పి, ఒప్పించింది కుంతిదేవి. మనం వీరి వలన ఉపకారం పొందాం, వీరికి నేడు కష్టం వచ్చింది కాబట్టి ప్రత్యుపకారం చేయాలి, అని కుంతి భీమున్ని కోరి, రాక్షసుడి దగ్గరకు భీముడిని పంపింది.

ఏ తావాన్ పురుషస్తాత కృతం న నశ్యతి।
యావచ్చ కుర్యాదన్యోస్య కుర్యాదభ్యధికం తత:॥
(శ్రీ మహాభారతము - 1వ భాగము - ఆదిపర్వము - అధ్యాయం 156- శ్లోకం 14)

ఎవరికి చేసిన ఉపకారం నిరుపయోగం కాదో వాడే నిజమైన పురుషుడు. ఉపకారం చేసిన వానికి అంతకంటే ఎక్కువ మేలు చేయడం మానవత్వం అవుతుంది, అని కుంతి భీముడికి తెలిపింది. భీముడు వెళ్ళి ఆ బకాసురుడనే రాక్షసుడిని చంపివేసి ఆ పుర ప్రజలను ఆ రాక్షసుడి బాధలనుండి విముక్తుడిని చేశాడు.

కోరుకున్నది. నీవు నా భార్య కావడానికి నేనేమి చేయాలో చెప్పు. నా సర్వ సంపదలు, సమస్త రాజ్యమూ నీవే. ఇప్పుడే నీవు నన్ను గాంధర్వ వివాహమాడు, అని శకుంతలతో పలికాడు.

పితాహి మే ప్రభుర్నిత్యం దైవతం పరమం మతమ్।
యస్య వా దాస్యతి పతా సమే భర్తా భవిష్యతి॥
పితా రక్షతి కౌమారే భర్తారక్షతి యౌవనే।
పుత్రస్తు స్థవిరే భావే న స్త్రీ స్వాతంత్ర్య మర్హతి॥
అమన్యమానా రాజేంద్ర పితరం మే తపస్వినమ్।
అధర్మేణ హి ధర్మిష్ఠ కథం వరము పాస్మహే॥
(శ్రీ మహాభారతము - మొదటిభాగము - ఆదిపర్వము -అధ్యాయము 73 - పుట 269)

బాల్య కౌమార్యాలలో తండ్రి, యౌవనంలో భర్త, ముసలితనంలో కొడుకు, స్త్రీని రక్షిస్తూ ఉంటారు. స్త్రీ వారిని కాదని ముఖ్యమైన విషయాలలో నిర్ణయాలు తీసుకోరారు. నా తండ్రే నాకు దైవం, అతడు ఎవరికి నన్నిస్తే అతడే నా భర్త, నా తండ్రి వచ్చే వరకు వేచివుండు, అని శకుంతల దుష్యంతునికి సమాధానమిచ్చింది.

తండ్రి దైవ సమానుడని, తనను అనుక్షణం వివిధ దశలలో రక్షించే తండ్రి, భర్త, పుత్రుడికి తెలియకుండా స్త్రీ తన జీవితంలోని ముఖ్యమైన నిర్ణయాలు తీసుకోరాదు, అనే సందేశాన్ని శకుంతల సమాజానికిచ్చింది.

బ్రహ్మం, దైవతం, ఆర్షం, ప్రాజాపత్యం, ఆసురం, గాంధర్వం, రాక్షసం, పైశాచం అనే ఎనిమిది రకాలైన వివాహాలు ధర్మ సమ్మతమైనవని, స్వాయంభువ మనువు చెప్పినాడని, వానిలో మొదటి ఆరు క్షత్రియులకు ధర్మ సమ్మతాలని, శకుంతల రాజర్షి అయిన విశ్వామిత్రునికి జన్మించడం వలన ఆమె క్షత్రియ కన్య అని, గాంధర్వ వివాహం ద్వారా ఆమె తన భార్య కావడం ధర్మ సమ్మతమే, అని దుష్యంతుడు శకుంతలకు తెలిపాడు.

అది ధర్మ సమ్మతమే అయితే, నా వలన నీకు జన్మించిన కుమారుడే యువరాజై నీ తర్వాత నీ రాజ్యానికి రాజు కావాలన్న నియమానికి నీవు అంగీకరిస్తే, నేను గాంధర్వ వివాహానికి సిద్ధమే, అని శకుంతల దుష్యంతునికి తెలిపింది. అందుకు సమ్మతించిన దుష్యంతుడు శకుంతలను పాణిగ్రహణం చేసి గాంధర్వ వివాహం చేసుకొన్నాడు. వారిరువురూ ఒకటై సుఖించారు.

తమకు పుట్టబోయే కొడుకునే యువరాజుగా చేయాలన్న నియమం, రాజు అయిన దుష్యంతునికే విధించి వివాహానికి ముందే మాట తీసుకొని తర్వాత

పెండ్లికి అంగీకరించడంలో రాజసం, వివేకం, దూరదృష్టి మనకు వ్యక్తమవుతూ వుంది. ఎంత గొప్పవారైనా, ఎంతటి ఆకర్షణ వున్నా, తొందరపడి నిర్ణయాలు తీసుకోకుండా వివేకంతో, ముందుచూపుతో స్త్రీలు ఆలోచించి తదను గుణంగా జీవితంలో ముందుకు వెళ్ళాలనే సందేశాన్ని శకుంతల నేటి సమాజానికి ఇచ్చింది.

దుష్యంతుడు కొంతకాలం శకుంతలతో గడిపాడు, ఆమెకు విశ్వాసం కలిగాక, నేను రాజ్యానికి వెళ్ళి, నీ కోసం చతురంగ బలాలను పంపి తన రాజ సౌధానికి రప్పించు కొంటాను అని చిరునవ్వుతో పలికాడు. శకుంతల కన్నీటితో దుష్యంతుడినికి ప్రదక్షిణ చేసి, అతని పాదాలపై వాలింది. నేను నిన్ను తప్పక తీసుకువెళ్తాను, మన ఎడబాటు స్వల్ప సమయమే విచారించకు, నేనింత వరకు సంపాదించిన నా పుణ్యం సాక్షిగా ప్రమాణం చేస్తూ వున్నా, అని మళ్ళీ మళ్ళీ దుష్యంతుడు శకుంతలకు చెప్పి తన రాజ్యానికి వెళ్ళాడు.

తర్వాత ఆశ్రమానికి వచ్చిన తన తండ్రి కణ్వ మహర్షికి శకుంతల దుష్యంత మహారాజు ఆశ్రమానికి వచ్చాడని, దైవాజ్ఞచే అతనిని తాను పతిగా వరించాను అని, జరిగిన విషయాలన్ని తెలియచేసింది. దివ్య దృష్టితో జరిగినది తెలుసుకొన్న మహర్షి, గాంధర్వ వివాహం క్షత్రియులకు ధర్మమైనదే, నీ పతి యోగ్యుడు. మీకు మహాత్ముడు, మహాబలుడు అయిన పుత్రుడు జన్మిస్తాడు, అతడు ఈ భూమండలాన్ని అంతా దివ్యంగా పరిపాలిస్తాడు, అని కణ్వమహర్షి శకుంతలతో పలికాడు.

తల్లిదండ్రులు లేనప్పుడు జరిగిన విషయాలేవీ దాచకుండా, వారు రాగానే వారికి అన్ని విషయాలు పిల్లలు తెలియచేయాలని, తల్లిదండ్రులు ఎప్పుడూ పిల్లల హితాన్నే కోరుకుంటారని, మంచి విషయాలలో వారి సహాయం, దీవెనలు ఎప్పుడూ పిల్లలకి లభిస్తాయనే సందేశాన్ని శకుంతల నేటి సమాజానికిచ్చింది.

దుష్యంతుడు తన రాజ్యానికి చేరాక సైన్యాన్ని పంపి తనను తీసుకొని వెళ్తాడనే దృఢ నమ్మకంతో శకుంతల ఎదురు చూస్తూనే వుంది, కానీ వారు రాలేదు. శకుంతలా దుష్యంతల కలయిక వలన ఆమె గర్భాన్ని ధరించి, మిక్కిలి తేజస్సుతో అగ్ని వలె ప్రకాశిస్తున్న పుత్రుడికి ఆమె జన్మనిచ్చింది. దేవతలు పూలవర్షం కురిపించారు, ఇంద్రుడు ఆ బాలుడు చక్రవర్తి అవుతాడని, అసమాన బలపరాక్రమాలు కలిగి, నూరు అశ్వమేధయాగాలు, వేలకొలది రాజసూయాది యాగాలు, దానాలు చేస్తాడని పలికాడు. శకుంతల ఆ బాలుడిని వీరునిగా తీర్చిదిద్ద సాగింది. ఆరు సంవత్సరాల ఆ బాలుడు ఆశ్రమ సమీపంలోనికి వచ్చిన సింహాలు, పులులపై ఎక్కి వాటిని లొంగదీసుకొని స్వారీచేయసాగాడు. ఆశ్రమ చుట్టూ ప్రక్కలకు వచ్చిన రాక్షసులను మర్ధించి చంపసాగాడు. ఆ బాలుడు తన పరాక్రమంచే అన్నింటిని అణచివేస్తూ వుండడం వలన ఆశ్రమ వాసులు అతనికి సర్వదమనుడు అని పేరు పెట్టారు. అంతటి తేజస్సు, బలం కలిగిన పుత్రునికి జన్మనివ్వడం వలన శకుంతల వీరమాత అయ్యింది.

కణ్వ మహర్షి శకుంతల, సర్వ దయనులను పిలచి, దుష్యంతుడు స్వయంగా రాలేదనో, తాను వీరిని అతని వద్దకు పిలిపించుకోలేదనో ఆలోచనతోనే కాలం గడిచిపోయింది. మీరే అతని దగ్గరకు వెళ్ళి హాయిగా జీవించండి, అదే ధర్మము అని చెప్పి, వారిని ఆశీర్వదించి, వారికి తోడుగా తన ఆశ్రమ వాసులను పంపి, దుష్యంత మహారాజు చెంతకు వారిని చేర్చమని చెప్పాడు. తండ్రి మాటకు ఎదురు పలకక శకుంతల కణ్వమహర్షికి నమస్కరించి భక్తితో ప్రదక్షిణ చేసి, తండ్రి అనే చనువుతో ఎప్పుడైనా నేను అజ్ఞానంతో పొరపాటుగా మాట్లాడినా, అసత్యం పలికినా, చేయకూడని పని చేసి వున్నా, మీ ఇష్టానికి వ్యతిరేకంగా నడుచుకొని వున్నా నన్ను క్షమించండి, అని ప్రార్థించింది.

తండ్రి, పెద్దల మాటలను గౌరవించడం, వారు ఏమి చేసినా పిల్లల శ్రేయస్సు కోసమే చేస్తారని విశ్వసించడం, వారి పట్ల పిల్లలు తెలియక చేసిన తప్పులను క్షమించమని

వారిని ప్రార్థించడం, ఇలాంటి విశిష్టమైన గుణగణాలతో కూడిన ఆదర్శమైన సంస్కారంతో కూడిన వ్యక్తిత్వాన్ని నేటి తరం కలిగి వుండాలనే సందేశాన్ని శకుంతల నేటి సమాజానికి అందించింది.

శకుంతల తన కుమారునితో కలసి దుష్యంత మహారాజు సభలోనికి ప్రవేశించింది. ఆమెతో పాటు వచ్చిన మునులు శెలవు తీసుకొని తిరిగి కణ్వ ఆశ్రమానికి బయలు దేరారు. దుష్యంతుడు శకుంతలను గుర్తించ నట్లు చూసి, వచ్చిన పని ఏమిటో చెప్పమని అడిగాడు. ఆమె సిగ్గుతో తలవంచుకొని తన పుత్రుడిని చూపి ఇతనే మన కుమారుడు, కణ్వ ఆశ్రమానికి మీరు వచ్చి నన్ను వివాహం చేసుకొని, మనకు పుట్టబోయే పుత్రుడిని ఈ రాజ్యానికి యువరాజును చేస్తానని మాట ఇచ్చిన ప్రకారం ఇప్పుడు మన కొడుకుకి యువరాజ్య పట్టాభిషేకం చేయండి మహారాజా, అని పలికింది. దుష్ట తాపసీ! నీవెవరో, నీకు నాకు వున్న సంబంధం ఏమిటో నాకు గుర్తు రావడం లేదు, నీవు ఇలా అబద్ధాలు ఆడడం తగదు, ఇక్కడ నుంచి వెళ్ళు, అని దుష్యంతుడు శకుంతలతో పలికాడు. వూహించని ఆ సమాధానికి హతాశురాలై దు:ఖం పొంగిపొర్లగా, అవమాన భారంతో కనులు ఎర్రబడగా, ఎగసే కోపాన్ని తప:శక్తితో నిగ్రహించు కొని, శకుంతల ఇలా దుష్యంతునితో పలికింది. మహారాజా! తెలిసిన వాడవై కూడా నాకు తెలియదు అని, ఎలా మాట్లాడగలుగుతున్నావు?

అత్ర తే హృదయం వేద సత్యస్యై వానృతస్యచ।
కళ్యాణం వద సాక్ష్యేణ మాత్మాన మవమన్యథా:॥
యో న్యథా సంత మాత్మాన మన్యథా ప్రతి పద్యతే।
కిం తేనన కృతం పాపం చారేణాత్మాప హరిణా॥

(శ్రీమహాభారతము - 1వ భాగము - ఆదిపరవము - అధ్యయము 74, శ్లోకములు 26-27)

ఈ విషయంలో ఏది సత్యమో, ఏది అసత్యమో నీ అంతరాత్మకే తెలుసు, నీ అంతరాత్మను అవమానించు కోక, అంతరాత్మ సాక్షిగా నీవు నిజం చెప్పు. ఒక విధంగా వున్న తనను వేరొక విధంగా చెప్పేవాడు తనను తాను దొంగలించుకొనేవాడుగా లెక్క. అతడు ఎంతటి పాపాన్నైనా చేస్తాడు, అని శకుంతల దుష్యంతునితో పలికింది.

మన్యతే పాపకం కృత్వా న కశ్చిద్ వేత్తి మామితి।
విదంతి చైనం దేవశ్చ యశ్చై వాంతర పూరుష:॥
ఆదిత్య చంద్రావని లానలౌ చ ద్యౌర్భూమిరాపో హృదయం యమశ్చ।
అహశ్చ రాత్రిశ్చ ఉభే చ సంధ్యే ధర్మశ్చ జానాతి నరస్య వృత్తమ్॥

(శ్రీమహాభారతము - 1వ భాగము - ఆదిపర్వము- అధ్యాయము 74 - శ్లోకములు 29,30)

అసత్యం లేకుండా సత్పురుషులందరికి హితాన్ని కలిగించేది ధర్మమే. పాపం చేస్తూ దాన్ని ఎవరూ తెలుసు కోలేరు అని భావించడం అవివేకం, ఎందుకంటే మనకు కనిపించకుండా వుండే దేవతలకు మన లోపల వున్న అంతరాత్మకు అవి తెలుస్తాయి. సూర్యుడు, చంద్రుడు, వాయువు, అగ్ని, ఆకాశం, భూమి,నీరు, హృదయము, యముడు, అహోరాత్రాలు, ప్రాత:సాయం సంధ్యలు, ధర్మం ఇవన్నీ అణుక్షణమూ మానవుని నడవడిని గమనిస్తూ వుంటాయి. హృదయంలో వున్న కర్మసాక్షి, మనిషి సన్మార్గుడై మంచి పనులు చేస్తూ వుంటే సంతోషించి అతని పాపాలు తొలగిస్తాడు, లేకపోతే ఆ పాపాత్ముడిని యముడే ఈ లోకం నుండి తొలగిస్తాడు. తన్ను తాను మోసం చేసుకొని అసత్యాలు చెప్పుకొనే వానికి దేవతలు కూడా ఎప్పటికి మంచిని చేయలేరు, అని శకుంతల దుష్యంతునితో పలికింది.

సత్యాసత్యాల గురించి మానవుల నడవడిక గురించి, మనిషి మనసులోని అంతరాత్మ గురించి, నిత్యం మానవుడిపనులను గమనిస్తూ వుండే పంచభూతాలు, దేవతలు, కర్మసాక్షి గురించి శకుంతల పైన వివరించిన విషయాలు నేటి సమాజంలోని మానవులందరికీ వారి

సత్ ప్రవర్తనకై దిశా నిర్దేశం చేసి వారి అజ్ఞానాంధకారాలను పారద్రోలే సత్యభాస్కర అక్షర కిరణాలు ఈ సందేశాలు.

అర్ధం భార్యా మనుష్యస్య భార్యా శ్రేష్ఠతమ: సఖా।
భార్యా మూలం త్రివర్గస్య భార్యా మూలం తరిష్యత:॥

భార్యావంత: క్రియావంత: సభార్యా గృహమేధిన:।
భార్యావంత: ప్రమోదంతే భార్యావంత: శ్రియాన్వితా:॥

సఖాయం: ప్రతివిక్తేషు భవంత్యేతా: ప్రియంవదా:।
పితరో ధర్మకార్యేషు భవంత్యార్తస్య మాతర:॥

కాంతరేష్వపి విశ్రామ: జనస్యాధ్వని కస్య వై।
య: సదార: సవిశ్వాస్య: తస్మాద్ దారా: పరాగతి:॥

(శ్రీమహాభారతము - 1వ భాగము - ఆదిపర్వము - అధ్యాయము 74- శ్లోకములు 41,4,2,43,44)

పతికి ప్రాణంలా నడుచుకొనేది, అతనిలో సగభాగం, అతనికి ఉత్తమోత్తమమైన స్నేహితుడు భార్య. ధర్మార్థకామాల సాధనకు పతికి సతియే సాధనము. భార్య కలవారే యజ్ఞాది పుణ్యకార్యాలు చేయడానికి అర్హులు. భార్య కలవారే ఉత్తములైన గృహస్థులు, ఆనందాన్ని పొందగలవారు, భాగ్యవంతులు. భార్యలు భర్తలకు ఏకాంత సమయాలలో మిత్రులుగాను, ధర్మ కార్యాలలో తండ్రులుగాను, కష్టసమయాలలో తల్లులుగాను ప్రవర్తించి అన్ని విధాల తోడు నీడగా వుంటూ శాంతిని కలిగిస్తారు. అందువలన భార్యే భర్తకు ఉత్తమ గతి. భార్య భర్త కంటే ముందే చనిపోతే అతని రాకకోసం పరలోకంలో కూడా ఎదురు చూస్తుంది, భర్త ముందుగా చనిపోతే తానుకూడా అతని వెంట వెళ్తుంది. భార్య పాత్ర అంత గొప్పది. అటువంటి నీ భార్యను అయిన నన్ను నీవు అవమానించడము అధర్మము, అని శకుంతల దుష్యంతునితో పలికింది.

భార్య భర్తల అనుబంధం, భార్య యొక్క ఉత్త మోత్తమైన విధులు, భార్య యొక్క ప్రాధాన్యత, భార్య యొక్క విలువ తదితర ఎన్నో శకుంతల తెలిపిన గొప్ప విషయాలు నేటి సమాజంలోని, ప్రతి భార్య భర్తలకు ఎంతో ఆదర్శనీయం, ఆచరణీయం, సందేశాత్మకం.

కులవంశ ప్రతిష్ఠాం హి పితర: పుత్రను బ్రువన్।
ఉత్తమం సర్వ ధర్మాణాం తస్మాత్ పుత్రం న సంత్యజేత॥
ధర్మకీర్త్యావహా నౄణాం మనస: ప్రీతివర్ధనా:।
త్రాయంతే నరకాజ్జాతా: పుత్రా ధర్మప్లవా: పితౄన్॥
(1-1-74-98,100)

కులానికి, వంశానికీ ప్రతిష్ఠలు కలిగించేవాడు పుత్రుడు. పుత్రుడిని కలిగి వుండడం అన్ని ధర్మాల్లోను ఉత్తమ ధర్మం. అందువలన పుత్రుని ఎప్పుడూ విడచిపెట్టకూడదు. పుత్రులు ధర్మాన్ని కీర్తిని తెచ్చేవారే కాదు, మనసుకు ప్రీతిని కలిగించేవారు, పితృదేవతలను పుణ్యామ నకరం నుంచి రక్షించేవారు కూడా. పుత్రుడు తండ్రియొక్క ప్రతిబింబము, ఆత్మ. అందువలన నీ పుత్రుడిని నీవు విడిచిపెట్టవద్దు, దగ్గరకు తీసుకొని ఆదరించు, నీవు ఇచ్చిన మాట ప్రకారం అతనిని ఈ రాజ్యానికి యువరాజుగా చేయి, అని శకుంతల దుష్యంతునితో పలికింది.

పుత్రుడికి తండ్రికి మధ్య వుండే అనుబంధం, ప్రేమ, వారిరువురి ధర్మాలు, కర్తవ్యాలను నేటి సమాజానికి వివరించి, వాటిని వారు ఆచరించాలనే సందేశాన్ని శకుంతల ఇచ్చింది.

వరం కూపశతాద్ వాపీ వరం వాపీ శతాత్ క్రతు:।
వరం క్రతుశతాత్ పుత్ర: సత్యం పుత్రశతాద్ వరమ్॥
అశ్వమేధ సహస్రం చ సత్యం చ తులయా ధృతమ్।
అశ్వమేధ సహస్రాద్ధి సత్యమేవ విశిష్యతే॥
సర్వవేదాధిగమనం సర్వ తీర్థావగాహనమ్।
సత్యం చ వచనం రాజన్ సమం వా స్యాన్న వాసమమ్॥
నాస్తి సత్యసమో ధర్మ: న సత్యాద్ విద్యతే పరమ్।
నహి తీవ్రతరం కించి దనృతా దిహ విద్యతే॥

(శ్రీమహాభారతము - 1వ భాగము - ఆదిపర్వము - అధ్యాయము 74- శ్లోకములు 102,103,104,105)

మంచినీళ్ళు చేదుకునే నూరు బావులకన్నా ఒక దిగుడు బావి మేలు. అటువంటి దిగుడు బావులు నూరింటి కన్నా ఒక యజ్ఞం మేలు. అటువంటి నూరు యజ్ఞాల కన్నా ఒక పుత్రుడు మేలు. అటువంటి నూరు మంది పుత్రులు కన్నా ఒక సత్యవాక్యం మేలు. వేయి అశ్వమేధ యాగాల ఫలం కంటే ఒక్క సత్యవాక్యమే గొప్పది. అలాగే వేదాలన్నీ చదవడం, అన్ని తీర్థాల్లో స్నానమాచరించడం, ఇవేవి కూడా ఒక సత్యవాక్యంతో సమాన పుణ్య ఫలాన్ని ఇవ్వలేవని ఋషులు తెలిపారు. సత్యంతో సమానమైన ధర్మ లేదు, సత్యమే పరబ్రహ్మం, సత్యమే అన్నింటి కన్నా గొప్ప వ్రతం. కాబట్టి మన గాంధర్వ వివాహం వేళ కణ్వాశ్రమంలో నీవు నాకు చేసిన ప్రతిజ్ఞను గుర్తు చేసుకో, నీకే సత్యం బోధపడుతుంది, అని శకుంతల దుష్యంతుడితో పలికింది.

'సత్యం వద', అన్న ఆర్ష వాక్యాన్ని మించినది లేదని, సత్యాన్ని పలకడం కన్నా గొప్ప ధర్మం లేదని, సత్యాన్ని చెప్పడం ద్వారా వచ్చే పుణ్యఫలాన్ని మించినదేదీ లేదని, ప్రతి ఒక్కరూ ఈ విషయాన్ని గ్రహించి సత్యాన్నే పలకాలని, శకుంతల నేటి సమాజానికి సందేశాన్నిచ్చింది. సాధారణంగా స్త్రీలు అసత్యమాడుతారు. నిన్ను ఇంతకు మునుపు నేను చూడలేదు. ఈ బాలునికి నాకు ఏ సంబంధమూ లేదు. నీ అసత్యాలు ఆపి వచ్చిన దారినే నీ ఆశ్రమానికి వెళ్ళు, అని దుష్యంతుడు శకుంతలతో కఠినంగా పలికాడు. నేను ఇంత చెప్పిన తర్వాత కూడా మీకు సత్యాన్ని కాక అసత్యము పలకడమే ఇష్టమైతే నేను వెళ్ళిపోతాను, మీ లాంటి వానితో కలసియుండడం నాకు కూడా ఇష్టం లేదు, అని శకుంతల ఆవేదనతో పలికి సభ నుండి వెళ్ళడానికి సిద్ధమైంది. అప్పుడు ఆకాశంలో నుంచి అశరీరవాణి ఇలా పలికింది. ''దుష్యంతా! శకుంతల చెప్పినదంతా యదార్థం, నీ భార్య అయిన ఆమె మహాపతివ్రత. మీ ఇరువురి పుత్రుడు అయిన అతను భరతుడనే పేరుతో ఈ రాజ్యాన్ని పరిపాలిస్తాడు, అతని పేరుతోనే ఈ దేశాన్ని భారతదేశం అని పిలుస్తారు, నీవు నీ భార్య పుత్రులను స్వీకరించు'', అని పలికింది. దేవతలు పూల వర్షం కురిపించారు. దుష్యంతుడు తన పుత్రుడిని చెంతకు తీసుకొని ముద్దాడాడు. శకుంతలను పట్టపురాణిగా చేసుకొని గౌరవించి సన్మానించాడు. భరతునికి యువరాజుగా పట్టాభిషేకం జరిపించాడు.

సత్యమేవ జయతే, అన్న పెద్దల వాక్కు ప్రకారం, చివరకు సత్యమే గెలుస్తుందని, మనలో సత్యం, పతివ్రతాధర్మాలు వుంటే ప్రకృతి, దేవతలు, సత్యఫలము ఇవన్నీ మనల్ని రక్షిస్తాయని, అవే మనల్ని గెలిపిస్తాయనే సందేశాన్ని శకుంతల నేటి సమాజానికి అందించినది.

శకుంతల దుష్యంతుల వివాహానికి సాక్షులు ఒక్కరు కూడా లేరు, అందువలన భవిష్యత్తులో జరిగిన పరిణామాలు, ఆమె ఎదుర్కొన్న అవమానాలు మనిషి జీవితంలోని ముఖ్యమైన ఘట్టాలలో సాక్షులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వాటి ప్రాముఖ్యత ఏమిటో నేటి సమాజానికి తెలియచేశాయి. దుష్యంతుడు శకుంతలను నాలుగురోజుల్లో తన రాజ్యానికి పిలిపించుకొంటానని చెప్పిన మాటలు, పుట్టబోయే పుత్రుడినే రాజ్యానికి యువరాజుగా చేస్తానన్న ప్రతిజ్ఞ ఇవేవి రాజు నిలుపుకోలేదు. కాబట్టి ఎదుటి వారి మాటలను నమ్మి మోసపోతున్న నేటి సమాజంలోని ఎందరో కన్యలకు కనువిప్పు కలిగించే సందేశాన్నిస్తూ వుంది శకుంతల జీవితం. భర్తరాని బాధను దిగమింగుకొని, సింహాలతో ఆడుకొనేంత వీరుడిగా, ఈ దేశమే తన పుత్రుడి పేరుతో పిలవబడే అంత అనన్య సామాన్యమైన చక్రవర్తిగా, తన కొడుకును తీర్చిదిద్ది వీరమాతగా, గొప్ప మాతృమూర్తిగా నిలచి, నేటి సమాజాంలోని తల్లుల బాధ్యత ఎంత గురుతురమైనదో శకుంతల తెలియచేసింది. దుష్యంతుని దగ్గరకు వెళ్ళితే నీవు ఎవరో నాకు తెలియదు అన్న ఊహించని అతని మాటలకు అవమాన భారంతో కుమిలిపోయిందే కాని కృంగిపోలేదు, బేలగా మారలేదు. ధైర్యంగా ఎదుర్కొని అంతరాత్మ, భార్య, పుత్రుడు, సత్యము, ధర్మము

వీటన్నింటిని ఆధారంగా నిజాన్ని నిరూపించడానికి ప్రయత్నించి విజయాన్ని సాధించడం ద్వారా, చిన్న చిన్న కష్టాలకు, అవమానాలకు కృంగిపోయి ఆత్మహత్యలు కూడా చేసుకొంటూ వున్న నేటి సమాజంలోని ఎందరో స్త్రీలకు స్ఫూర్తినిచ్చి, ధైర్యంగా వాటిని స్త్రీలు ఎదుర్కొని, విజయాలు సాధిస్తూ సాగిపోయి, తమ జీవితాలను ఆనందమయం చేసుకోవాలనే, సందేశాన్ని నేటి సమాజానికి శకుంతల ఇచ్చింది.

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 6(1), June 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

'పెనుగొండ లక్ష్మి' కవితా వైశిష్ట్యం

– డా॥. వి. లవన్ కుమార్ రెడ్డి, తెలుగు అధ్యాపకులు, సి.యస్.యన్.ఆర్ & యస్.ఆర్.ఆర్.యమ్ డిగ్రీ & పి.జి కళాశాల, కమలాపురం, కడప జిల్లా.

పుట్టపర్తి నారాయణాచార్యులు (1914-1990) ''సరస్వతీ పుత్రుడు''గా సుప్రసిద్ధుడు. విజయనగర చక్రవర్తులకు గురువులైన తాతాచార్యుల వంశంలో పుట్టపర్తి నారాయణాచార్యులు 1914 మార్చి 28న అనంతపురం జిల్లా చియ్యేడు గ్రామంలో జన్మించారు. శ్రీమతి లక్ష్మమ్మ, శ్రీనివాసాచార్యులు వీరి తల్లిదండ్రులు. పుట్టపర్తి నారాయణాచార్యులు 14 భాషలలో పండితులు. ఈ కావ్యం 'పెనుగొండ లక్ష్మి' పుట్టపర్తి వారి ఆదికావ్యం. తర్వాత వీరు 'విద్వాన్' పరీక్షకు చదివే కాలంలో యీ కావ్యమే వీరికి పాఠ్యగ్రంథమైంది.

నారాయణాచార్యులు రచించిన 'శివతాండవం' భక్తిపరమైన గేయకావ్యాలలో అత్యుత్తమముగా తలచదగినది. ఇంకా వీరి ''మేఘదూతం, షాజి, సాక్షాత్కారము, సిపాయి పితూరీ, జనప్రియ రామాయణం, పండరి భాగవతం, శ్రీనివాస ప్రబంధము'' మొదలైన కావ్యాలు రసజ్ఞుల మెప్పు పొందినవి. ''లీవ్స్ ఇన్ ది విండ్'' అనే పేర ఇంగ్లీషులో ఒక కావ్య సంపుటాన్ని రచించాడు. శతాధిక గ్రంథకర్తగా, బహు భాషావేత్తగా, మహాభక్తుడిగా పేరుగాంచిన పుట్టపర్తి నారాయణాచార్యులు 1990 సెప్టెంబర్ 1న కాలధర్మం చెందారు.

కవితా వైశిష్ట్యం :

పుట్టపర్తి నారాయణాచార్యులు ప్రధానంగా భావకవి. ఆంధ్ర చరిత్రలో ప్రాధాన్యం వహించిన ఓరుగల్లు, రాజమహేంద్రవరం, అమరావతి, కొండవీడు, హంపి, పెనుగొండ, ద్రాక్షారామం మొదలైన క్షేత్రాలు భావకవులను ఉత్తేజితులను చేశాయి. ఈయన రాసిన ''పెనుగొండ లక్ష్మి'' కావ్యం అనంతపురం జిల్లాలోని పెనుగొండకు సంబంధించిన ప్రాచీన వైభవాన్ని, పరాక్రమాన్ని తెలియజేస్తుంది.

పెనుగొండ లక్ష్మి కొడాలి వారి హంపీ క్షేత్రానికి 15 సంవత్సరముల ముందే విరచితమైనట్టిది. అనగా ఈ కావ్యం ఆధునిక కాలంలో క్షేత్ర ప్రశస్తికి చెందిన కావ్యములలో మొట్టమొదటిదని చెప్పవచ్చును. ఇది కవిగారు చిన్ననాట రాసినదైనను క్షేత్రప్రశస్తికి చెందిన మిగిలిన కావ్యములకు ఏ మాత్రము తీసిపోదు.

పెనుగొండ లక్ష్మి కావ్యం ఉపోద్ఘాతంలో కవే స్వయంగా ఇలా చెప్పుకున్నాడు.

''ఈ గ్రంథము నా రచనములలో తొలుతటిది. దీనిని వ్రాయు వేళకు నా వయస్సు పండ్రెడు సంవత్సరములు. ఆ నాటికి నాకు ఛందస్సు కూడా రాదు. కాని చిన్ననాటి నుండి తిక్కన భారతమును చదువుట మాత్రము అలవాటు. ఆ వాచక శక్తియే యీ రచనమునకు పునాది. ఆంధ్ర భారతములోని శక్తి అంతటిది''.

12 ఏళ్లకే ఒక కావ్యం రాయడం అభినందనీయం మరియు అతని కవితా పటిమ ఎన్నదగినది.

ఈ కావ్యంలో ''కోట, రాజవీథి, దేవాలయము, శిల్పము'' మొదలైన శీర్షికలతో ఖండికలు ఉన్నాయి. పెనుగొండకు చారిత్రక క్షేత్ర ప్రశస్తి ఉన్నది. శ్రీకృష్ణదేవ రాయల వారి కాలంలో వేసవి విడిది కేంద్రంగా విరాజిల్లుతుండేది. రాయల కాలంలో దానిమ్మ తోటలకు, ద్రాక్ష తోటలకు, లవంగ లతికలకూ ఆకారంగా వుండేదట. కృష్ణదేవరాయల కాలం నాటి కవితా సౌరభాల్ని, శిల్ప కళాప్రశస్తిని మొదలైన లక్షణాల్ని సంతరించుకుని పెనుగొండ లక్ష్మి కావ్యం విశిష్టత పొందింది.

''కోట'' అన్న శీర్షిక క్రింద కవి ఇట్లా చెపుతున్నాడు.

"అది మా కోట, విపక్ష పక్ష హృదయోద్య ద్రక్ష
ధారౌఘముల్
పదివేల్సారులు చప్పరించి, దిశలెల్లన్ దద్దరిల్లంగ బే
రెద గాండ్రించిన యట్టి క్రోలు పులి, నేడీరీతి వాపోవు చు
న్నది, దుర్దాంత జరాభరక్రమ విభిన్నాంగంబులన్
సోదరా"

అంటూ ఒకప్పటి ప్రాభవాన్ని కొనియాడుతూ, ప్రస్తుతం శిథిలమై నిర్జీవమైపోయిందని కవి బాధను వ్యక్తం చేస్తున్నాడు. గత వైభవాన్ని గురించి స్మరించడం భావ కవితా లక్షణం. చారిత్రక ప్రాధాన్యం వున్న కోటల్ని, వివిధ రకాల కట్టడాల్ని పరిరక్షించుకోవాలి. అప్పుడే అదొక చారిత్రక వారసత్వ సంపదగా నిలుస్తుంది. రాజుల పరాక్రమాలను తెలపడమే కాకుండా, కోటల్ని నిర్మించడంలో శ్రామికుల నైపుణ్యం కూడా తెలిసివస్తుంది.

అదే విధంగా పెనుగొండలో దేవాలయ శిల్ప సంపద ఒకప్పుడు అందంగా వుండేది. కవి నివసించిన కాలం నాటికి ఆ దేవాలయం గబ్బిలాలకు కేంద్రమవుతున్నది. "దేవాలయము" శీర్షిక క్రింద ఈ విషయాన్ని కవి వ్యక్తం చేశాడు. "చట్రాళ్ళలో జీవ సౌందర్య మహిమము" నిల్పుకొన్న కళామందిరములోని శిల్పమునుగని దేవాలయం యొక్క అందచందాల్ని, స్వరూపాల్ని చక్కగా చిత్రించారు కింది పద్యంలో.

"ఎట్లు పైకెత్తిరో యేన్గు గున్నలకైన
తలదిమ్ము గొలుపు నీ శిలల బరువు
యే రీతి మలిచిరో యీ స్తంభములయందు
ప్రోవు గ్రమ్మిన మల్లెపూల చాలు
యే లేపనంబున నీ కుడ్యములకెల్ల
దనరించినారొ యద్దాల తళుకు
యే మంత్రమున వెలయించిరో వీనికి
జెడక యుండెడు చిరంజీవ శక్తి
గీ॥ కనివిని యెఱుంగనట్టి దుర్ఘటములైన
పనులు, స్వాభావికముగ నుండినవి వారి
కా మహాశక్తి యే రీతి యబ్బెనొక్కొ
కాలమో ! జీవనమొ ! యేదొ కారణంబు"

ఎట్లా పైకెత్తారో ఈ బరువైన శిలలను, ఎట్లా అందంగా మలిచారో, కలకాలం శిథిలం కాని చిరంజీవ శక్తి వాటికెట్లు వచ్చెనో అని కవి ప్రశ్నిస్తున్నాడు. అలాగే పద్యం చివరలో సమాధానంగా, అప్పటి కాలమో, జీవన విధానమో ఏదో ఒకటి కారణం అయ్యుంటుంది అని జవాబిచ్చాడు. ఇప్పటికీ కొన్ని చారిత్రాత్మకమైన ప్రదేశాలు యాత్రికుల్ని ఆకర్షిస్తూనే వుంటాయి. అందుకు కారణం అప్పటి శిల్ప కళానైపుణ్యం, అపురూపమైన చెక్కుచెదరని చిత్రాల్ని నిర్మించడమే.

పెనుగొండ క్షేత్రంలోని రాజవీథులలో రత్నాలు రాసులు పోసి రేయింబవళ్ళు అమ్మేవారట. బంగారు పల్లకీలలో కవులను కూర్చోబెట్టి పండితులు వారిని కీర్తిస్తుండగా సార్వభౌముడు కృష్ణదేవరాయలు సైతం మోసుకొచ్చిన దృశ్యాన్ని కవి పుట్టపర్తి నారాయణాచార్యులు ఈ కింది పద్యంలో గుర్తుకు తెచ్చాడు.

"కవులన్ బంగరు పల్లకీల నిడి, యుత్కంఠాప్తితో
బండిత
స్తవముల్ మ్రోయగ, రత్నకంకణ ఝణత్కారంబుగా,
నాత్మహ
స్తవిలాసమ్మున, మ్రోసి తెచ్చెనటనౌరా ! సార్వ
భౌముండు, నే
డవలోకింపుము, నీరవంబులయి, శూన్యంబైన వీ
మార్గముల్"

అంటూ కవి జీవించే కాలం నాటికి ఆ 'రాజవీథి' ఎలా నీరవంగా, నిస్తేజంగా మారిందో చెప్పినాడు. కాలమను హొంతకారి మన నుధాజీవనాన్ని చీల్చివైచినదంటూ కవి ఆవేదన వ్యక్తం చేశారు. ఆధునిక కాలంలో కవులను పోషించడం అనేది వుండదు. అయితే గత కాలంలో రాజులు కవులను సత్కరించి సన్మానించిన విషయాన్ని కవి ప్రస్తావించాడు. కళల పట్ల తగిన అభిరుచి కలిగి వుండేవారు ఆనాటి రాజులు. అదేవిధంగా కళాకారు

లను ఆదరించేవారు. ఇటువంటి కళా తృష్ణ వుండటం అనేది సాంస్కృతిక ఔన్నత్యానికి నిదర్శనంగా భావించ వచ్చు.

గత వైభవానికి పరాకాష్టగా "శిల్పము" ను గూర్చి కవి చక్కగా చిత్రించినాడు.

"ఉలిలో, దేనెల సోనలన్జిలికి, యీ యొయ్యారి, చిత్రించు వే
ళల నా శిల్పికి గన్ను గోనలను, ధారల్గట్టెనేమో జలం
బులు, జేదోయి సెమర్చియుండు ననుకొందున్, భావనావేశ భం
గులు, పై పై జెలరేగ, ముద్దుగొనియుండున్ ప్రేమవిభ్రాంతుడై"

ఇప్పటికీ కూడా ప్రాచీన కాలంలో నిర్మించిన దేవాలయాలపై వుండే శిల్ప కళా సౌందర్యం చూపరులను ఆకట్టుకుంటుంది. శిల్పకారులలో వుండే నిశిత నైపుణ్యం ఇందుకు నిదర్శనం. స్త్రీల శిల్పాలను మలిచే క్రమంలో ఆ శిల్పికి కన్నులు చెమర్చడం అనేది అతని సహృదయతకు తార్కాణం. శిల్పి కూడా ప్రేమ విభ్రాంతుడై తాను చెక్కిన శిల్పాన్ని ముద్దుపెట్టుకొని వుంటాడు అని కవి చెప్పడం అమోఘమైన విషయం.

ఈ విధంగా "కోట, రాజవీథి, దేవాలయం, శిల్పము" మొదలైన శీర్షికలతో పెనుగొండ యొక్క ఒకనాటి వైభవ ప్రాభవాలను పుట్టవర్తి వారు 'పెనుగొండ లక్ష్మి' కావ్యంలో విశిష్టంగా కొనియాడిరి.

ఆధార గ్రంథం :

1. పెనుగొండ లక్ష్మి (కావ్యం) - పుట్టపర్తి నారాయణాచార్యులు
2. ఆధునికాంధ్ర కవిత్వము, సంప్రదాయములు - ప్రయోగాలు - డా॥సి. నారాయణ రెడ్డి

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 6(1), June 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

సాహిత్యంలో సమాజ ప్రతి ఫలనం "తీరొక్క ముత్యం"

- గునుగుంట్ల శైలజ, డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకురాలు, హనుమకొండ.

డాక్టర్ కర్రె సదాశివ్, కవి విమర్శకుడు, తెలుగు అధ్యాపకుడిగా ముప్పేట అల్లుకున్న సాహిత్య జీవితం వీరిది. పరిశోధకుడిగా బి.ఎస్.రాములు సాహిత్యంపై విస్తృత పరిశోధన చేశారు. తెలంగాణ సాంస్కృతిక సామాజిక రాజకీయ అంశాల గురించి సునిశిత వ్యాసాలు వెలువరించారు. "తీరొక్క ముత్యం" సాహిత్య వ్యాసాల సంపుటిలో పది వ్యాసాలున్నాయి. డాక్టర్ కర్రె సదాశివ్ ప్రతిభా సామర్థ్యాలను పరిశోధనా గాఢతను మనకు తెలియజేస్తుంది. కాకతీయ రాజులు తొలుత జైన మతాన్ని ఆదరించారు. తర్వాత కాలంలో వీరు జైన మతాన్ని వదిలేసి వీరశైవాన్ని ఆదరించారు. ఆ క్రమంలో కన్నడ ప్రాంతంలో బసవన్న ప్రాచుర్యంలోకి తెచ్చిన వీరశైవం స్వీకరించి, ఎన్నో దేవాలయాలను నిర్మించారు. "వేయి స్తంభాల" గుడి అందులో ఒకటి. తెలంగాణ తొలి తెలుగు కవిగా మనం గౌరవిస్తున్న పాల్కురి సోమనాథుడి శివ భక్తి తత్వాలు మూడు కథలలో రాయటం జరిగింది. పండితారాధ్య చరిత్ర లోని నవరసాల్ని భక్తికి అన్వయించి పాల్కురికి అద్భుతమైన కథలుగా మార్చారు. వీటిలోని మూడు కథలను సోదాహరణంగా వివరించి అందులోని శివ భక్తి తత్వాన్ని తెలిపారు. సూర సానమ్మ కథలో, సుర సానమ్మ పోరండ్ల అనే అగ్రహారంలో నివసిస్తూ ఉంటుంది. ఆమె భర్త మరణించినా కూడా పూర్వం లాగే తన వీరమహేశ్వర ఆచారం కొనసాగిస్తుంది. నిరంతరం జంగామారాధన చేస్తుంది. బ్రాహ్మణ శ్రీ అయి ఉండి విధవరాలి లక్షణాలను ఖాతరు చేయకుండా సాంప్రదాయాన్ని విడిచి ప్రవర్తిస్తుందని, విప్రులు ఆమెపై కక్ష పెంచుకుంటారు. ప్రత్యక్షంగా ఆమె ఇంట్లో అంత్యజుడు ఉన్నట్లు నిరూపిస్తే సురస నమ్మను ఇస్తాను అని నగర అధిపతి బ్రాహ్మణులకు చెబుతాడు.

ఒకరోజు శివుడు చెప్పులు కుట్టే వాడిలా అంత్యజుడు వేషంలో సూర సానమ్మ ఇంటి ముందుకు వస్తాడు. ఆమె పాదాభివందనం చేసి ఇంట్లోకి ఆహ్వానిస్తుంది భోజనం పెడుతుంది. అంత్యజుడైన శివ భక్తుడు శివునితో సమానం అని భావిస్తుంది. ఈ విషయం తెలిసిన బ్రాహ్మణులు సూర సానమ్మ ఇంటి చుట్టూ చేరి గొడవ చేస్తారు. ఇంట్లోకి చేరి అంత్యజుడు కోసం వెతుకుతారు. కానీ ఆ అంత్యజుడు రూపంలో ఉన్న శివుడు మాయమవుతాడు. బ్రాహ్మణులకు అప్పుడు సూరసానమ్మ శివుడు చండాల రూపంలో కేంబావి భోగయ్య ఇంట్లో చచ్చిన దూడ మాంసం తిన్న కథను చెబుతుంది. ఈ కథలో సూర సానమ్మ బ్రాహ్మణ వంశానికి చెందినప్పటికీ తాను పాటించ వలసిన ఆచారాలు వదిలి వేసి శివ భక్తిని ప్రదర్శించింది. అందువల్లేనే సాక్షాత్తు ఈశ్వరుడు కూడా ఆమెను అనుగ్రహించినట్లు ఈ సూరసానమ్మ కథ ద్వారా స్పష్టమవుతుంది. "దాసరయ్య కథ" అసలైన శైవ సిద్ధాంతం హింసను ప్రోత్సహించ లేదని ఈ కథలో మనకు తెలుస్తుంది. దాసరయ్య శివభక్తికి కొందరు దుర్జనులు అసూయ పెంచుకుంటారు. మల్ల లింగం అనే ఒక వికలాంగుడిని జంగమ వేషంలో అలంకరించి దాసరయ్య ఇంటికి పంపిస్తారు. దాసరయ్య నీకు పాదాభివందనం చేస్తున్నప్పుడు నీ చేతులతో అతని తలని పగలగొట్టాలని ఆ దుర్జనులు మల్లం లింగయ్య కు చెప్పడం జరుగుతుంది. అదే విధంగా మల్లం లింగయ్య తన మొండి చేత్తో దాసరయ్య తలమీద కొడుతున్నప్పుడు అతడికి చేతులు మెలుస్థాయి. ఇది చూసి అక్కడ ప్రజలు దాసరయ్య శివభక్తి నీ పొగిడారు. ఈ కథ ద్వారా ఏ మతమైనా తనను హింసించే వారిని కూడా ప్రేమించాలని చెబుతుంది. అదే అసలైన అహింస తత్వం, నీ చెంప మీద ఎవరైనా కొడితే కూడా వేరే చెంప

చూపించడం అహింస సిద్ధాంతాన్ని మహాత్మాగాంధీ బోధించాడు.

''గురుభక్తయ్య కథ'' ఈకథలో దైవం కంటే గురువే గొప్పవాడు అని చెప్పడం జరిగింది. గురుభక్తయ్య గురువు అమర గుండం మల్లన్న గారు. ఒకరోజు అనుకోకుండా గురుభక్తయ్య కాలు అతని గురువు గారి పాదరక్షకులుకు తలుగుతుంది. దానికి గురుభక్తయ్య ఎంతో చింతిస్తాడు. దానిని చాలా పాపంగా భావిస్తాడు. ఎందుకంటే మన హిందూ సాంప్రదాయంలో గురు:బ్రహ్మ గురు: విష్ణు గురుదేవో మహేశ్వర: అని బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులతో సమానమైన స్థానం ఇవ్వబడింది. అసలు 'గురువు' అనే శబ్దమే ఒక గొప్ప మంత్రంగా భావించబడింది. అలాంటిది తన కాలు గురువు చెప్పులకు తగలటంతో గురు బక్తయ్య తన రెండు కాళ్ళని నరుక్కుంటాడు. ప్రాయశ్చిత్తం తో గురువు పాదాలని స్పర్శిస్తూ ఉంటాడు. ఆశ్చర్యంగా గురుభక్తియ్యకి మళ్లీ తన కాళ్లు పుష్పం లాగా వికసిస్తాయి. దీన్ని బట్టి గురుపూజ దైవభక్తితో సమానం అని మనకు తెలుస్తుంది. ఈ కథలో గురువు యొక్క గొప్పతనాన్ని తెలియజేయడం జరిగింది. తెలుగు సాహిత్య వినీలాకాశంలో జాషువా ధ్రువతార జాషువా గారి 'క్రీస్తు చరిత్ర' కావ్యానికి కేంద్ర సాహిత్య అకాడమీ(1965) పురస్కారం వచ్చింది. అలాగే ''కవికోకిల'' విశ్వకవి సామ్రాట్, కళా ప్రపూర్ణ, బిరుదులు పద్మభూషణ్ భారత ప్రభుత్వ పురస్కారం 1970 లో వీరికి రావడం జరిగింది. స్త్రీ పురుషుల మధ్య కొనసాగుతున్న ద్వంద నీతిని అనేక సామాజిక రుగ్మతలను తన రచనల ద్వారా ఖండించాడు జాషువా. ఆయన రచనలు కారుణ్యానికి పట్టం గట్టాయి. కనుకనే జాషువా రచనలకు విశ్వజనీనత అబ్బింది. మహాత్మా గాంధీని అఖండ భారతావని ప్రేమతో బాపూజీ అని పిలుస్తారు, జాతిపితగా కీర్తిస్తారు. జాషువా, తుమ్మల సీతారామ మూర్తి, కాటూరి వెంకటేశ్వరరావు లను తెలుగు సాహిత్యంలో ''గాంధీ త్రయంగా'' ప్రసిద్ధికెక్కినారు. భారత స్వాతంత్ర్య సంగ్రామంలో ప్రజలంతా కుల మత, భేదాలు లేకుండా ఐకమత్యంతో పోరాడారు. కానీ ఆంగ్లేయులు హిందూ-ముస్లింల మధ్య చిచ్చుపెట్టారు 'విభజించు పాలించు' అనే సూత్రాన్ని అనుసరించి అనేక కొట్లాటలకు కారణమయ్యారు. ముస్లింలీగ్ నాయకుడు మహమ్మద్ అలీ జిన్నా ముస్లింలకు ప్రత్యేక దేశం పాకిస్తాన్ కావాలని పట్టుబట్టారు. బాపూజీ ఖండించారు. మహాత్ముని అకాల మరణానికి జాషువా కవి తీవ్రంగా దుఃఖించాడు. అఖండ భారతావని స్వేచ్ఛను ప్రసాదించిన గాంధీజీ ముష్కరుల చేత తుపాకీ గుండ్లకు బలి అయిన తీరు భారతీయులను దుఃఖసాగరంలో ముంచింది. రాజకీయ, సాహిత్య రంగాలలో వీరి సిద్ధాంతాల ప్రభావం బలంగా పడింది. విశ్వ మానవ ప్రేమ గాంధీజీది, విశ్వనరుడు జాషువా వీరి భావాలు ఒక్కటిగా సాగి పోతాయి. గాంధీ ఉద్యమాలను స్వాతంత్ర్య సిద్ధిని సిద్ధాంతాలను బాపూజీ ఖండికలో తెలుపుతారు.

సామాన్య పౌరుడి గొంతుకను తనలో నింపుకున్న కవి శేఖరుడు ప్రజాస్వామ్యంలో పౌరుల కర్తవ్యాన్ని తెలిపిన ప్రజాకవి నిజాన్ని నిర్భయంగా చెప్పిన ధీశాలి, రాజ్యహింసను ప్రశ్నించిన సమాజ సేవకుడు కాళోజీ. నిరాడంబర జీవితం, నిండైన మనిషి కాళోజీ చూస్తే ఒక రుషిలా కనపడతారు. చూపులు తీక్షణత, మాటలతో స్వార్థ పరుల గుండెల్లో చురుకు పుట్టించే శైలి, విన్యాసం కాళోజీ సొంతం. కాళోజీ నిజమైన మానవతా వాది, నిజమైన గాంధేయవాది. గాంధీ సిద్ధాంతాలను ఆకళింపు చేసుకుని నేటికీ ఆచరిస్తున్నారు. ఈవ్యాసంలో ''కాళోజీ కవిత్వం-గాంధీ'' ఎలా కనపడతాడు వివరించాడు. గాంధీ వ్యక్తిత్వం సిద్ధాంతాలను, కాళోజీ కవిత్వంలో చూశాను. కాళోజీ ''నా గొడవ''లోని కవిత్వం అనేక అంశాలపై పదునైన పంక్తులలో వివరించారు. కాలోజి నా గొడవ అనేది భావాల ప్రశ్నల నిధి. బి.ఎస్.రాములు పూర్తిపేరు బేతి శ్రీరాములు. ఆధునిక సామాజిక తత్వవేత్తగా ప్రఖ్యాత కథా రచయితగా తన రచనల ద్వారా సుప్రసిద్ధులు. వీరి కథలు తెలంగాణ ప్రజల జీవన సరళిని సామాజిక అంశాలను చరిత్రను

నిక్షిప్తం చేస్తున్న కాల నాలికలు. 1964 లో బి.ఎస్.రాములు రచనలు ప్రారంభించారు. 1968 నుంచి కథలు రాస్తున్నారు. 1972 నుండి అంబేద్కర్ తూర్పు పదంతో తెలంగాణ దళిత ప్రజల జీవితాలను, ఉద్యమాలను, త్యాగాల చరిత్రను చిత్రించారు వీరి కథల్లో దళితుల ఆత్మవిశ్వాసం పెంచే ప్రతీకలుగా పాత్రలు తీర్చిదిద్దు తారు. 1982 బతుకు పోరు నవల బి.ఎస్.రాములు సాహిత్యంలో ప్రత్యేక గుర్తింపును తెచ్చిపెట్టింది. వీరు అంబేద్కర్ ఆలోచనా విధానంతో కథలు రాస్తున్నారు అంబేద్కర్ విద్య ప్రాధాన్యాన్ని గురించి చదువు అందరికీ గల హక్కు మనిషి బ్రతకడానికి ఆహారం అవసరం అయినట్లే విద్య కూడా అవసరం అని బాబా సాహెబ్ అంబేద్కర్ అంటారు. ఇలా విద్య ప్రాధాన్యతను గురించి ఎదగలేక పోతున్న దళితుల గురించి చిత్రించారు. దళితుల జీవితాల్లో ఆధునిక విద్య తెచ్చిన పరిణామా లను బి.ఎస్.రాములు అనేక కథల్లో చిత్రించారు. అసలు కథలన్నీ అందుకోసమే రాసినట్లు అనిపిస్తుంది. ఆధునిక విద్య ద్వారా అభివృద్ధి అందుకోవడం సాధ్యమవుతుందని, విద్య ప్రాధాన్యతను తద్వారా కలిగే ఆర్థిక,సామాజిక పరిణామాలను ''పాలు'', ''బడి'' ,''సహజాతాలు'', ''మార్పు'', ''స్మృతి '', ''బందీ'', ''రియల్ ఎస్టేట్'', ''తెల్లబట్ట'', ''ఐదవవాడు'' ''చేయూత'', ''వరుసలు'', ''వేదవతి'', ''మలుపులు'', ''ప్రేమికులు'', ''మమతలు'', ''సహజీవనం'', ''వారసత్వం'', ''సంబంధం'' ''పార సైట్లు'', ''వేపచెట్టు'', ''కామన్వెల్త్'' మొదలైన కథలు చిత్రించినారు.

సదువు కథ ప్రస్తుత విద్యా వ్యవస్థ గ్రామీణ మెజారిటీ ప్రజల జీవితాలతో అనుగుణంగా లేదని తెలియజేస్తుంది. 'సదువు' కథలో లచ్చయ్య తన శిష్యుడు గంగాధరి చదువుకోనని మొండి కేయడంతో ఓదార్చి మనసులో ఇలా అనుకుంటాడు. అయినా పాఠాలను అందుకోగల స్థాయి ఉన్న వాడే తన స్వేచ్ఛ కెదో అడ్డంకిగా ఈ చదువు నోట్స్ మారింది అనుకున్నాడు .ఈ పాఠ్య పుస్తకాలు పట్టణ ప్రజల, అగ్ర కులాల మధ్య తరగతి పిల్లల కోసం రాసినట్టు ఉంటాయి. పల్లెటూరి పిల్లలకు అందునా దళితులకు అవి ఏమాత్రం ఆసక్తి లేని విధంగా ఉంటాయి. చిన్నప్పుడు తాను ఎదుర్కొన్న సమస్య? విద్యా వ్యవస్థ గ్రామీణ మెజారిటీ ప్రజలకు, దళితులకు ఆసక్తికరంగా లేకపోవడాన్ని తెలుసుకోవచ్చు. ''బతుకు పయనం'' కథలో తెలంగాణ ప్రజలకు కూడా ప్రపంచీ కరణ తెరిచిన కొత్త ద్వారాలు కనపడతాయి. జీవితంలో ఎన్నడూ ఊహించలేని స్థాయికి అట్టడుగు పేదలు కూడా ఎదిగి అమెరికాలో, ఇంజనీరులై స్థిరపడేదాకా సాగిన ప్రస్థానాన్ని చిత్రిస్తుంది. ఈ కథ ప్రపంచీకరణ లేకపోయి ఉంటే ఆ పల్లెటూరి విద్యార్థికి కనీసం టీచర్ ఉద్యోగమైనా దొరికేదో లేదో తండ్రి కూలి కోసం చేనేత మగ్గం మీద పాత పద్ధతులలో బట్టలు నేస్తాడు. ఎంసెట్లో సీటు రావడంతో కుటుంబం బంధుమిత్రులు అంతా అతని చదివిస్తారు. ఇందుకోసం చెల్లెల్లు చదువు మానేసి బీడీలు చేసి అన్నయ్యకు డబ్బు పంపిస్తుంది. అతడు ఇంజనీరు అయ్యి బెంగళూరులో ఉద్యోగం చేస్తున్నప్పుడు అదివరకే ఆధునిక అభివృద్ధి ని అందుకున్న ఒక బిడీఎల్ ఉద్యోగి అప్పుడప్పుడే ఎదుగుతున్న ఈ ఇంజనీరుకు తన కూతుర్ని ఇస్తాడు. ఇలా రెండు తరాల ముందే ఎదిగిన వారితో సమానంగా చూసే దశ మొదటి దశ. అమెరికాకు వెళ్లడం రెండవ దశ. మూడవ దశగా కాస్త కట్నం ఎక్కువ ఇచ్చి చెల్లెళ్లకు టీచర్ల సంబంధాలను చేయడాన్ని చెప్పవచ్చు. నాలుగవ దశలో తమ బావలను కూడా సాఫ్ట్వేర్ ఇంజనీర్లుగా శిక్షణ ఇప్పించి. అమెరికా రప్పించుకోవడం కోసం ఆలోచన చేస్తాడు. అమెరికాలో ఇలాంటి వాళ్ళు కొందరు కలిసి సాఫ్ట్వేర్ కంపెనీ స్థాపిస్తారు.

భారతదేశంలోని 110 కోట్ల జనాభాలో 35 కోట్ల మంది మధ్య తరగతి స్థాయికి ఎదిగిన వారు ఉన్నారు. ఇందుకు ఆధునిక విద్య ప్రధాన కారణం గా చెప్పవచ్చు. అందువల్ల ఆధునిక విద్య ప్రాధాన్యతను గురించి ఎంతో విస్తారంగా కథలలో రాశారు. దళితులకు పెట్టుబడి పెట్టి, పరి శ్రమలు స్థాపించడం కష్టం. కానీ విద్య అందుకొని

ఎదగడం ఎంతో సులభమని బి.ఎస్.రాములు స్పష్టం చేశారు. తెలంగాణ సాయుధ పోరాటం పరకాల ప్రాంతాన్ని నెత్తుటి ఏరులు పారించింది. అనేక విప్లవ, సామాజిక ఉద్యమాలకు నిలయమైన పరకాల తాలూకా, వెల్లం పల్లి గ్రామం వరంగల్ జిల్లాలో 1955 అక్టోబరు 20 వ తేదీన అనసూయమ్మ, బుచ్చయ్య పుణ్య దంపతులకు జన్మించారు. వల్లంపట్ల నాగేశ్వర్ రావు ప్రజలలో మూఢవిశ్వాసాలను రూపుమాపడానికి మాహీమ! నీ చోటెక్కడ- 1994 వెలువరించినారు. రైతుల ఆత్మహత్యలకు చెలించి మాయాజూదం 2005లో ప్రదర్శించాడు. ఈ రెండు నాటకాలు ఆంధ్రదేశంలో విశేష ఆదరణ పొందినవి. వల్లంపట్ల పురాణ పాత్రలను ఆధునీకరించి జీవితాన్ని గెలుచుకునే మాహీమ!నీ చోటెక్కడ నాటకంలో స్త్రీ పాత్రను చిత్రించారు. రామాయణంలో గౌతముడు అహల్య దంపతులు, వారికి సూర్య ,చంద్రుల వల్ల అహల్య మోసపోవడం, గౌతముడు శపించడం, సంసార జీవితం విచ్ఛిన్నమై పోతుంది. కానీ ఈ నాటకంలో అహల్య పాత్ర శక్తివంతంగా తీర్చిదిద్ద బడింది. పిల్లలు లేని స్త్రీల బలహీనతను ఆసరగా చేసుకుంటున్న దొంగ స్వామి లొంగ తీసుకోవాలని చూస్తాడు. కానీ ఆమె లొంగిపోక ఎదురు తిరుగి ఆత్మ గౌరవాన్ని కాపాడుకుంటుంది. బ్రహ్మానంద స్వామి ఆశ్రమంలో ఎన్ని ప్రలోభాలు పెట్టిన భర్త గౌతమరావును తలుచుకుంటే ఉంటుంది. ఆధునిక స్త్రీకి ప్రతీకగా అహల్య పాత్ర సాగుతుంది. ఈ రెండు నాటకాలలోని స్త్రీపాత్రలు ఆత్మగౌరవం, ఆత్మవిశ్వాసంతో ప్రవర్తిస్తాయి. అహల్య పిల్లలు కావాలని పడే తపన, రామలక్ష్మి పిల్లలు ఎదగాలని ఆరాటం, అహల్య మోసాన్ని ఎదిరిస్తే, రామలక్ష్మి సాంఘిక ఆర్థిక పరిస్థితులను ఎదుర్కొని జీవితంలో గెలుపు దారులు వెతుక్కుంది. వల్లంపట్ల నాటకాలలోని స్త్రీ పాత్రలు మానవత్వం నింపే మణిదీపాలు, వెలుతురు నింపే ''కాంతి రేఖలు''.

విశ్వమానవ కళ్యాణం శ్రీ సంధి రాజా రెడ్డి గారి ఆశయం. ఏ మతమైన మనిషిని మనిషి లా బ్రతకమని బోధిస్తుంది. మానవత్వమే మనిషి మూలధనం. శ్రీ సంధి రాజారెడ్డి కలం నుండి జాలువారిన ''మా మతం, మానవత్వం ''సాంఘిక నాటకం 1976లో రచించినారు. 2: 30 గంటల నిడివి గల ఈ నాటకంను 18 సార్లు ప్రదర్శించారు. ఈ నాటకాన్ని ఆంధ్ర దేశంలోని వివిధ నాటక సమాజాలు బహుమతులను ప్రదానం చేశాయి. భారతదేశంలో సామాజిక రుగ్మతలను, సతీసహగమనం, అంటరానితనం, బాల్య వివాహాలు, పురుషాధిపత్యం, రాజకీయ సంకుచితత్వంను రూపుమాపడానికి అనేక మంది సంస్కర్తలు కృషి చేసినారు. అటువంటి వారిలో అగ్రగణ్యులు కందుకూరి వీరేశలింగం. వారి స్ఫూర్తితో ఈ నాటక రచయిత కృషి చేశారు. ముఖ్యంగా ఈ నాటకంలో తెలంగాణ ప్రాంత పరిస్థితులను కళ్ళకు కట్టినట్లు చూపిస్తుంది. భుజంగరావు భూస్వామి, నిరంకుశుడు.ఈ నాటకంలో ఇతడు విలన్. అతడి కుమారుడు పాణి అభ్యుదయ భావాలు కలవాడు. ఇతడు బడిపంతులు కూతురు అయినా రాణి దళిత స్త్రీని కులాంతర వివాహం చేసుకుంటాడు. అతడి కూతురు కూడా తండ్రికి విరుద్ధ భావాలు కలిగినది, ఆమెకూడా అభ్యుదయ భావాలు కలిగిన యువతి. తను కూడా ''డేని'' అనే క్రైస్తవ యువకుడిని మతాంతర వివాహం చేసుకుంటుంది. సంధి రాజారెడ్డి ''మామతం-మానవత్వం'' నాటకంలో కులం మతం లేని సమాజం కావాలని ఆకాంక్షించారు. సమాజంలోని దురాచారాలను, వరకట్నం, బాల్యవివాహాలు, స్త్రీల అణిచివేత, మరియు అంటరానితనం పోవాలని అంటారు. మతం అనేది మానవత్వం బోధించేదిగా ఉండాలని అంటారు. కులం ఒక కుట్ర మతం ఒక మత్తు అన్నారు. కార్ మార్క్సును ఒకవైపు ఆదర్శంగా తీసుకున్న రాజారెడ్డి శ్రీ కందుకూరి వీరేశలింగం సంస్కరణ వాదం అనుసరించారు. హిందూ సాంప్రదాయంలో పెళ్లి చూపుల నుండి స్త్రీల కష్టాలు ప్రారంభమవుతాయి. వయస్సుకు వచ్చిన యువతుల్లో తమకు ఇష్టం వచ్చిన వ్యక్తిని పెళ్లి చేసుకోవాలని

అనుకుంటారు. సమాజం, కులం, మతం, డబ్బు కారణంగా చాలామంది స్త్రీలు తల్లిదండ్రుల ఆదేశాలతో పెళ్లి చేసుకుని సర్దుకుని బతుకుతున్నారు. మనిషి జీవితంలో అతి ముఖ్యమైన మూడు పండుగలు: పుట్టుక-పెళ్లి - చావు. మనిషి తమ పుట్టుకను చూడలేదు, తన మరణాన్ని చూడలేడు. కానీ పెరిగి పెద్దయిన తర్వాత తమ కళ్ళతో, జ్ఞానంతో తాము చూసుకునే పండగ "పెళ్లి". అందుకే పెళ్లి మాత్రం తమకు ఇష్టం వచ్చిన వ్యక్తిని చేసుకోవాలని తాపత్రయపడతారు. వరకట్నం ఆచారంగా మారి అది స్త్రీలకి శాపంగా పరిణమించింది. ఈ నాటకంలో వాణిని పెళ్లి చేసుకోవాలని వచ్చిన తిమ్మా రావు. అవతారాలతో వరకట్నం మీద ఆశ ఉంటుంది .దానికి వాణి వేసే ప్రశ్నలకు అతని ని దగ్గర సమాధానం ఉండదు .కట్నం తీసుకోవడం తన హక్కుగా భావిస్తారు. డబ్బు తీసుకొని పోషించడం హోటల్ అవుతుంది, కానీ సంసారం కాదు. నా డబ్బుతో నాకు కూడు పెట్టేటప్పుడు నువ్వు నాకు వంట వాడివి అవుతావు. కానీ భర్తవు కాలేవు అని అంటుంది. ఇలా అనేక విషయాల గురించి శ్రీ సంధి రాజారెడ్డి స్త్రీల యొక్క పుట్టుక నుండి తన పెళ్లి వరకు సమాజంలో ఎదుర్కొనే ఒడిదొడుకులను మనకు కళ్ళకు కట్టినట్టు ఈ నాటకంలో చూపించటం జరుగుతుంది. ఈ తీరొక్క ముత్యంలోని ప్రతి వ్యాసం అణిముత్యంలాగ ఉంటుంది. ఇందులోని ప్రతి విషయం సామాన్యుల జీవనాన్ని ప్రతిబింబించేలా ఉంటాయి.

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 6(1), June 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

అతడు అడవిని జయించాడు – ఒక పరామర్శ

– డా॥. జరుపుల రమేష్, హెడ్ & అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు విభాగం, ఖమ్మం.

'అతడు అడవిని జయించాడు' (1985) నవల మానవ జీవిత అన్వేషణను తెలిపే నవల. మానవుడు భౌతికంగా సాధించాలనుకొనే అన్వేషణకు ప్రతిరూపంగా ఈ నవలలో కథను చిత్రీకరించారు. 'అతడు అడవిని జయించాడు' నవలను డా. కేశవరెడ్డి రాశారు. ఈ నవలను చదవిన తర్వాత ఆంగ్ల రచయిత హేమింగ్ వే రాసిన The old man and the sea నవల గుర్తుకు వస్తుంది. ఒక ముసలి వాడు తన పందులు అన్నీ తిరిగి వచ్చినా, అందులో నెలలు నిండిన ఒక సుక్కపంది తిరిగిరాలేదని గమనిస్తాడు. ఈనబోయే పంది అడవిలోకి వెళ్ళి ఎటో మాయమైంది. ఆ పందిని, ఈనిని తర్వాత పంది సులుగులను (పిల్లలను) గుంట నక్కల నుండి, రాబందుల నుండి రక్షించడానికి చేసిన ప్రయత్నం 'అతడు అడవిని జయించాడు' నవల కథా వస్తువు.

కేశవరెడ్డి The old man and the sea నవలలోని కథని అనుసరించినా, చేసిన మార్పులలో మాత్రం ఎంతో తాత్వికత కనిపిస్తుంది. ఒక ప్రయోగం ఉంది. మానవ జీవిన అన్వేషణ ఉంది. నిరంతరం కొనసాగించవలసిన జీవితం ఉంది. నవలకు కావలసిన సన్నివేశాలను ఎన్నుకోవడంలో ప్రతీకాత్మకత ఉంది. కథానాయకుని గురించి స్పష్టంగా వివరించటంలో, భారతీయ నవలా సాహిత్యలో అత్యంత కింది వర్గానికి చెందిన వ్యక్తిని నాయకుడిగా చిత్రించడంలో సామాజిక చైతన్యం ఉంది.

ఈ నవల రాకముందు ఇంత స్పష్టంగా, కిందివర్గానికి చెందిన వారిని ఏ నవలారచయితా నాయకుడిగా పెట్టలేదు. అంతేకాకుండా సర్వసాధారణంగా నాయకుడు లేదా నాయకురాలు ఉన్నత వంశం లేదా ధనవంతుల కుటుంబానికి చెందినవారై ఉంటారు. అయితే వారు పేదల పక్షాన ఉండటం గానీ, తన అస్తినంతటినీ కొల్పోయి నీతి, నిజాయితీని ప్రదర్శిస్తూ వారిని ఆదరించటం గానీ చేస్తుంటారు. ఇటువంటి తరుణంలో సమాజం కోసమే బతకడంగా ఉండే వారి జీవితాన్ని వస్తువుగా స్వీకరించి రాయబడిన నవలలు చాలానే ఉన్నాయి. సమాజంలో అనాగరికంగ జీవిస్తున్నారని చాలామంది భావిస్తున్న గిరిజన తెగకు చెందని వ్యక్తిని నాయకుడిగా చేసి, అతని ప్రతిభను బయటకు తీసి చూపించిన రచయిత రచనానైపుణ్యం ప్రశంసనీయం. అనాగరిక అనేది తిట్టుపదం కాదు. నిందార్థం అసలేకాదు. నిష్కల్మష మైన ఎలాంటి కపటోపాయాలు తెలియని స్వచ్ఛమైన మానవుడు అనే అర్థంలోని అనాగరిక శబ్దాన్ని అర్థం చేసుకోవాలి. ఈ అర్థంలోనే వీరవల్లి వీణావాణి 'ఆంధ్రపత్రిక' లో ఈ నవల పై తమ అభిప్రాయాన్ని రాస్తూ "పందుల్ని మేపుకునే ఓ అనాగరికుడు, అనాముకుడైన ఓ ముసలి వడి కథ యిది" అని వ్యాఖ్యానించిన అభిప్రాయం గమనించదగినది. దాన్ని కొనసాగిస్తూ కూడా రచయిత ఇలా అన్నారు. "పైకి అలా అనిపించినా ఇది ప్రతి మనిషి కథ. తన లక్ష్యసాధన కోసం తన చుట్టు ఉన్న వ్యక్తులతో ధర్మశుద్ధిగాపోరాటం సాగించే ప్రతిమనిషి కథ' కనుక అనాగరికత అనేది స్వచ్ఛతకు, ధర్మబద్ధ జీవనానిక ప్రతీకగా అవగాహన చేసుకోవాలి. కాలక్రమంలో వీటి అర్థాలు మారవచ్చు. కాని ఈ పత్రంలో నేను అనాగరికుడు అనడంలో గల అర్థం కూడా ఇదే.

'అతడు అడవిని జయించాడు' నవలలో కథా నాయకుడు ఒక ముసలివాడు. గిరిజనులలోని ఎరుకల తెగకు చెందినవాడు. అతని వృత్తి ప్రవృత్తి పందులను మేపుకోవడమే. ఆ పందులతో విడదీయరాని సంబందం కలిగి ఉంటాడు. తాను పెంచుకున్న 'సుక్కపంది ఈనే సమయంలో కన్పించకపోయే సరికి ఆందోళన చెందు

తాడు. ఆ ఆందోళన పందిపోతే తనకు నష్టం వస్తుందని కాదు, ఆ పంది ఈనడానికి సిద్ధంగా ఉన్న సమయం. అప్పుడు ఈనడానికి అనేక కష్టాలు పడుతుంటుంది. ఆ స్థితిలో తన బాధలను ఎవరకీ చెప్పుకోలేదు కదా అనుకొని, ఆ పంది గురించే ఆలోచించడం అతనికి ఆ పందికి ఉన్న అనుబంధాన్ని తెలుపుతుంది.

ఇక్కడే రచయిత ఎంతో తెలివిని ప్రదర్శించాడు. ఆ ముసలివాడు తన జీవిత అనుభవమంతా కూడగట్టి పంది వెళ్ళిన దారిలో కన్పించిన గిట్టల ముద్రలను, అక్కడ కారిన బురద నీళ్ళు, తడబడిన అడుగులు తీరులను బట్టి ఆ పంది వెళ్ళిన దారిని కనుగొన్నాడు.

నవలలో ముసలివాడు జీవితం పట్ల ఎంతో లోతైన పరిశీలన గలవాడని తెలుస్తుంది. మానవుడు తన జీవిత కాలంలో మానవులతో పాటు మానవేతరమైన పశు పక్ష్యాదులతో కూడా అనుబంధాన్ని ఏర్పరచుకుంటాడని సూచించారు రచయిత. ఈ దృష్టి గిరిజనుల్లో మరింతగా ఉంటుందని నిరూపించాడు.

పారిపోయిన పంది, పది సలుగులను (పిల్లలను) ఈనుతుంది. వాటిని అడవిలో ఉన్న నక్కలు, రాబందులు తినేయాలని తీవ్రంగా ప్రయత్నిస్తుంటాయి. వాటి నుండి పంది సలుగులను రక్షించడానికి వెడుతున్న ముసలి వాడిని పంది దగ్గరికి రాన్వీదు. అంతేకాకుండా అతని పై దాడి కూడా చేస్తుంది. ఇది ఒక విచిత్రమైన పరిస్థితి.

తనని రక్షించేదేవరో భక్షించదేవరో తెలియని పశు ప్రవృత్తి పందిది. మరోవైపు వస్తున్నది తన యజమానే అయినా, తనను పెంచి పోషించినవాడే అయినా, అతనికంటే అప్పుడే పుట్టిన తన సలుగుల పై మమకారమే ఎక్కువగా ఉంటుంది. ఆ మాతృత్వాన్ని అర్థం చేసు కున్నాడు కాబట్టే ఆ పందిని, పంది సలుగులను రక్షించు కోవాలనుకున్నాడు ముసలివాడు. నిజానికి పెంపుడు జంతువులను ఆవు, గేదె, మేక, కుక్క, మొదలైనవి కూడా సలుగుల్ని ఈనినప్పుడు ఇలాగే ప్రవర్తిస్తాయి. మానవుడికీ పశువులకీ మధ్య సంబంధం, సంఘర్షణ చిత్రీక రించటంలో లోతైన పరిశీలనతో పాటు జీవన సత్యాన్ని విశదీకరిస్తున్నాడు రచయిత.

మానవ జీవన గమనంలో సుఖదు:ఖాలు, బంధాను బంధాలు, మమతానురాగాలు కేవలం మానవులకీ, మానవుల మధ్యేకాదు, మానవేతరమైన పశుపక్ష్యాదులతో పాటు, అనేకాంశాలపై వాటిని పెంచుకుంటారు. అవన్నీ తన వెంటరావని తెలిసినా, అవన్నీ తమవేననే తపన పడుతుంటారు. వాటిని మనం సొంతం చేసుకోవాలను కున్నా వాటి గమ్యాల్ని అవి చేరుకుంటాయి. చివరికి మళ్ళీ మానవులు ఒంటరిగానే అన్నింటినీ వదిలేసి పోవలిసిందే.

అదే, తాను అనుభవించిన దానికంటే మరింతగా తన తర్వాత తరం వాళ్ళు అనుభవించాలనుకుంటూనే, తాను పొందలేనిది లేదా తాను సాధించలేకపోయిందేదో తన తర్వాత తనం వాళ్ళైనా సాధించాలనే అన్వేషణ నిరంతరం జరుగుతూనే ఉంటుంది. అదే 'అడవి' అనే మానవ జీవితంలో వెతుకులాట.

''ఈ మహా ప్రపంచం అంతా ఓ అడవి. ఇందులో మనిషి అంతరాంతరాల్లో ఒంటరివాడు. ఆహారం, నిద్ర, భయం ఇత్యాదులు సర్వప్రాణి కోటికి సమానంగా కావలసినవే. కాని వాటిని పొందటానికి మనిషి పడే అవస్థ ఒక్కొక్కరికి ఒక్కోలాగ వుంటుంది. జయాపజయాలు, కామక్రోధాలు, లోభ, మోహ, మదమాత్సర్యాదులు, సుఖదు:ఖాలు అన్నీ మనిషి అనుభవించాల్సిందే. జీవన సంఘర్షణని, జీవన సమరాన్ని చెబుతూ జీవనతత్వాన్ని ఒక భాష్యకారుడిలా, వేదాంతిలా, నిర్మోహంగా, నిశ్చలంగా చెప్పడమే 'అతడు అడవిని జయించాడు' అని ఈ నవల అని పురాణం సుబ్రహ్మణ్యశర్మ గారు వ్యాఖ్యానించటం ఎంతో వాస్తవానికి దగ్గర్లో ఉంది.

ఆత్మీయతానురాగాలు పెంచుకున్నా తనదంటూ ఓ ప్రత్యేక అనుబంధం ఏర్పడుతున్నప్పుడు, అంతుకు ముందున్న అనుబంధాలన్నీ సమాజంలో పశుపక్ష్యాదులో ఏ మాత్రం జ్ఞానం లేదని భావించే పంది లోకూడా చూపించారు. రచయిత తాను పందినీ, పంది సలుగుల్నీ

రక్షించాలనే తపనే అతను సాధించిన విజయం, అతను చేసిన జీవన పోరాటం. దానితో పాటు మానవ జీవనాన్వేషణ కొనసాగే ఆక్షాంక్షలకు ప్రతిఫలం తన మనవడు దగ్గర వాలిపోవడం. మళ్ళీ పిల్లాడు ఆ ముసలాడిలాగే జీవితాన్వేషణను కొత్తగా అన్వేషించాలని ప్రయత్నించడం మొదలు పెట్టబోతున్నాడనే సూచన ఆ ముగింపులో వుంది.

''తన చుట్టూ ఆవరించిన శక్తులతో మానవుడు నిర్విరామంగా సాగించే పోరాటంలో గెలుపు. ఓటములనేవి నిజంగా పోరాట మార్గాన్ని బట్టి నిర్ణయింపబడతాయి తప్ప పోరాట ఫలితాన్ని బట్టి నిర్ణయింపబడవు. సంకల్ప బలంతో, చిత్తశుద్ధితో పరిపూర్ణమైన పట్టుదలతో ధర్మ బద్ధంగా సాగించిన పోరాటంలో మనిషి ఓడిపోయినా విజేత క్రిందే పరిగణింపబడతాడు. ముసలివాడు చిత్తశుద్ధితో, సంకల్పబలంతో పట్టుదలగా పోరాటం సాగించాడు. అందుకే అతడు అడవితో ఓడిపోలేదు. అతడు అడవిని జయించాడు'' (పుట:79) మానవ జీవనబంధం కొనసాగాలంటే ఈ చక్రం కొనసాగిలి. మనుషులని బ్రతికించి మనిషి చనిపోతాడు.

ఈ నవలలో తాను చెప్పవలసిన అంశాన్ని రచయిత ప్రతీకాత్మకంగా చెప్పాడని ముందే అనుకున్నాం. రచయిత కూడా ఒక సందర్భంలో ఆ విషయాన్ని వివరించాడు. ''కథలో ముసలివాడు' మంచికి ప్రతినిధి. అతనికున్న Disadvantagesను Highlight చేయడానికి అతని చుట్టూ కొన్ని ప్రతికూల పరిస్థితులను సృష్టించాను. అతడు డెబ్భై ఏండ్లు పై బడిన వృద్ధుడు. కథ జరుపుతున్నప్పుడు అతడు అస్వస్థుడు. ఒంటరివాడు. అతనికి చేదోడు- వాదోడుగా వుండే అతని మనుమడు కూడా తన అనుభవరాహిత్యం వల్ల అతనికి చిక్కుల్ని కల్పిస్తాడు. అతడు ప్రాణప్రదంగా ప్రేమించే పంది కూడా అతని మీదకు తిరగబడి పెద్ద Liabilityగా తయారవుతుంది. అతడు తన నెలవుగాని అడవిలో పోరాటం సలపవలసి వస్తుంది. అతడు ఎక్కికూర్చున్న చెట్టు సుంక్రేసుచెట్టు. దాని కొమ్మలు చాలా పెళుసుగా వుంటాయి. తోటి గువ్వ మొదట ముసలివానికి సహాయకారిగా వుండినా, చివరకి అదే అతనికి చేటును తెచ్చి పెడుతుంది. నక్కలు 'చెడు'కు ప్రతినిధులు. ముసలివాడు పరాజితుడ్ని చేయడానికి వాటికి చాలా అడ్వాంటేజెస్ వుంటాయి. ముసలివాడు ఒంటరివాడు. నక్కలు లెక్కకు మిక్కిలిగా వుంటాయి. one against many కథ అడవిలో జరుగుతుంది గనుక వాటికి సంఖ్యాబలమేగాక, స్థానబలం కూడా సమకూరుతుంది. కథాసమయం రాత్రి కావడం కూడా అందుకే''

ఆయన చెప్పడమే కాకుండా ఆ నవల చదివిన వారి అభిప్రాయాల్లో కూడా ఇదే భావన వ్యక్తమవుతుంది. 'ఒకే నవలలో వాచ్యార్థం, వ్యంగ్యార్థం ఇమిడిపోయేలాగు నవల రాయటం కష్టం. అదే కవిత్వమైతే సులభం. అతడు అడవిని జయించాడు అనే నవలను కేశవరెడ్డి గారు సింబాలిక్‌గా రాశారు. మానవుడి పోరాటం ఇందులో వుంది. ఏ పాఠకుణ్ణి అయినా అసాంతం చదివేంచే ఒక గొప్ప గుణం ఈ నవలకుంది. నవలలో మానవ పాత్ర ముసలాడిదొక్కడే. మిగిలిదంతా అడవి పాత్రే. ఒక్క అడవిలోనే కాదు సమాజంలో కూడా ప్రాణమెదిగినంతంగా మనస్సు ఎదగలేదు. అడవి రహస్యాలు అడవికి తెలియవు. మానవ జీవిత రహస్యాలు మానవుడికీ తెలియవు. ముసలివాడు దృష్టిలో మాటల్లో అడవి దాని ప్రవృత్తే వాచ్చం కావచ్చు. రచయిత దృష్టిలో మానవ సమాజానికి ఒక ప్రతీకైతే సుక్కపంది ఈనడం కొత్త సృష్టిని స్ఫురింపచేస్తుంది' అని పురాణం సుబ్రహ్మణ్యశర్మ వ్యాఖ్యానించటంలో ఈ ప్రతీకాత్మకత మరింత చక్కగా స్పష్టమవుతుంది.

మొత్తం మీద ఈ నవలలో ఉన్న సందేశాన్ని అర్థం చేసుకున్నప్పుడు ఈ పత్రాన్ని ప్రారంభిస్తూ ప్రతిపాదించిన విషయాలే, మిగతా వాళ్ళలో చాలామందికి కలిగాయని వివిధ అభిప్రాయాలతో పోల్చి చూస్తే స్పష్టమయ్యింది. ఇంచుమించు ఇదే అభిప్రాయాన్ని సంజీవదేవ్ వ్యక్తం

పరిచారు. 'ఏమి నేర్చుకొన్నాడు మనిషి? పుట్టేంతవరకు తల్లిగర్భంలో అధోచేతనావస్థలో ఉండటం నేర్చుకొన్నాడు. ఇంకేమి నేర్చుకొన్నాడు? పుట్టిన తరువాత మరణించేదాకా బ్రతికివుండటం నేర్చుకొన్నాడు. బ్రతకటం అయిన తరువాత చచ్చిపోవటం నేర్చుకొన్నాడు.వీటన్నిటినీ మనిషి మాత్రమే నేర్చుకోలేదు. మనిషి కానట్టి ఇతర జీవులు కూడ నేర్చుకున్నాయి' అంటాడు.

కనుక, మానవ జీవన అన్వేషణే ఈ నవలలో కనిపించే ఆత్మ. నిరంతరం మానవుడు తన చుట్టూ ఉన్న పశు పక్ష్యాదులతో విడదీయరాని సంబంధాన్ని పెనవేసు కొంటూనే, ఆ అనుబంధాన్ని తుంచుకుంటూనే ఇంకా సాధించాల్సిందేదో ఉందనే ఆశను తరువాత తరం వాళ్ళకి కలిగిస్తూ, తన జీవితాన్నంతటినీ తెలిసో, తెలియకో ప్రయోగాల్ని చేస్తుంటాడు. అందుకే 'అతడు అడవిని జయించాడు' నవల ఒక ప్రయోగం అని మృణాళిని గారి అభిప్రాయంతో నా వ్యాసాన్ని ముగిస్తున్నాను.

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 6(1), June 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

కన్నడ కథ - కాలిక స్పృహ

- డా॥. మల్లేశప్ప సిద్రింపూర్
సహాయ ఆచార్యులు, ప్రచురణల కేంద్రం,
ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

- డా॥. శ్రీనివాసరాళు కాసర్ల
ఆంగ్ల శాఖ, ద్రావిడ విశ్వవిద్యాలయం,
కుప్పం.

స్వాతంత్ర్యానంతరం కన్నడ కథాసాహిత్యంలో చాలా మార్పులు జరిగాయి. మారిన సామాజిక,రాజకీయ, సాంస్కృతిక మార్పులకి అనుగుణంగా కథాసాహిత్య వస్తువు భిన్న స్వరూపాల్ని దాల్చింది. అభ్యుదయ ప్రభావం చల్లబడుతూ ఆధునికత అనే కొత్త దృక్పథం కథాసాహిత్యాన్ని ప్రవేశింపజేసింది. పాశ్చాత్య నూతన తాత్విక చింతన ఈ కాలపు కథకుల్ని గాఢంగా ప్రభావితం చేసింది. స్వాతంత్ర్య అభిలాషతో పోరాడిన ప్రజలకి, స్వాతంత్ర్యం సిద్ధించిన తరువాత కలిగిన నిరాశ, నిస్పృహలు పూర్తి సమాజాన్ని దిక్కుతోచని స్థితిలోకి నెట్టాయి. స్వాతంత్ర్యానికి ముందున్న సామూహికమైన ఆదర్శాలు, రామరాజ్యకల్పన, స్వాతంత్ర్యం తరువాత ఛిద్రమై పోయాయి. భావపూరితమైన, ఆదర్శవంతమైన మార్గాన్ని వదిలి, తాత్విక ఆశయాలకు ప్రేరణనిచ్చే వాస్తవమైన మరియు భాద్యతతో కూడిన జీవితపు బాటని ఎన్ను కోవలసిన వ్యక్తి విశిష్ట సిద్ధాంతపు అన్వేషణకి ఇది సరైన కాలం అనిపించింది. ఇటువంటి సందర్భంలో సామాజిక పరిస్థితుల్లో సంవేదనశీలుడైన రచయిత మనస్సులో కలిగిన uneasyness ఆధునిక (నవ్య) రూపంలో బయటపడింది. వ్యక్తి అంతర్గతాన్ని మరియు అనుభవ విశిష్టతని పొందిన ఈ సాహిత్య ప్రతిమలు, రూపకాల ద్వారా అనుభవాలకు భాషారూపం ఇవ్వటానికి ప్రయత్నించింది. ఈ కాలం కథకుల సాహిత్యానికి స్వానుభవమే మూలద్రవ్యం అయింది. ఇంతకు ముందున్న సాహిత్య మార్గాలో వ్యక్తిని, జీవితాన్ని బయటనుండి చూడటం జరిగింది. వ్యక్తి అంతరంగిక ప్రపంచానికన్నా బాహ్య ప్రపంచానికే ఎక్కువ ప్రాధాన్యత నివ్వటం జరిగింది. కానీ నవ్య కథకులు వ్యక్తి అంతరంగిక జీవితానికి ఎక్కువ ప్రాముఖ్యతనిచ్చారు. తమని తాము పరీక్షించుకుంటూ జీవితాన్ని పరిశీలించటానికి ముందడుగు వేశారు.

వస్తువును ఎన్నుకొన్నది మొదలు కథ నిరూపణ వాడినటువంటి భాష, అనుసరించిన శైలితో పాటు కథల ప్రారంభం మరియు ముగింపుకి కొత్తదనాన్నితెచ్చిన నవ్య కథలు కన్నడ కథాసాహిత్యంలో నూతన అధ్యాయాన్ని ప్రారంభించాయి. ఉన్నత వర్గం, సామాన్యుల జీవన క్రమం, మానసిక విశ్లేషణ, ధ్వాంబిక జీవితపు అర్థరహిత విలువలు, అర్థగర్భిత వ్యంగ్యంతోపాటు నూతనశైలిని అలవర్చుకున్న కథలు ఈ సందర్భంలో పుట్టాయి. వ్యక్తిని నిరంతరం వేధించే ఒంటిరితనం, మానసిక ద్వంద్వాలు, ఆందోళన, అసహాయతల్ని అభివ్యక్తీకరించ టానికి ఈ కాలం నాటి రచయితలు ప్రజ్ఞాప్రవాహతంత్రాన్ని అలవర్చుకున్నారు. వ్యక్తిగత సంవేదనలలోని సమస్త జీవితపు తాత్విక పునాదుల్ని వెలికితీయటానికి ప్రయత్నించారు. అందువల్ల నవ్యకథలు జనవాణి కావటానికి బదులుగా రచయితల ముఖవాణిగా మారాయని అనిపిస్తుంది.

ఈ క్రమంలో రామచంద్రశర్మ గారు 'సెరగిన కెండ' కథ ద్వారా ఈ వర్గపు (పంతపు)ధోరణుల్ని కథారూపంలో వెల్లడించారు. పెళ్ళయిన భర్తను వదిలి ప్రేమించిన వాడితో జీవించి చివరిరోజుల్లో పిచ్చిదైపోయే స్త్రీ వేదన ఈ కథకు వస్తువు. మనోవైజ్ఞానిక అంశాలు ఈ కథని అల్లుకున్నాయి. 'మందారకుసుమ','ఏళనే జీవ', 'బెళగాయితు' వీరి కథా సంపుటాలు. ప్రారంభంలో వీరి కథలు అభ్యుదయ రచయితల ప్రభావానికి లోనైనట్టు

అనిపిస్తుంది. ఎందుకంటే వీరి ప్రారంభకథల్లో కన్పించే వ్యక్తి, సమాజం, పెళ్ళి, ప్రేమ, ప్రణయం, కామం, అంటరానితనం, అసమానత వంటి సమస్యలు అంతకు ముందే అభ్యుదయ రచనల్లో కనిపిస్తాయి. ఆ ప్రభావం నుండి బయటపడాలనే ఆలోచనతోనే కథన శిల్పానికి ఇంతకుముందెన్నడులేని ప్రాముఖ్యతనిచ్చి ప్రతిమ సంకేతాల్ని ఎక్కువగా వాడసాగారు. వీరి కథాశిల్పాన్ని గమనిస్తే రామచంద్రశర్మ గారు భావకవిత్వం కన్నా భిన్నంగా అభ్యుదయవాదుల్ని అనుసరించినప్పటికీ నవ్యతలో(ఆధునిక) నూతనత్వాన్ని తీసుకురావటానికి వీరు చేసిన కృషి చెప్పుకోదగింది.

ప్రారంభంలో వీరి కథలకు వస్తువుగా ఉన్న కామం, విస్మయానికి, కుతూహలానికి స్థాయిభావంగా వ్యవహరిస్తే తరువాత కథల్లో అది అంతరంగ పరిశోధనకి అభివ్యక్తిగా కన్పిస్తుంది. 'కొడతి హుళ', మరియు 'ఐదనెయవను' వీరి నవ్య ప్రాతినిధ్య కథలుగా పేర్కొనవచ్చు. మనిషి మూలభూత సమస్య, మరియు శక్తి అయిన కామం, వ్యక్తి కేంద్రితమైన దాని అనుభవం, వ్యక్తి మరియు సమాజం-వీటి సంబంధాల పొరల్ని అందులో ఉన్న అంత: సత్వాలను ఈ కథల్లో చూడవచ్చు. కామం, చావు, పుట్టుక, వేదనల వంటి మనిషి యొక్క మూలభూత ప్రవృత్తుల్ని మానవతావాద దృక్పథంతో అవగాహన చేసుకోవటం, వ్యాఖ్యానించటంతో రామచంద్రశర్మగారు సఫలీకృతులయ్యారు.

'సందర్శన', 'అబోలిన','ఆట', 'కతెయాదళు హుడుగి', 'బేణ్యా', 'సిద్ధార్థ', 'కుమటెగె బంద కిందరజ్యోగి', 'ఐవత్తొందు కథెగళు' అనేటువంటి కథాసంపుటాల్ని ప్రచురించిన యశవంత చిత్తాలగారు నవ్యకథా సాహిత్యంలో ప్రయోగాత్మక రచయిత. ఆయన అభిప్రాయం ప్రకారం హనేహళ్ళి, (తాను పుట్టిన పల్లె పేరు) నాన్నసంబంధం, చావు స్పృహ ఈ మూడు కారణాలు ఆయన సృజన శక్తికి ఊటలు. దీనివల్ల చిత్తాలగారి చాలావరకు కథావస్తువు జీవితం, చావు, పుట్టుక, కామం, ప్రతిమ, రూపకాల (Image, Metaphor) రచనల్లోభావం-భాష సమైక్యతలో, భావం-బుద్ధి పైన ఉన్నటువంటి అధికారిత చిత్తలగారి కథన శిల్ప క్రమంలో ఆయన రచనలో ఉట్టిపడుతుంది. కళలు, ప్రేమ, వేదన, ముసుగుతొడిగిన సమాజం, జీవితవైఫల్యాల్ని కలిగివున్న కథ 'కతెయాదళు హుడుగి'. ఈ కథ చిత్తాల గారి కథల్లో ప్రముఖమైందే కాక నవ్యకథాసాహిత్యంలో ముఖ్యమైన కథకూడా. కళ మరియు జీవితం ఒకటేనని చాటిచెప్పే ఈ కథ అమాయక జీవికి కలిగినటువంటి వేదనకి, చావుకి వున్న సామాజిక సంబంధాన్ని తెలుపుతుంది. తన కాలం నాటి సాహిత్య సిద్ధాంతాలకి తన కథల ద్వారా ఊపిరి పోసి సంఘర్షణకి లోనుచేసి కళలు సిద్ధాంతాల కన్నా, జీవితం గొప్పదన్న ధోరణి వీరి కథల్లో కన్పిస్తుంది.

వీరి సమకాలికులుగా కథల్ని రాసినవారు శాంతినాథ దేసాయి గారు. 'క్షితిజ' వంటి కథల ద్వారా పేరుపొందిన ఈయన వ్యక్తుల మానసిక సంఘర్షణల్ని తన కథల్లో సమర్థవంతంగా మనోజ్ఞంగా చిత్రీకరించారు. 'మంజుగడ్డె', 'క్షితిజ', 'దండె', 'రాక్షస', 'పరివర్తనె, 'కూర్మావతార'- వీరి కథా సంపుటాలు. వీరి కథలలో నగర జీవితానుభవాలు, సమస్యలు ప్రధానంగా కన్పిస్తాయి. అందులోనూ విశిష్టంగా దేశాయి గారి కథ భిత్తిలో మధ్యతరగతి, విద్యావంత వర్గం, మేధోవర్గాల వైవాహిక జీవిత సమస్యలు వాటి అనేక కోణాలు విశ్లేషింపబడ్డాయి ఆడ-మగ, నైతిక-అనైతిక సంబంధాల ప్రశ్న, ఒంటిరితనపు వేదన, అనాధప్రజ్ఞ, మానసిక సంఘర్షణల్ని ఈయన కథలు అద్భుతంగా చిత్రిస్తాయి. జీవితంలోని నైతిక విలువల ఎదుగుదలని హేతు బద్ధతతో విమర్శించటం ఈయన కథల్లో కన్పిస్తుంది. ఈయన కథల కథాసంవేదన గురించి కరీగౌడ బీచనహళ్ళి గారు ఈవిధంగా అంటారు. "నూతన సంస్కృతి, నాగరికత సమాజాన్ని సృష్టించేవైపు ఈయన కథలు తీవ్రమైన అభిలాషతో పయనిస్తాయి. ఇవి ముఖ్యంగా మనిషిలోని మానసిక సంఘర్షణల్ని చిత్రిస్తాయి. మనిషిలోని

ఆంత:రంగిక, లైంగిక పొరల్ని సూక్ష్మంగా పరిశోధిస్తాయి. మనిషిలోని నిష్క్రియతని, జఢత్వాన్ని పునర్విమర్శించే ప్రయత్నంలో నూతన అవిష్కారాల్ని కనుగొంటాయి. దేసాయిగారి హేతువాద దృష్టి ఒట్టిడాంభికం కాదు. అది తన కళాత్మకతను కోల్పోకనె ఒక ప్రబుద్ధమైన నవ్య మార్గాన్ని నెల కొల్పటంలో కీలకపాత్ర వహిస్తుంది.

నవ్య సంప్రదాయంలో ప్రముఖ కథకుల్లో ఒక్కరు యు.ఆర్.అనంతమూర్తి గారు. సంప్రదాయ బద్ధతని అనుసరిస్తూ వచ్చిన విలువల్ని విశ్లేషణకు లోనుచేయటం ద్వారా సంప్రదాయం పట్ల వికర్షణ ఆధునికత పట్ల ఆకర్షణను ఆయన కథల్లో వెలిబుచ్చారు. 'ఎందెందు ముగియద 'కథె', 'ప్రశ్న, 'మౌని, 'ఆకాశ మత్తు బెక్కు, 'సూర్యన కుదురె', 'బేటెబళె మత్తు ఒతికేత' మొదలగు నవి వీరి కథా సంపుటాలు. అనంతమూర్తిగారి కథావస్తువు హేతుబద్ధతతో భాషాసూక్ష్మతని కాపాడుకుంటుంది. జీవితానికున్న అర్థాన్ని పరిశీలిస్తుంది. వీరి అనేక కథల్లో కన్పించే ముఖ్య లక్షణమంటే బ్రాహ్మణ సమాజ విలువల పరిశోధన. మానవ సహజ ప్రవృత్తి యైన కామం ద్వారా వేలాది సంవత్సరాలనుండి సంప్రదాయ బద్ధంగా వచ్చిన బ్రాహ్మణత్వమనే కృత్రిమ ముసుగుని చీల్చి నిజమైన మనిషిని వెతికే ప్రయత్నం చేస్తారు. దీన్ని ఆయన తనదైన అనుభవంతో హేతుబద్ధతతో పరిశోధించే ప్రయత్నం చేస్తారు. దాని ద్వారా నూతన జీవిత అన్వేషణకు ప్రయత్నిస్తారు. అందువల్ల విమర్శకులు వీరి కథల్ని సుశిక్షుతుల సంకనాలు (Discourses) అని అంటారు. కువెంపు మలెనాడు ప్రకృతి సౌందర్యాన్ని వర్ణిస్తే అనంతమూర్తిగారు మలెనాడు జీవితాల అంతర్గత శోధనకి ప్రయత్నిస్తారు. అనంతమూర్తి గారి కథా సాహిత్యానికి ఐదు దశాబ్దాల వ్యాపకత్వం ఉంది. అందువల్ల కాల వత్తిడికి లోనై ఈయన కథల గొలుసులో అనేక మార్పులు కన్పిస్తాయి. సమకాలీన రాజకీయ, సామాజిక, సాంస్కృతిక ఘటనలకు స్పందించే ఆయన మనోధర్మమే ఈ వైవిధ్యతకు కారణమై వుండొచ్చు.

ఈ కాలంలో కనిపించే మరో ప్రముఖ రచయిత లంకేశ. సామాన్య విషయాల్ని కూడా అసామాన్యంగా చిత్రించే కళ లంకేశలో కన్పిస్తుంది. 'కెరెయ నీరను కెరెగె చెల్లి',' నానల్ల,'ఉమాపతియ స్కాలర్ షిప్ యాత్రె, 'కల్లుకరగువ సమయ మత్తు ఇతర కథెగళ్ళు,'ఉల్లంఘనె మత్తు ఇతర కథెగళ్ణ మరణానంతరం ప్రచురించిన 'మంజు కవిద సంజె మత్తు ఇతర కథెగళ్ణు వీరి కథా సంపుటాలు. మనిషిలోని బలహీనత, అల్పత్వం, అసూయ, ధ్వేషం, వేదన, అవమానం, నవసమాజ నిర్మాణం కళలు దారితప్పించే అనిష్టతల పట్ల ఆక్రోశం, ప్రజాప్రభుత్వం పేరున జరిగే అన్యాయాలపట్ల ఆక్రోశం, వలసవాదం వల్ల జరిగినీ మార్పులు-మొదలైనవాటిని లంకేశ గారి ప్రతిభ అనన్యకళగా మారుస్తుంది. లంకేశ గారి కథలు చాలా సిద్ధాంతాల్ని అధిగమించి జీవితాన్ని ప్రేమించే, విస్తరించే కార్యాన్ని సృజనాత్మకంగా చేస్తాయి. హేతువాది, తాత్వికుడు, సాంస్కృతిక వాది అయిన లంకేశ గారు ప్రేమ, కోపం, ద్వేషాల్ని కూడా సకారణాలతో కళాత్మకంగా సృజిస్తారు. లంకేశ గారి కథాసాహిత్యంలో సామాజిక సాంస్కృతిక పరిశోధన సృజనాత్మక దృక్కోణంలో ఆవిష్కరింపబడుతుంది. పల్లెజీవితాన్ని పట్టణప జీవితాన్ని అత్యంత శక్తివంతంగా నిరూపించటం లంకేశగారికి సహజంగా సిద్ధించిన కళ. నవ్య కథా ప్రతినిధికి వైవిధ్యతకు లంకేశు గారు ఇచ్చిన Selfness మరియు ప్రత్యేకత చాలా విశిష్టమైంది. ఆయన వస్తు, భాషాశైలి నిర్వహణలో నూతనత్వాన్ని, తీవ్రతని తెచ్చారు.

రాఘవేంద్ర బాసనీస గారు తాను రచించిన అతి కొద్ది కథల్లోనే కన్నడ కథాసాహిత్యానికి గొప్పశక్తినందించారు. నవ్యధోరణిలో ప్రాతినిధ్యంగా ప్రచురింపబడ్డ 'తబ్బలిగళు', 70వ దశాబ్దంలో ప్రచురింపబడ్డ 'అల్లావుద్దిన అద్భుతదీప', 80వ దశాబ్దంలో వచ్చిన 'మోనాలిసా' వీరి ముఖ్యమైన కథలు. మనిషి ఒంటిరి తనం గురించి, జీవితంలోని దుర్భరతని గురించిన ఆలోచన, యంత్రనాగరికత మరణం, జీవితం పట్ల

మమకారం-మొదలగు అంశాలు వీరి కథల్లో కన్పిస్తాయి. ఒక రకమైన "అస్థిత్వ వాద తాత్విక రూపాల్లుగా అనిపించే కథల్ని రాఘవేంద్ర బాసనీసగారు రాశారు.

'నల్లియల్లి నీరు బంత్ను కథ ద్వారా రచయితగా గుర్తింపు పొందిన కథకుడు కె. సదాశివ. 'అపరిచికరు', 'సూతక', 'పెండులం', 'పోస్టమార్టం' మొదలుగునవి వీరి ప్రసిద్ధ కథలు. కన్నడ కథా సాహిత్యానికి ప్రతిమ, రూపకాల ద్వారా నూతన శక్తిని, నూతన అభివ్యక్తిని తెచ్చిన వారిలో సదాశివ కూడా ఒకరు. వీరు ప్రజ్ఞాప్రవాహ తంత్రాన్ని, మానసిని విశ్లేషణను కథల్లో పొందుపర్చటం ద్వారా వ్యక్తిలో వున్న ప్రజ్ఞాహీన పాతాళాలను శోధించ టానికి ప్రయత్నించారు.

వృత్తిలో వైద్యులై వుండి, ప్రవృత్తిలో కథకుడిగా గుర్తింపుపొంది, సంప్రదాయ, అభ్యుదయ, ఆధునిక, ఆధునికానంతర ధోరణుల ఉత్తమ గుణాల్ని అలవర్చుకొని కథల్ని రచించినవారు బెసగర హళ్ళి రామణ్ణ. వీరి సమగ్ర కథల్ని'కన్నంబాడ్డి పేరుతో ప్రచురింపబడ్డ కథాసంపుటిలో చూడవచ్చు. సంప్రదాయ మరియు అభ్యుదయవాదుల చర్చలు అలసిపోయి, ఆధునిక ధోరణులు నూతన అన్వేషణలో ఉన్నప్పుడు రామణ్ణగారు కథల్ని రాయటం ప్రారంభించారు. ఆ సందర్భంలో ఆయన పల్లెపరిసిరాలను ఎన్నుకున్నారు. అందువల్ల గ్రామీణ సంస్కృతి ఆయన కథలకు ప్రత్యేక గుర్తింపు నిచ్చింది. జీవితానుభవాల్ని వాస్తవవాద దృక్కోణంతో నిరూపించే ఈయన కథలు సమాజవేత్తల అధ్యయనానికి సాధనాలయ్యాయి. యాభయ్యవ, అరవయ్యవ దశాబ్దంలో వచ్చిన వీరి కథల్లో పల్లె పరిసరాలు, అందాలు, ఎక్కువగా కన్పిస్తే, 70వ దశాబ్దంలో వచ్చిన కథల్లో తీవ్రమార్పులు కన్పిస్తాయి. దీనికి ప్రధాన కారణం సామాజిక, రాజకీయ మార్పులు. ఎమర్జెన్సీ వల్ల వ్యక్తి స్వాతంత్ర్యానికి, గాంధీతత్వాల్ని ప్రజాప్రభుత్వానికి, ఈ దేశపు సాంస్కృతిక విలువలకు తగిలిన గాయాన్ని 'ప్రజాప్రభుత్వ మత్తు మూరు మంగగళ్ను కథలో అద్భుతంగా నిరూపించారు. గ్రామీణ ప్రాంతల్లోని వర్గవ్యవస్థను, అక్కడున్నరాజకీయ అరాచకతను గురించి ఆక్రోషిస్తూ భద్రపరిచే ఈయన శైలి విశిష్టమైనది. సాంస్కృతిక జీవితపు మలుపుల్ని ఆయన కథలు గట్టిగా నిర్దేశిస్తాయి.

ప్రారంభంలో ఆధునిక రచయితలతో పాటు రచనలు చేస్తూ కొద్దికాలం తర్వాత ఈ భావజాలంనుండి వైదొలగి తనదైన విశిష్టతను సంతరించుకున్న కథా రచయిత పూర్ణచంద్ర తేజస్వి.'హులియూరిన సరహద్దు, 'అబచూరిన పోస్టాఫీస్ను, 'కిరగూరిన గయ్యాళిగళు' వీరి కథా సంపుటాలు. భావతీవ్రతకు లోనుకాకుండా స్తిమితమైన, నిష్పక్షపాతమైన, ధోరణిలో కథల్ని అల్లేకళ పూర్ణచంద్ర తేజస్వి గారికి వర్తిస్తుంది. అంతేగాక తనచుట్టూ ఉన్న వ్యక్తులనే పాత్రలుగా ఎన్నుకొని సమాజంలోని వాస్తవాల్ని భేదించే క్రమం, గంభీరమైన సమస్యలు సహజ-సరళ నిరూపణకు లోనుకావటం కథనక్రమ విశిష్టతగా భావించవచ్చు. మలెనాడు ప్రకృతి మరియు నాగరికతల మధ్యనున్న సంబంధాల లోతుల్ని ఆయన కథలు అన్వేషిస్తాయి. సామాజిక బాధ్యత, మానవ విలువలు, సంబంధాలు, అజ్ఞానం-మౌఢ్యాలను దాటి విజ్ఞానం-ఇలా చాలా భిన్నంగ ఆలోచిస్తునే పల్లె అనుభవాలను అద్భుతంగా కట్టగల శిల్పి, ధీమంతుడు పూర్ణచంద్ర తేజస్వి. ఆధునిక సాహిత్య, సంకేతాలు, అభివ్యక్తి, తంత్రం గురించి తనదైన విశిష్టతను, విద్యా, సాహిత్యం, సంస్కృతి, మానవ విలువల గురించి తనదైన సిద్ధాంతాన్ని తేజస్వీగారు ప్రతిపాదించారు. పైన పేర్కొన్నవన్ని కూడా సమూలంగా మార్పురావాలన్నది ఆయన ఆశయం. ఈయన 'అబచూరిన పోస్టాఫీస్ను కథాసంపుటికి రాసిన ముందుమాటలు చారిత్రక ప్రాముఖ్యతగలవి. అందులో ఆయన కన్నడ సాహిత్యం ఆధునిక ఘట్టాన్ని తిరస్కరించి నూతన మార్గాన్ని ఎన్నుకొవలసిన అవసరం వుందన్నారు.

నవ్యకథాసాహిత్యంలో విశిష్టమైన కథల రచనకి పూనుకున్న వారిలో క.వెం. రాజగోపాలగారు ఒకరు. హిందూ మరియు క్రైనవ ధర్మాల మధ్యనున్న అంతరాలను తాత్విక పునాదులుగా చేసుకొని రచించిన కథ 'అనాధమేష్టర స్వగత సంప్రదాయ్ణ ఇది ఆధునిక భావజాలంతో నిండివున్న కథ. మనిషి సంబంధాల అర్థాన్ని ధృవీకరించే విధానాల్ని తమ కథలకు వస్తువుగా ఎన్నుకున్నవారు. జి.యస్. సదాశివ.'కుణుకుగళ్ణ వీరి కథా సంపుటి. వీరి కథలు ఎక్కువగా ఆడ-మగ సంబంధాల చుట్టూ పరిభ్రమిస్తుంటాయి 'కారణ' మరియు 'హ్యాంగోవరో' గమనించదగిన కథలు.

రెండు కథలే రాసినప్పటికీ కన్నడ కథాసాహిత్యానికి ఒక విశిష్ట విధానాన్ని పరిచయం చేసినవారు ఏ.కే. రామనుజన్. ఆకర్షణీయమైన నుడికారాలతో, వస్తువుతో పాఠకుల్ని ఒక్కక్షణం మంత్రముగ్ధుల్ని చేసేశక్తి ఆయన కథలకున్నది. ప్రత్యేకంగా ప్రస్తావించదగ్గ ఆయన కథ 'అణ్ణయ్యన మానవశాస్త్ర'. భారతీయ బ్రాహ్మణుడొకడు అమెరికా గ్రంథాలయంలో కూర్చొని స్టీవెన్ ఫర్గుసన్ రాసిన 'హిందూ ధర్మనంప్రదాయాలు మరియు ఆచారాలు' అనే గ్రంథాన్ని చదివి తాను భారతదేశంలోనే పుట్టి ఇక్కడి విషయాలనే అమెరికాకు వెళ్ళి తెలుసు కోవటం ఇందులోని వస్తువు. సంప్రదాయ బద్ధమైన కథలకన్నా ఇది చాలా భిన్నంగా ఉంది. ఆధునిక రచనల్లో ఇది కొత్తప్రయోగం. ఈ దేశ సంస్కృతిలో ఉన్న బేళతనాన్ని, ఢాంబికతను ఈ కథ ప్రత్యేకంగామనముందుంచుతుంది. చివరిలో ఈ కథ సాంస్క ృతికంగా ఎటువంటి తుల నాత్మక ప్రయత్నాలు చేయకుండా అన్నింటినీ పాఠకులకీ వదిలిపెడుతుంది. ఆధునిక సాహిత్యంలో రెండవతరానికి చెందిన ప్రముఖ కవి శ్రీకృష్ణ ఆలనహళ్ళి. 'తష్ణ ఈయన కథాసంపుటి. భాషను నిరూపించే క్రమంలోనే ఈయనను ఆధునికానంతర కథాసాహిత్యంలో ప్రముఖుడిగా గుర్తిస్తారు. ఈయన కథల్లో ముఖ్యమైన కోణాలు మనిషి కొత్తదనాన్ని స్వీకరించేటప్పుడుండే ద్వంద్వం, సంఘర్షణ మరియు స్త్రీ పురుష సంబంధాల మధ్యనున్న లైంగిక సంబంధాల రహస్య పరిశోధన. పల్లెజీవితం ఈయన కథల్లోఎక్కువ భాగాన్ని ఆక్రమించినప్పటికీ చాలావరకు నగర విద్యావంతుల స్పృహ పనిచేస్తూవుంటుంది. మనిషి మనస్సులోని ద్వంద్వాల్లో ఈయన కథలు చాలా గాఢంగా చిత్రిస్తాయి.

బి.టి దేసాయ్ గారు ఉత్తర కర్ణాటకలో గమనించిదగ్గ కథకుడు. చిద్రమైన మనిషి సంబంధాల సూక్ష్మతల్ని పల్లెపరిసరాల్ని చూపించే ప్రయత్నం ఈయన కథల్లో కన్పిస్తుంది. ఇదే సందర్భంలో పెర్కొనదగిన నవ్యకథకులంటే ఎస్. దివాకర, యం. యస్. కె. ప్రభు, రామచంద్ర దేవ, గిరడ్డి గోవిందరాజు, టి.జి .రాఘవ, సువతీంద్ర నాడిగ, కామరూపి, కె. సత్యనారాయణ, కృష్ణమూర్తి హనూరు గారు. అలాగే కొన్ని నవ్యకథలు చారిత్రకమైనవి. అవి శంకరమోకాశి పుణెకర్ గారి 'ముఖామఖి' బి.సి దేసాయ్ గారి 'సావు' కె.వి. తిరుమలేశ్ గారి 'నెళలె మళద శ్రిగళు', ఎ.యన్.ప్రసన్నగారి 'హొళెగె హొదద్దు' మావినకెరె రంగనాథగారి 'ఉళిదద్దు ఆకాశ' మొదలైనవి.

మాస్తిగారి స్థిరసమాజం నవ్యులకు (ఆధునికులకు) చలనశీలతను ప్రాప్తించుకుంది. సనాతన సమాజపు విలువల పున:మౌల్యీకరణం ఆధునికులతో (నవ్యులకు) ప్రారంభమైంది. అందువల్ల సనాతన విలువల్ని ఆదార్శంగా ఆరోపించుకొనే పాత్రల్ని వీరు పోషించే విధానం చాలా భిన్నమైంది. కథానిరూపణలో భాషావ్యాయామంలో, పాత్రల్ని ప్రవేశపెట్టటంలో నవ్యులు నూతన మార్గాన్ని ఎంచుకున్నారు.

కన్నడ నవ్య కథలు జీవిత వైరుధ్యాల్ని ద్వంద్వాలను పరిశోధిస్తూ స్వానుభావాల్ని ఆత్మవిమర్శకి గురిచేయటం ద్వారా సాహిత్యంలోని ప్రాముఖ్యతను పొందాయి. మనిషి మనిషికున్న ఇతర సంబంధాల్ని చిత్రించటంతో పాటు సమాజం మరియు మానవ సంబంధాల్ని పెకిలించి చూస్తాయి. గ్రామీణ-పట్టణ సంబంధాలు, వ్యక్తికి వ్యక్తికి మధ్యనున్న సంబంధాల్ని మనోవిశ్లేషనాత్మకంగా

విశ్లేషిస్తాయి. నవ్యమార్గంలో కన్పించే విభిన్న ధోరణులు ఇతర ఏమార్గంలో కనిపించవు. ప్రతి కథకుడు తనదైన వ్యక్తిగత నేపథ్యంలో జీవితాన్ని పరిశోధించటం, ఈ విశిష్టతకి కారణ మనిపిస్తుంది. నవ్యకథకుల ఈ ధోరణులు తర్వాత వచ్చిన నవ్యోత్తర (ఆధునికానంతర) కథకుల్లో కన్పిస్తుంది. అలాగే శిల్పానికి సంబంధించి నవ్యకథలలో ఎక్కువ ప్రయోగాలు జరిగాయి. నవ్యులకి తంత్రం అనేది జీవితపు అనుభవాల సూక్ష్మతల్ని భావపూర్ణంగా వ్యక్తపరిచే ఒక కళగా రూపుదిద్దుకుంది. కథలో కథకుడే నాయకుడై నపుడు ఆత్మవిమర్శ కన్పిస్తుంది. కథకుడు కేవలం నిరూపకుడైనప్పుడు అక్కడ సమాజవిమర్శ కన్పిస్తుంది. నవ్యకథకులు ఈ రెండు ప్రవృత్తుల్ని గాఢంగా వ్యక్త పరచారు. వ్యక్తి కేంద్రితమైన దృక్కోణంతో సమకాలీన సమాజచిత్రాన్ని వాస్తవంగా అందివ్వటానికి సాధ్యపడు తుందన్నదాన్ని నవ్యకథలు తేల్చి చెప్పాయి.

ఆధార గ్రంథాలు :

1. అమూర జి.ఎస్., సమకాలీన కథె-కాదంబరి హాస ప్రయోగగళు, కన్నడ సాహిత్య పరిషత్తు, బెంగళూరు,1981.
2. అమూర జి.ఎస్.,-కన్నడ కథన సాహిత్య-సణ్ణకథె, ప్రియదర్శిని ప్రకాశన, బెంగళూరు, 2000.
3. అమూర జి.ఎస్.,- కథనశాస్త్ర, కన్నడ సాహిత్య పరిషత్తు, బెంగళూరు, 2001.
4. కరీగౌడ బీచనహళ్ళి-శతమానద సణ్ణకథెగళ సమీక్షె, కర్ణాటక సాహిత్య అకాడెమి, బెంగళూరు, 2003.
5. కీర్తినాథ కుర్తుకోటి-యుగధర్మ మత్తు సాహిత్య దర్శన, మనోహర గ్రంథమాలె, ధారవాడ, 2002.
6. కేశవశర్మ కె.-సణ్ణకథె-కెలవు లేఖనగళు, కన్నడ విభాగ, మంగళ గంగోత్రి, మంగళూరు విశ్వవిద్యాలయ, మంగళూరు,1987.
7. గోవిందరాజ గిరడ్డి-సణ్ణకథెయ హాస ఒలవుగళు, సాహిత్య భండార, హుబ్బళ్ళి, 1978.
8. నాయక్ జి.ఎచ్., కన్నడ సణ్ణకథెగళు, నేషనల్ బుక్ ట్రస్ట్, ఢిల్లీ,1970.
9. బసవరాజ సాదర-20 నె శతమాన కన్నడ సాహిత్య ఘట్టగళు, కర్ణాటక విద్యావర్ధక సంఘ, ధారవాడ.
11. రా.య.ధారవాడకర్గ్ -హొసగన్నడ సాహిత్యద ఉదయకాల, కర్ణాటక విశ్వవిద్యాలయ, ధారవాడ, 1975.
13. శాంతినాథ దేసాయి-నవ్య సాహిత్య దర్శన, పరిసర సాహిత్య ప్రకాశన, శివమొగ్గ, 1990.
14. శివరుద్రప్ప జి.ఎస్-విమర్శెయ పూర్వ-పశ్చిమ, సాహిత్య భండార, బెంగళూరు, 1977.
15. శేషగిరిరావు ఎల్.ఎస్- హొసగన్నడ సాహిత్య చరిత్రె, అంకిత పుస్తక, బెంగళూరు. 1999.

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 6(1), June 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

జానపద సంప్రదాయ విజ్ఞానం – రజక కులం

– కుడతల యేసుప్రభువు, పరిశోధక విద్యార్థి ,తెలుగు విభాగం, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

తెలుగు భాషలో లభ్యమవుతున్న లిఖిత సాహిత్యాని కన్నా ముందుటుది మౌఖికసాహిత్యం. తరతరాలుగా తరగని సంపదగా మనుతున్న ఈ మౌఖిక సాహిత్యాన్నే జానపదసాహిత్యం అంటున్నాం. తెలుగులో లభ్యమవు తున్న వేలాది జానపదగేయాలు తెలుగు జాతి జీవన సంపదకు నిలయాలు. మౌఖిక జానపద గేయాలలో సంప్రదాయ విజ్ఞానాన్ని చూసినట్లయితే ఒక తరం ప్రజలు పాటించే ఆచారాలు, పద్ధతులు, నియమాలు, అలవాట్లు, వారి జీవనశైలి మొదలైన అనేక రకాలైన సాంప్రదాయక మైన అంశాలన్నింటిని తరువాత తరాలకు అందిం చడంలో ఈ సంప్రదాయవిజ్ఞానం ప్రముఖపాత్ర వహించిందని చెప్పవచ్చు.

ఒకానొక సాంఘిక వ్యవస్థకు సంబంధించిన ప్రజలందరూ సామూహికంగా ఆమోదించినప్పుడు సంప్రదాయం అన్నది నిలుస్తుంది. జానపదగేయ సాహిత్యం అత్యంత ప్రాచీనకాలానికి సంబంధించిన మానవజాతి జీవనవిజ్ఞానం. మరో విధంగా చెప్పాలంటే అది సజీవశిలాజం. జానపద గేయాలలోని సంప్రదాయ విజ్ఞానం కొత్తది కాదు, పాతది కాదు. కాలానుగుణంగా మార్పులను, చేర్పులను అంగీకరిస్తూ నిలిచివున్న ముందు తరాల వారి పూర్వీక స్థిరాస్థి.

మానవనాగరికచరిత్రలో అనేక పరిణామాలు చోటు చేసుకున్నాయి. మానవుడు తను ఆది నుండి తనను తాను రక్షించుకుంటున్నాడు. తదనుగుణంగా క్రమేణా కూడు, గూడు, గుడ్డవంటి వాటిని సమకూర్చుకున్నాడు. మానవుడు మొదట నుండి వస్తు తయారీ ప్రక్రియను చేపట్టి సంసిద్ధతను కనబరుస్తున్నాడు. అటువంటి దశలో కుమ్మరం, కమ్మరం, రజక, మంగలి, జాలరి మొదలైన వృత్తులుగా ఏర్పడి వారి నైపుణ్యాలను వారు కన బరుస్తున్నారు. ప్రతి వృత్తి మరోవృత్తిపై ఆధారపడి ఉండటం సహజం.

కులవృత్తులు మన సమాజంలో అనాదిగా ఉన్నాయి. ఆయా వృత్తుల పేర్లతోనే కులాలు ఏర్పడ్డాయి. అయితే ఈనాడు కులవృత్తులు కుప్పకూలుతున్నాయి. ఈ వృత్తిని నమ్ముకున్న వారి జీవితాలు అదోగతిపాలవుతున్నవి. ఆధునిక పనిముట్లు రావడంతో ఉన్న ఉపాధిని దెబ్బ తీస్తున్నాయి. పల్లెల్లో ప్రధానమైన వృత్తి రజకవృత్తిఈ వృత్తి వారి వారసత్వహక్కు. సాధారణంగా ఈ వృత్తి పని చేపట్టేవారు పొలిమేర సరిహద్దులపల్లెలు నిర్ణయించుకుని వారి పని చేసేవారు. కుమ్మరి, రజకలేనిదేపల్లెల్లో సంప్రదాయ పనులు జరగవు. ఉగాది పండుగ చేసే ముందురోజు ముద్దలపండుగనాడు ఊరి బాగుకోసం గోరిపిల్లను బలిఇస్తారు. ఆ బలి వేసినప్పుడు ఊరంతా వీధివీధికి తిరిగుతారు ఆతిరిగే సమయంలో రజక కులస్థుని చేతిలో దివిటి ఉంటుంది ఆ దివిటిని వారు మాత్రమే ఎత్తుకోవాలి. అలాగే ఆడపిల్లలు సమర్తాడి నపుడు (పుష్పవతి) విషయాన్ని ఊరందరికి చెప్పాలి. వారు పెట్టె బట్టలురజకులకే చెందుతాయి. అలాగే పెళ్ళి కూతురును గుడిసెలో ఉంచిన మూడురోజులు రజకుడు తప్పకుండా ఉండాలి. సంప్రదాయబద్ధంగా వస్తున్న వారికి అందవలసిన మేర అందుతుంది.

ఒక ఆడపడుచు చాకిరేవుకు వెళ్లి బట్టలు ఉతికి నప్పుడు ఆ బట్టలకు ఉపయోగించే విధానాలు, శరీరానికి చుట్టుకునే దోతిని ఉతికినప్పుడు దాని అంచు కుసుమ రేకువలె మెరిసింది, ఎడమపక్క ఉన్న అంచు ఎండిరేకుల ఉన్నదని చెపుతుంది. ఈ వృత్తిలో వారు చేసే పనితీరు ఈ కింది గేయం ద్వారా తెలుస్తున్నది.

"సముద్రాన బట్లుతుకే సాకలిపాప
మీయన్న గట్టేటి దట్టి పేరేమి
కుడుతుట్టు సుంగులూ కుసుమరేకులూ
ఎడమతుట్టు సుంగులూ ఎండిరేకులూ
నట్టనడమ దట్టిలో నాగన్న పడిగో"

మనిషి పుట్టినప్పటి నుంచి ఏదో ఒక పనిని చేసుకుంటూ తన మనుగడ కొనసాగిస్తున్నాడు. ప్రతి వృత్తి పని చేసుకునేవారు తమ ఇలవేల్పుగా ఒక దేవతను/దేవుణ్ణి కొలుస్తారు. అలా ఒక రజకస్త్రీ తమ దేవతను కొలుస్తూ ఇలా రోజువారి చేసే తమ వృత్తి పనులు నిర్వహించేందుకు ఉదయమే లేచి వారి పరిధిలో ఉన్న పల్లెకు పోయి పల్లెల్లో సాధారనణంగా పాలిమేర సరిహద్దులు బట్టి కుమ్మర, కమ్మర, మేదర, క్షురక, చేనేత, జాలరి మొదలైన వారు పనిని నిర్వహిస్తారు. పట్టణాలలో కూడా కొన్ని ఇళ్ళు అని ఒప్పుకుని పని చేయడం సహజం. అలారజకులు పల్లెకు పోయి వారు పెట్టిన భోజనం తిని వారి గుడ్డలను అన్నింటిని తీసుకుని ఒక వరుసలో పెట్టి మాదలు కట్టి ఆ గుడ్డలు ఎవరెవరివి అని గుర్తించుకుని వారి బట్టలను ఇచ్చేవారు అని ఈ కింది గేయం ద్వారా తెలుస్తుంది.

"వనదేవవనదేవ తుమ్మెద - చాకల్ల వనదేవ తుమ్మెద
చాకల్ల వనదేవ తుమ్మెద - బహుసత్యవంతురాలు తుమ్మెద
సత్యవంతురాలు తుమ్మెద - బహుబుద్ధిమంతురాలు తుమ్మెద
బుద్ధిమంతురాలు తుమ్మెద - బహునీతిమంతురాలు తుమ్మెద
పద్దన్నెలేసిన తుమ్మెద - అదికాళ్ళ కడిగినె తుమ్మెద
కాళ్ళముఖంకడిగినె తుమ్మెద - నట్టతరువునపెట్టె తుమ్మెద
నట్టతరువునపెట్టె తుమ్మెద - అది పల్లెకు పాయెనె తుమ్మెద
పల్లెకు పాయెనె తుమ్మెద - అదిపట్టనానికి పయెనె తుమ్మెద
ఇంటింటి కోకలె తుమ్మెద - అది ఇలువరుస తీసె తుమ్మెద
ఇంటింటి భోజనం తుమ్మెద - అది ఇలువరుస తీసెనె తుమ్మెద"

పూర్వకాలంలో ఇప్పటిలాగా వాహనాలు లేవు. అప్పుడురజకవారు గుర్రాలు, గాడిదలు మీద గుడ్డలు వేసేవారు. ఒకరజక యువతి మాసిన గుడ్డలన్నీ మూట కట్టి గుర్రాలకు ఎత్తి చెరువుకు పోయింది. ఆ చెరువులో ఎక్కడ ఉదికేది సందేహపడుతూ, బాపనవారమో సంధ్య సమయం కాకుండానే స్నానమాడి వెళ్తారు. ఆ నీళ్ళన్ని కల్తి అయివుంటాయి. చేపల ఎంగిలి నీళ్ళతో ఉతికితే దుర్వాసన కొడతాయి. ఇంక ఎక్కడ ఉతికేది అని సందేహపడుతూ కొడుకు రంగప్పను పిలుస్తుంది.

ఉబ్బ అనేది రజకలివారి పాయ్యి. మూడు పెద్ద కుండలను త్రికోణ ఆకారంలో ఒక దానికి ఒకటి ఆనించి పెద్దపాయ్యి మీద పెడతారు. కుండలు చుట్టూ కనపడకుండా మట్టితో మెత్తుతారు. ఆ మూసిన వాటిపైనామూతలు మాత్రమే కనిపిస్తాయి. ఆ కుండలలో సొడును కలుపుతారు. సొడు(సరుపు) ఇది వర్షాలు పడినప్పుడు భూమిలో దొరుకుతుంది. కుండలో సొడును కలిపిన తరువాత వాటికింద మంటపెట్టి కుండలపై వలయకారంలో సొడు నీటిలో ముంచిన బట్టలను చుట్టుతారు. ఇలా రెండుడగుల ఎత్తు వరకు కప్పి చివరగా ఆ మొత్తానికి ఒక పెద్దగుడ్డను కప్పుతారు. కిందమంట వలన కుండల్లో నీరు ఆవిరిపైన కప్పిన గుడ్డలన్నింటినికి వ్యాపిస్తుంది. ఇలా సుమారు రెండుగంటలు పాయ్యికింద మంటపెట్టిన తరువాత మెల్లగా ఒక్కొక్క బట్టను విడదీస్తారు. ఆ తరువాత వాటిని మంచినీటిలో ఉతుకుతారు. దానివలన బట్టలకు అంటిన నూనె, మరకలు వెంటనే తొలగిపోతాయి. రంగులున్న బట్టలు సొడు నీటి ఆవిరికి వేరే బట్టలకు అంటుకుంటుంది. అందుకే రంగులున్న బట్టలు వేయారు.

మనం ఏదైనా పని చేయాలనుకుంటే మన శ్రమను మరచిపోవడానికి ఏదో పాటనో, కథనో చెప్పుకోవడం సహజం. అలా ఒక రజక స్త్రీ తను చేసే పని ఎంతో నిష్ఠతో చేసేవిధానం కనిపిస్తుంది. తను ఉబ్బ గావించినప్పుడు తన కొడుకు రంగప్ప కాళ్ళు కట్లుగాను, తల కొరవిగాను పోల్చి తన పనిని చేస్తూ ఉబ్బ నుంచి

తీసిన బట్టలను బండకేసి ఉతికిన సందర్భంలోనిది అని కింది గేయం ద్వారా తెలుస్తుంది.

"మాసిన కోకలె తుమ్మెద - మాదలె కట్టినె తుమ్మెద
మాదలె కట్టినె తుమ్మెద - అది గుర్రాలకెత్తినె తుమ్మెద
గుర్రాలకెత్తినె తుమ్మెద - అది సాకిరేవుపాయ తుమ్మెద
సాకిరేవుపాయ తుమ్మెద - అది యాడవుతికేదని తుమ్మెద
బాయిలో వుతికితే తుమ్మెద - అది బాపనోరి ఎంగిలి తుమ్మెద
చెర్లోన వుతికితే తుమ్మెద - అదిచేపల ఎంగిలి తుమ్మెద
ఇంగ యాడవుతికెదను తుమ్మెద - కొడుకు రంగప్పనుపేరుతో పిలిసె తుమ్మెద
కొడుకు రంగప్పను పేరుతో పిలిసె తుమ్మెద - అది ఉబ్బగావించె తుమ్మెద
కాళ్ళమో తీసెనే తుమ్మెద - అది కట్లుగావించే తుమ్మెద
చేతులు తీసెనే తుమ్మెద - అది కొరివిగావించే తుమ్మెద
అది ఈవుతీసెనే తుమ్మెద - అది బండగావించే తుమ్మెద"

ఏదైనా ఒక వస్తువును ఇతరులకు ఇచ్చినప్పుడు ఇస్తాడో, ఇవ్వడో అని సందేహంగాఉంటుంది. ఆ వస్తువు తిరిగి ఇస్తే ఉపశమనం అవుతుంది. వృత్తి పని చేసే వారు ఇతరులు నుంచి వస్తువులు తీసుకుని వాటిని ఎంతో జాగ్రత్తగా కాపాడి వారికి అందించడం జరుగుతుంది. ఒకతను తన భార్య గుడ్డలు ఉతికినప్పుడు ఎంతో నిబద్ధతో పనిచేసి, తమ గౌరవాలకు ఎక్కడ ఆటంకం కలగకుండా జాగ్రత్త వహించి బట్టలనుఇస్తారు. చిత్తూరు జిల్లాలో కొన్ని గ్రామాలకు పేరు చివరన సముద్రం అని పేరు గలదని ఒక రజక స్త్రీ నిబద్ధత అన్నది ఈ కింది గేయం ద్వారా తెలుస్తుంది.

"సముద్రాన వుతికేటి సాకల్లిపాప
పైయేరువత్తుందే గడ్డెక్కుపాప
వుతికేవసాకల్లి వుల్లిపూవుల్ల
మడిసేవాసాకల్లి మొగలిరేకల్ల
మడిసిన్ని బట్టల్ని మాదల్లో బట్టల్ని
మాదల్లో బట్టల్ని యేనిగేలకత్తి
పట్టావేసాకల్ని పట్నంబోతే
వారోరిబట్టన్ని వారికిచ్చిందో పొద్దువొయ్యె సాకల్ని"

గుడ్డలు ఉతికినప్పుడు అందులో రకరకాల బట్టలు ఉంటాయి. వాటిని జాగ్రత్తగా ఉతకాలి. ఉబ్బలో కాచినప్పుడు తెల్లబట్టలు నిగనిగలాడుతూ ఉంటాయి. రంగులు బట్టలు వేయరు వాటి రంగు పోతుంది. పల్లెల్లో చాకిరేవుకు వివిధ పేర్లతో పిలుస్తారు. ప్రస్తుత తరుణంలో రకరకాల పొడరులు వచ్చాయి. వీటి వినియోగం రజకులు తెలిసినట్లు ఇతరులకు అంతగా తెలియదు.

బట్టలకు ఒక్కొక్క పట్టణం ఒక్కొక్కటి పేరుగాంచినది. చాకిరేవు దగ్గర బట్టలుతుకుతున్న సంధర్భంలో స్త్రీలు ఇరువురు మీ అన్న కట్టిన దట్టి పేరేమి చాలా బాగున్నది దానికి నీలిమందు వాడితే చాలా నిగనిగలాడుతూ మలుకాపువ్వు వలె మెరుస్తుందని ఈ కింది గేయం ద్వారా తెలుస్తున్నది.

"ఉర్లుగొండల మీద ఉతికేటి చాకి!
మాయన్నగట్టేటి! దట్టిపేరేమి!
అనుమకొండ వంచు! దనకొండ దసిలి!
రామగుండపు నీలి! రంగైన తొగరు!
సిలివేరు వంచున్న! సిన్నీ దోతుల్లు!
ములెగట్టు సాకెమ్మ! ములుకాపువ్వోలె!
పాయనే సాకెమ్మ! గంగాబేటికి!
నెత్తిమీది పెదమూట! భూమ్మిన ఏను!"

సంప్రదాయ విజ్ఞానంలో విద్యాభివృద్ధి లేని కాలంలో తమ మనుగడ విశేషాలను ప్రాచీనులు గేయరూపంలో నిక్షిప్తం చేసారు. అంటే తమ వృత్తి విధి విధానాలను, వృత్తి తీరుతెన్నులను, వృత్తి ద్వారా ఉత్పన్నమయ్యే ఉత్పత్తులను, వాటి వినియోగ విధానాలను పాటలలో చరణాలుగా మలచి వృత్తివిజ్ఞానాన్ని జీవనవిజ్ఞానంగా దాచుకున్నారు. వీటి ద్వారా తరతరాలుగా తమ వృత్తి సంబంధ విశేషాలను సంప్రదాయవిజ్ఞానంగా తరువాత తరాల వారికి గేయరూపంలో అందించారు.

తరతరాలుగా బట్టలుతికిన చాకిరేవులలో చాకిబండలు నునుపుతేలి రజకవృత్తి అక్కడడక్కడ సాక్షిభూతంగా నిలుస్తున్నాయి. రజకవృత్తి సామాజికమార్పులతో చెల్లాచెదురై అంతరించిపోయే దశలో ఉన్నది.

ఆధార గ్రంథాలు :

1. ఆదిశేషువు,హరి. జానపదగేయవాఙ్మయ పరిచయము
2. రామరాజు, బిరుదురాజు. తెలుగు జానపదగేయసాహిత్యం
3. మోహన్, జియస్. జానపద విజ్ఞానాధ్యయనం
4. రామరాజు, బిరుదురాజు. (సం) త్రివేణి
5. విజయలక్ష్మి, దేవారెడ్డి. తెలుగు తమిళ లాలిపాటలు
6. గంగప్ప, యస్. జానపదగేయాలు
7. భక్తవత్సలరెడ్డి, ఎన్. జానపదవిజ్ఞాన సమాలోచన
8. సుబ్బాచారి, పులికొండ. తెలుగులో కులపురాణాలు ఆశ్రిత వ్యవస్థ
9. సుబ్బిరామిరెడ్డి, ఎ. కడప జిల్లా జానపదగేయగాథలు నిర్మాణం సమాజం సంస్కృతి

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 6(1), June 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

"సారాజ్జెం" నవల – గ్రామీణ కుల వ్యవస్థ

– పిల్లి ఉషారాణి, తెలుగు శాఖ్యధ్యక్షులు, యస్.వి.డి., జి.డి.సి., మహిళా కళాశాల, నిడదవోలు, తూర్పు గోదావరి జిల్లా.

అక్కినేని కుటుంబరావు రాసిన "సారాజ్జెం" నవల గ్రామీణ కుల వ్యవస్థలోని రాక్షసత్వాన్ని విప్పిచెప్పి మనలో రాజ్యాంగ నైతికతను పెంపొందించగల నవల. ఆ నవలను రాజ్యాంగ నైతికతను ప్రాతిపదికగా తీసుకుని అంచనా వేయటమే ఈ వ్యాస ప్రధాన ఉద్దేశం. "భారతీయ గ్రామం రిపబ్లికన్ భావనకు పూర్తిగా విరుద్ధ మైంది. ఒక వేళ భారతీయ గ్రామమే రిపబ్లిక్ అయితే ఆ రిపబ్లిక్ స్పృశ్యుల చేత, స్పృశ్యుల యొక్క, స్పృశ్యుల కొరకు ఉన్న గ్రామం అవుతుంది. అందులో ప్రజా స్వామ్యానికి సోదరత్వానికి, సమానత్వా నికీ, స్వేచ్ఛకూ చోటు లేదు" (అంబేద్కర్ 2002, :330 కోటెడ్ కల్పన కన్నాబిరాన్, టూల్స్ఆఫ్ జస్టిన్, పుట 234) అన్న అంబేద్కర్ మాటలను ఒక గ్రామంలోని దళిత జీవిత వాస్తవ కథనంతో పోల్చి చూడటం కూడా ఈ వ్యాస రచన ఉద్దేశం.

"సారాజ్జెం" నవల కృష్ణాజిల్లాలోని చౌటపల్లి గ్రామంలో జిరిగిన కథ. కథలో అన్ని సంఘటనలూ ఆ గ్రామంలో జరగలేదని, చుట్టు పక్కల గ్రామాలలో జరిగిన ఒకటి రెండు సంఘటనలను ఈ గ్రామంలో జరిగినట్లు రాశానని రచయిత చెప్పారు. చౌటపల్లిలో మాలపల్లిలోని ఎంకడి కుటుంబం చుట్టూ ఈ కథ నడుస్తుంది. ఎంకడు, భార్య పద్దాలు, కొడుకు తిరపతి, పద్దాలుకి ఎంకడికి స్వతంత్ర దినం రోజున పుట్టి, ఆ ఊరి కాంగ్రెస్ పెద్ద బ్రహ్మంగారి చేత స్వరాజ్యమని నామకరణం చేయించుకుని సారాజ్జెంగా అందరిచేతా పిలవబడ్డ సారాజ్జెం ఈ నవలకు నాయిక. సారాజ్జెం 1947 ఆగస్టు 15 న పుట్టింది. 16 సంవత్సరాలు ఆ ఊళ్ళో పెరిగింది. ఆ పదహారు సంవత్సరాలలో - స్వతంత్ర దేశంలోని తొలి పదహారు సంవత్సరాలలో రాజ్యాంగం రాయబడిన మొదటి 13 సంవత్సరాలలో ఒక గ్రామంలోని మాలపల్లి ప్రజల జీవితం ఈ నవల కథా వస్తువు. అదేకాదు స్వతంత్రం వచ్చాక దానిని తాము బాగుపడటానికి తమ ఆధిపత్యాన్ని గ్రామాలలో స్థిరపరుచుకోటానికి, ఆ ఊరి అగ్రవర్ణ భూస్వాములు, రైతులు ఎట్లా ప్రయత్నించారన్నది కూడా ఈ నవలకు కథా వస్తువే. ఆధిపత్యమూ, అణచివేత, బానిసత్వం, పరాధీనత ఈ రెండు నవలలోని ప్రధాన ఇతివృత్తాలు. రెండూ ఒకదానితో ఒకటి సంబంధం కలవి. ఆ సంబంధం ఒకప్పుడు కరడుగట్టిన సంబంధం. స్వతంత్రం, రాజ్యాంగం కలిసి ఆ సంబంధాన్ని కది లించాయి. కుదిపాయి. ఆ కుదుపు ఆధిపత్యాన్ని భయ పెట్టేంత పెద్దది కాదు. బానిసత్వాన్ని పోగొట్టేంత విప్లవాత్మకమైనదీ కాదు. స్వతంత్రం, రాజ్యాంగం తొలి సంవత్సరాలలో దళితులకు ఇవ్వవలసిన ఆత్మ గౌరవాన్ని, ప్రతిఘటనా స్వరాన్ని ఇవ్వలేక పోయామని, అగ్రవర్ణాలు తమ ఆధిపత్యాలను మరింత స్థిరపరుచుకునేందుకు మార్గాలను వెతుకుతూ, సాధనాలను సమకూర్చు కునేందుకు సర్వ ప్రయత్నాలూ చేస్తున్నారనీ "సారాజ్జెం' నవల చదివినపుడు మనకు అర్థమవుతుంది.

కుటుంబరావు నవలా రచనలో సంప్రదాయ మార్గాన్ని వదిలివేశాడు. ఆయన నవలల్లో కథంటే జీవిత చిత్రణకు ప్రాధాన్యత ఉంటుంది. ప్లాట్ కూడా సంప్రదాయక పద్ధతుల్లో నడవదు. గ్రామంలోని అనేక జీవితాలు, గ్రామ నైసర్గికత నుంచి, మానవ సంబంధాల వరకూ ప్రతిదీ వివరంగా, సూక్ష్మంగా, క్లుప్తంగా పాఠకులకు పరిచయ మవుతాయి.

"సారాజ్జెం" నవల మన దేశ స్వాతంత్ర్యం వచ్చిన రోజే మొదలవుతుంది. అది యాదృచ్ఛికంగా జరిగింది కాదు. రచయిత స్వతంత్రం ఎలా ఉండబోతోందో ఎలా

ఉంటుందని అప్పటి ప్రజలు ముఖ్యంగా మాలపల్లిలోని ప్రజలు ఏమనుకున్నారో తరువాతి రోజుల్లో దేశంలో ఏ మార్పులు ఎవరి మేలు కోసం జరుగుతాయో సూచిస్తూ స్వతంత్రం వచ్చిన రోజున, ఇంకా సరిగ్గా చెప్పాలంటే ఆగష్టు 14 సాయంత్రం - ఢిల్లీలో దేశీయ, సామ్రాజ్యవాద నాయకులందరూ భారతదేశ స్వతంత్రానికి సంకేతాలను, సారాంశాన్ని సమకూరుస్తున్న సమయంలో, హిందు ముస్లింల మధ్య ఘర్షణలలో రక్తం ప్రవహిస్తూన్న క్షణాలలో భయంకరమైన హింస దేశ ప్రజల మనసుల్లో మర్చి పోలేకుండా ముద్రవేసుకుంటున్న సమయంలో, చీకట్లు ముసురుకుంటూ, మబ్బులు కమ్ముకుంటూ ఉన్న వాతావరణంలో నవల చాలా సింబాలిక్‌గా మొదలైంది. తల్లి పురుటి నొప్పులు పడి, సరైన వైద్య సౌకర్యాలు కాదు గదా, కాస్త పరిశుభ్రమైన నేల కూడా లేని చోట ''సారాజ్జెం'' పుట్టింది. పుట్టింది స్వరాజ్య మని తల్లి దండ్రులు గానీ, మాలపల్లిలోని ఏ ఒక్కరు గానీ అను కోలేదు. ఆగష్టు 15 ఉదయాన్నే మాలపల్లి సందర్శిం చాల్సిన తన రాజకీయ అవసరాన్ని గుర్తించిన, ఆ ఊరి భూస్వామి, స్వతంత్ర భారత నిర్మాతగా ఎదగాలనే కాంక్ష ఉన్న బ్రహ్మంగారు 'సారాజ్జెం' వచ్చిందని, ఎంకడి కూతురికి ఆ పేరు పెట్టాడు. ఎంకడికి కూతురికి పేరు పెట్టుకునే అధికారం కూడా లేకుండా పోయింది.

తర్వాత బ్రహ్మంగారు స్వతంత్ర దిన సందేశాన్ని మాలపల్లిలో వినిపించాడు. ''మనమంతా అన్నదమ్ములా కలిసిమెలిసుండాలి. అన్నొక మాటన్నా, ఒక దెబ్బేసినా తమ్ముడు ఎదురు తిరుగుతాడా? తిరగడు'' అంటూ అసలు సారాంశాన్ని చాలా తేలిక మాటల్లో చెబుతాడు. కుటుంబ అధికార చట్రాన్ని అమలు చేయందే, స్వతంత్ర దేశంలో అసమానత్వాన్ని అణిచివేతని భరించలేని కులాల తిరుగుబాట్లని అణిచివేయటం కుదరదని బ్రహ్మం సూచిస్తున్నాడు. అన్నదమ్ములా ప్రేమగా ఉండాలని కాదు ఆయన చెప్పేది. అన్నొక దెబ్బేసినా తిరగబడని తమ్ముడు కావాలి. ప్రశ్నించే వీలు లేకుండా వేల సంవత్సరాలుగా కుటుంబం కొనసాగిస్తున్న అధికార సంబంధాలను రాజ్యం బలపరుస్తుంది. ఆ విలువలను తన మనుగడకు వాడుకుంటుంది. స్వతంత్రం వచ్చిన తొలిరోజునే పితృ స్వామ్య కుటుంబానికి, రాజ్యానికి ఉన్న ముడిని భద్ర పరిచే నీతివాక్యాలతో రాజ్యాంగ నీతులకు చోటు లేకుండా చేసే పాలకవర్గాన్ని పరిచయం చేశాడు రచ యిత. నిజానికప్పుడు రాజ్యాంగం లేదు. రాబోయే రాజ్యాంగంలో కూడా వయసు కారణంగా చూపించే వివక్ష గురించిన ప్రస్తావన లేదు. తర్వాత బాలల హక్కులు వివరంగా రాసుకున్నారు. వృద్ధుల గురించి ఇప్పటికీ ఇదమిద్ధంగా ఒక హక్కుల పత్రం వంటిదేమీ ఉన్నట్టు లేదు.

బ్రహ్మంగారు స్వతంత్రం గురించి, అన్నదమ్ములా ఉండాల్సిన అవసరం గురించి చెప్పిన మాటలు ఎంకడిలో మాలపల్లెలో చాలా ఆలోచనలే రేపాయి. వాళ్ళకు తెలిసిన స్వతంత్రోద్యమం మోటూరెళ్ళి రైలు పట్టాలు పీకటం, అంగలూరు వెళ్ళి గాంధి గారిని చూడటం. ఈ రెండిటితో తెల్లాళ్ళు వెళ్ళారంటే నమ్మలేక పోయాడు ఎంకడు. అన్నదమ్ములా ఉండటమంటే అధికారం సంగతలా ఉంచి వివక్ష లేకుండా పోవటం, వనరుల్లో సమాన భాగస్వామ్యం. ఏమీ చదువుకోక పోయినా ఎంకడికి, అతని భార్య పద్దాలుకీ ఈ విషయం జీవితానుభవం ద్వారా తెలిసింది. పద్దాలు తమకు ''కూత మడిసెక్కేదన్నా దొరుకుతే'' అని ఆలోచించింది. ఎంకడికీ తనకు పరిచయమైన వివక్ష అంతా గుర్తొచ్చింది.

''వాకిట్లో మంచం మీద కూర్చున్న బెమ్మంగారు... ఇద్దరు, ముగ్గురు మాలవాళ్ళు దూరంగా చేతులు కట్టుకుని నిలబడి ఉండటం... వాళ్ళల్లో ఒకడికి దాహమైతే, దూరంగా ఉండమనే హెచ్చరికల్తో, దోసిల్లో ఎత్తుగా పెట్టిన చెంబుతో నీళ్ళు పొయ్యడం... యియ్యన్నీ పోతయ్యా, అంతా కలిసి మెలిసి ఉంటారా? పెళ్ళిళ్ళకీ, పండగలకి అందరి భోజనాలు అయ్యినాక ఆకరి బంతిలో కూచ్చోమనకుండా కలిసి మెలిసి తింటారా? మాలల్ని

కమ్మ రాములోరి గుళ్ళోకి రానిత్తారా? కమ్మ దొరలు మాలపిల్లల్ని పెళ్ళిళ్ళు చేసుకుంటారా? మాలాడికి కమ్మ దొరలు పిల్లల్నిత్తారా? ఇయ్యన్నీ జరిగేయేనా?" వనరుల గురించి, వివక్ష గురించి రచయిత ఇన్ని మాటలు చెప్పాక కులం గురించి, కుల అణచివేత గురించి మనం ఆలోచిస్తాం. ఈ అణచివేత సంఘటనలు 'సారాజ్జెం'లో అనేకం కనిపిస్తాయి. మొత్తం మీద కులం అగ్రవర్ణాలలో ఆధిపత్య భావనను కలిగించి, వనరులను స్వంతం చేసుకోవటం, శ్రమను దోపిడీ చెయ్యటం, హింసా దౌర్జన్యాలతో దళితులను అణచటం, వాళ్ళ ఆత్మ గౌరవాన్ని ప్రతిక్షణం కించపరచి అవమానించటం ద్వారా వారిలో కూడా ఆత్మన్యూనతాభావం ఏర్పడి, తమంత తాముగా ఆధిపత్య భావనలను, కులాలను గౌరవించే స్థితిలోకి జారటం - వీటన్నిటికి కారణమవుతుంది. ఈ వివక్షలను, హింసలను కుల సమజాన్నీ కొనసాగించే విధం సాంఘిక నిర్మాణాలన్నిటిలోను అత్యంత ఆశ్చర్య కరమైంది. నీచమైంది.

వనరుల మీద ఆధిపత్యం లేకపోవటం అనే విషయం సారాజ్జెంలో అనేకచోట్ల ప్రస్తావనకు వస్తుంది. సారాజ్జెంని తీసుకుపోయి ఎంకడు మూల్లంక వెళ్ళి తాటికాయలు తెచ్చుకుంటాడు. మూల్లంక ఎవరి స్వంత ఆస్తికాదు. అక్కడి తాటిచెట్లలో గల దానిమ్మ చెట్టువి, పక్క ఊరి వారివి కోసుకుంటాడు తాటిచెట్టు ఎక్కగలిగిన వారెవరైనా కోసుకోవచ్చు. ఎంకడు అలాగే కోసి, తనూ, సారాజ్జెం తిని, ఒకటి రెండు కాయలు ఇంటికి పట్టుకెళ్తుంటే దారిలో కనపడ్డ అమరయ్య తాటికాయల గురించి కోపంగా మాట్లాడతాడు. మీవి కాదని చెబితే. ''ఎవరియ్యరా లంజాకొడకా. నాయితే ఎముకల్లో సున్నం లేకుండా కుమ్మ బొడవనూ" అంటాడు అమరయ్య. రెండు తాటికాయలకి ఎంకడు చెల్లించాల్సి వచ్చే మూల్యం అది. ఆ కాయలు అమరయ్య చెట్టువి అయితే ఎంకడికి ప్రాణాలు దక్కేవి కావు. రచయిత ఈ సహజ వనరుల విషయంలో మాల పల్లెలకు జరిగే అన్యాయాన్ని, అగ్రవర్ణాలు వాటిని దౌర్జన్యంగా స్వంతం చేసుకోవటం గురించే రెండు వాక్యాలలో అద్భుతంగా చెప్పాడు. "తెల్లగా వెన్నెలొచ్చింది. మాలపల్లి క్కూడా, వెన్నెల ఆకాశం మీద నించొచ్చేది కాబట్టి గానీ లేకపోతే దొరలు మాలపల్లికి వెన్నెల్ని రానిచ్చేవారు కాదేమో". సందేహం లేదు. రానిచ్చేవారు కాదు.

బ్రాహ్మణ కులాధిపత్యాన్ని మిగిలిన కులాల వాళ్ళందరూ ఒప్పుకునేలా చేయటంలో కులవ్యవస్థ ఎల్లకాలం నిలబడే శక్తిని సంపాదించుకుంది. ఎంకడికి - రోజూ అగ్రవర్ణాల చేత దూరంగా ఉండమనే ఎంకడికి బ్రాహ్మణుల గొప్ప గురించి సందేహాలు లేవు. సోమయ్య అనే బ్రాహ్మణుడు చచ్చి స్వర్గానికే పోతాడని, ఆయన చేయించిన పూజలు ఆయన్ని స్వర్గానికే తీసుకెళ్తాయని కచ్చితంగా నమ్మి పద్దాలుతో చెబుతాడు. సోమయ్య ముగ్గురు పెళ్ళాలను మందెట్టి చంపినా సరే బ్రాహ్మడిగా స్వర్గమే పొందుతాడంటాడు ఎందుకని భార్య అడిగితే.

''బేంబడి పుటక మరి"

''దేవుడి కందరూ సమానమేనంటగా"

''అందరూ సమానమేంటిబీ ఎంత సమానమైనా బేంబళ్ళ దారి ఏరు" అంటాడు. బ్రాహ్మణ జన్మలోని ప్రత్యేకత గురించీ, అందరూ సమానం కాదని వాళ్ళు చెప్పిన మాటల గురించి, ఒకవేళ తప్పిజారీ దేవుడి దృష్టిలో అందరూ సమానమైనా బ్రాహ్మల దారి వేరనే అపారమైన విశ్వాసం ఎంకడిది. అది ఒక్క ఎంకడి విశ్వాసమే కాదు. వందల సంవత్సరాల నుండీ బ్రాహ్మణులు తమ జన్మ గురించి, తమ ఎక్కువ సమానత్వం గురించీ మిగిలిన కులాలందరిలో స్థిరపరిచిన విశ్వాసం. అది ఇప్పటికీ అనేక ఆచారాలలో కనపడుతూనే ఉంటుంది.

ఈ నవలలో అస్పృశ్యత అగ్రవర్ణాల వారి అవసరాల మేరకు ఉంటుంది. వారికి అవసరమైనపుడు మాల వాళ్ళను కొంతవరకూ దగ్గరకు రానిస్తారు. పాలేర్లుగా పెట్టుకున్నపుడు నీళ్ళు కూడా తెప్పించుకుంటారు. దాసీలుగా ఉంచుకున్నపుడు ఇంట్లో దాదాపు అన్ని

పనులూ చేయించుకుంటారు. ఈ మార్పు అంటరానితనం నేరం దాన్ని పాటించకూడదనే అవగాహన నుంచికాక వాళ్ళ అవసరాల నుంచి వచ్చింది. దానిని వాళ్ళు దాచుకోవాలని కూడా అనుకోరు.

కళ్ళు కనిపించని పాన్నమ్మ గారనే వృద్ధురాలు తన కర్ర పట్టుకుని ఇంటి దాకా చేర్చే పని మాల పిల్లల్ని చేయనిస్తుంది. కళ్ళు కనపడవు కాబట్టి తప్పదు - "కనపడితే మిమ్మల్ని నా కర్ర పట్టుకోనిచ్చేదాన్నంటరా? దగ్గరకొస్తే కర్ర తిరగేసేదాన్ని గానీ, రామ రామ" అని ఆ పిల్లలతో చెప్పగలిగే ధైర్యం ఆమెకి ఆమె కులం ఇచ్చింది.

సారాజ్జెం, బోడి, సంకురాత్తిరి ముగ్గురు పిల్లలూ, పరిగ ఏరుకున్నారు. అరబస్తా దాకా ఒడ్లు పోగేశారు. అవి అమ్ముకుని తమ చిన్న చిన్న కోరికలు తీర్చుకుందామని వారి ఆశ. కానీ వాళ్ళ కుటుంబాల పేదరికం ఎలాంటి దంటే పిల్లలు ఏరి తెచ్చిన పరిగను కూడా పెద్దవాళ్ళు కోమటింట్లో అమ్ముకుని అప్పు తీర్చుకోవాల్సిన పరిస్థితి. దాదాపు నెలరోజులు బురద బురదగా ఉన్న చేలల్లో, ఎండిన చేలల్లో పడి పగలంతా ఏరిన పరిగ తమ ఆశల్ని తీర్చలేదని ఆ పిల్లలు ఏడ్చిన ఏడుపు హృదయ విదారకంగా ఉంటుంది. ఒకవైపు సాంఘిక బానిసత్వం, మరోవైపు అతి పేదరికం. ఈ కుల వ్యవస్థ రెండు రకాలుగా వారిని అణిచివేస్తుంది. 'జోనే మంచెర్' అన్నట్లు "ఈ వ్యవస్థని బానిసత్వం అని పిలవొచ్చో లేదో గాని కుల అంతరువుల సంఘంలో అట్టడుగున ఉన్నవారు అతి పేదరికంతో బాధపడేవారు ఒకరే" అది సారాజ్జెం నవలలో ప్రతి పేజీలోనూ కనిపిస్తుంది. సారాజ్జెం ఆ ఊళ్ళో గడిపిన పదహారు సంవత్సరాల జీవితమంతా ఆ అమ్మాయి కటిక బీదరికంతో చేసిన పోరాటమే. ఆ బీదరికంలో తల్లీ కూతుళ్ళ మధ్య నిలబడిన సంబంధం అతి మానవీయం. అర్ధవంతం.

ఈ నగరంలో అతి భీభత్సమైన దృశ్యం జోజి హత్య. ఒట్టి హత్య కాదు. చిత్రహింస పెట్టి చంపుతారు కమ్మ దొరలు. జోజి దొంగతనం చేశాడని యజమాని నల్ల చంటబ్బాయి ఆరోపణ. అతను ఆ మాట అన్నాడో లేదో మిగిలిన కమ్మ దొరలు కోపం తెచ్చుకుని జోజిని ఎలా చిత్రహింసలు పెట్టాలో ఒక్కొక్కళ్ళు ఒక్కో పద్ధతి చెప్తారు. ఒక్కరు కూడా ఏం దొంగతనం చేశాడు? ఎప్పుడు చేశాడు? అనే కనీసపు ప్రశ్నలు వేయరు. కమ్మ యజమాని మాల జీతగాడి మీద నేరం ఆరోపించడాంటే అది నిజమని అందరూ నమ్మాల్సిందే. నమ్మారు. ముందు జోజిని చెట్టుకి కట్టేశారు. సోవిగారు "చెప్పుచ్చుక్కొట్టమని" వెళ్ళిపోయాడు.

మొహనరావు "చేతులిరిచెయ్య"మన్నాడు.

మల్లేశ్వర్రావు కొత్త పద్ధతి చెప్పాడు. "కాళ్ళూ చేతులు కట్టి కింద పడేసి ఒంటి మీద పంచదార పోసి రెండు బొట్లు నీళ్ళు చల్లాలి. దాంతో జన్మజన్మలకీ బుద్ధొస్తుంది." ఒకాయన కత్తవలు పెట్టి కుళ్ళపొడవమన్నాడు. చెంపలు పగలగొట్టాడు. ఇంకొకాయన "వదలమాకండి. కాళ్ళూ చేతులూ నజ్జు నజ్జు చేసి వదలండి. గాడిద కొడుకెవడితో చెప్పుకుంటాడో" అని వెళ్ళిపోయాడు. అసలు యజమాని కోదండం వేయించాడు. అంతలో మాలపల్లి నుంచి జోజిని రక్షించటానికి యవకులొస్తున్నారని విని యజమాని కిసరనాయిలు పోసి జోజిని తగలబెట్టేశాడు. ఈ ఘోరం గురించి చర్చేలేదు. కాకపోతే మాలపల్లె యువకులు పోలీస్‌స్టేషన్‌లో కేసు పెట్టారు. కోర్టుకి వెళ్ళారు. పోలీసులకి, ప్లీడర్లకి ఒక యకరం పొలం అమ్మి ఖర్చుపెట్టి. యజమాని తప్పించుకున్నాడు. ఖర్చుపెట్టలేని మాలపల్లె యువకులు తమే నేరస్తులయ్యారు. జైలుకి వెళ్ళారు. ఎందుకంటే పొలం గట్టున కొట్లాటలో వాళ్ళే జోజిని చంపారని న్యాయవాదులు న్యాయస్థానంలో నిరూపించగలిగారు.

జోజి హత్య జరిగింది. అది ఒక గ్రామంలో విడిగా జరిగిన అమానుష చర్యగా మాత్రమే చూస్తే మనలో వ్యక్తిగతంగా వివిధ స్థాయిలలో ఉండే మానవత్వం వివిధ రకాలుగా మేల్కొనవచ్చు. స్పందించవచ్చు. దానివలన పాఠకుల వ్యక్తిగత సంస్కార స్థాయిగాని, స్పందనస్థాయి గాని పెరగవచ్చు. అది పరిమిత ప్రయోజనం. ఐతే ఇక్కడ జరిగింది ఒక హత్య మాత్రమే కాదు. అనేక హత్యలను

అనుమతించే కులవివక్షతా అవిష్కరణ. రాజ్యాంగ ఉల్లంఘన రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 14, 15, 16, 21ల ఉల్లంఘన. ముఖ్యంగా ఆర్టికల్ 15, ఆర్టికల్ 21 ఇక్కడ కుప్ప కూలిపోయాయి. కులవివక్షకు వ్యతిరేకంగా రాజ్యాంగం ఇచ్చిన హామీ గాలికి ఎగిరిపోయింది. ఇక్కడ మనం వివక్షకు జీవించే హక్కుతో, వ్యక్తిగత స్వేచ్ఛతో పడిన ముడిని విప్పిచూసే అవకాశం దొరుకుతుంది. వివక్షకున్న న్యాయపరమైన ఎన్నో అర్థాలు మన కళ్ళకు కట్టినట్లు కనపడతాయి.

జోజిగాడి హత్య తర్వాత మాలపల్లిలో కాస్త తిరుగుబాటు ధోరణి వచ్చింది. సహదేవుడుని యజమాని ఎర్ర సత్తెం కొట్టినప్పుడు తిరపతి మాలపల్లె నుంచి పదిమందిని పోగేసి ఆ రాత్రి ఎర్ర సత్తెం ఇంటికి వెళ్ళాడు. కమ్మ దొరలంటే వాళ్లకున్న భయం విశ్వాసం ఎలా పనిచేస్తాయో వాళ్ళు మాలపల్లి నుంచి ఎర్ర సత్తెం ఇంటి కొచ్చేసరికి వాళ్ళకు కోపం తగ్గి భయ సందేహాలు ఎలా కమ్ముకుంటాయో రచయిత చాలా వాస్తవికంగా రాశాడు. చివరకు ఆ తగాదాను బ్రహ్మంగారు సర్దుతాడు. బ్రహ్మం ఒకరకంగా ప్రభుత్వ ప్రతినిధి. గాంధీయిజంకు తన ఇష్టం వచ్చిన వాఖ్యానం చేస్తూ ప్రచారం చేసే కాంగ్రెస్ మనిషి. అతను రాజ్యంపేరు చెప్పి వాళ్ళను భయపెట్టిన తీరు మొత్తం రాజ్యాంగాన్నే అవమానించేదిగా ఉంది.

"మీరింత మంది ఒక్కసారిగా ఇట్టారావడం అనేది, అదెంత గోరమైన తప్పో మీకు తెలవదురా. తెలిస్తే మీరిట్టా వొచ్చేవాళ్ళే కాదు. యివ్వుడు, ఈ నివిషాన మిమ్ములందర్నీ బొక్కలోకి తొయ్యిచ్చురా, మీరిట్టా చేశారని, యిట్టా పలానా వూళ్ళో, పలానా మా వాళ్ళంతా మూకుమ్మడిగా వొచ్చి వూరుమీద పడ్డారు అని తెలిస్తే ఢిల్లీ నుంచి గవర్నమెంటు సైన్యాలొచ్చి మిమ్ములందర్ని చంపిమరీ కవాతు కొట్టుకెళ్తాయిరా పిచ్చి సన్నాసుల్లారా.

తిరపతిని పనిలోంచి తీసేశాడు యజమాని నాగ భూషణం. పాలేరు పని నుంచి వ్యవసాయ కూలీ అయ్యాడు తిరపతి. అతనిలో తిరుగుబాటు భావాలు ఊళ్ళో అన్యాయాలు చూసి పెరుగుతున్నాయి. మాలపల్లెలో నాయకుడిగా ఎదుగుతున్నాడు. కూలిరేట్లు పెంచాలని సమ్మె చేయించటంలో ముందున్నాడు. పక్క ఊళ్ళ నుంచి కూలీలను తెద్దామని భూస్వాములు ప్రయత్నిస్తుంటే తిరపతి పక్క ఊళ్ళోకి వెళ్ళి ఆ కూలీల మద్దతు సంపాదించి వాళ్ళు రాకుండా చేస్తున్నాడు. అలాంటి తిరపతిని భూస్వాములు క్షమించే ప్రశ్నే లేదు. తిరపతి తలపగలగొట్టి శవాన్ని కాలువలో తోసేశారు. మాలపల్లె నుంచి నందిని కూడా చంపేశారు. మాట్లాడే వాడు బతకకూడదు. అది భూస్వాములు గట్టిగా తీసుకున్న నిర్ణయం. సారాజ్జెం నవలా సమయంలోనే (1960) కాదు - మాలపల్లి నవలలో కూడా ఇదే జరిగింది. సంగదాసుని హత్య చేశారు. అక్కడ కూడా కారణం ఇదే. కూలీల కూలిరేట్లు పెంచమని అడిగిన కూలీలకు నాయకుడు సంగదాసు. యజమాని కోపం పట్టలేక గడ్డపారతో పొడిచి చంపేస్తాడు. అప్పుడు పోలీసులు కేసులు లేకుండా రాజీ చేసుకుంటారు. సంగదాసు శవాన్ని ఇచ్చేటట్లు, అతను చనిపోయిన చోటనే అతని సమాధి కట్టటానికి స్థలం తక్కువ ధరకి ఇచ్చేటట్టు.

సారాజ్జెం నవలలో పోలీసులూ, కోర్టులూ తమ పాత్ర పోషించాయి. సమ్మె సమయంలో మాలవాళ్ళు వాళ్ళలో వాళ్ళే కొట్లాడుకుని తిరపతిని, పోలిని, చంద్రిని చంపేశారని ఎంకన్న, రత్తయ్య అనే మాలవాళ్ళని జైల్లో వేశారు. అందరికీ తెలిసిన నిజం కూడా చచ్చిపోయింది. ఎందుకంటే -

"పోలీసులు పురుషోత్తమ రావు చేతిలో ఉన్నారు.
కోర్టులు పురుషోత్తమ రావు చావిట్లోనే ఉన్నాయి.

న్యాయం, ధర్మం పురుషోత్తమ రావు గుబురు మీసాల చిరునవ్వుల్లో చిక్కుకుపోయాయి. రాజ్యాంగం రాసిన పదిహేనేళ్ళ నాటి పరిస్థితి ఇది. అంబేద్కర్ చెప్పినట్లు "పేడకుప్ప మీద కట్టిన రాజభవనం" అది అని తేలిపోయింది.

ఆ తర్వాత సాహిత్యంలో కాకుండా యదార్థంగా జరిగిన ఎన్నో సంఘటనలున్నాయి. కారంచేడు, చుండూరు సంఘటనలు జరిగాయి. భూస్వాములు మాల, మాదిగ కులాల వాళ్ళు తలెత్తితే, నోరెత్తితే ఎంతటి ఘాతుకాలకు తలపడతారో 1984, 1991 సంవత్సరాల్లో 'రాజ్యాంగం' రాసుకున్న నలభై ఏళ్ళకు కూడా పాత సత్యాలే మళ్ళీ మళ్ళీ రుజువయ్యాయి. కారంచేడు కేసులో, చుండూరు కేసులో కోర్టులు న్యాయం చెయ్యలేవా? పత్రికలు, టి.వి.లు చూపిన ప్రత్యక్ష సాక్ష్యాలు కూడా కోర్టులకు కనపడలేదు. సంగదాసు సమాధిలానే చుండూరులో అమరవీరుల సమాధులు ఊరినడి బొడ్డులో వచ్చాయి. ఐనా ఎవరికీ భయం లేదు. కులపరమైన వివక్ష ధారాళంగా పెరిగిపోవటానికి, రాజ్యాంగ ఉల్లంఘనలు నిర్భయంగా చేయటానికి న్యాయ యంత్రాంగం సహకరించింది. ఐతే దళితులు సంఘటిత పడటానికీ, వారి అస్తిత్వం గురించి ఆలోచించటానికి ఈ సంఘటనలు దోహదం చేశాయి. ఒక్క అడుగు ముందుకు వెయ్యటానికి ఎన్ని కాళ్ళు తెగనరకబడాలో.

మాలవాళ్ళను భూస్వాములు ఇంత అన్యాయంగా చంపుతున్నారని, స్వతంత్రం వచ్చాక, రాజ్యాంగంలో ప్రాథమిక హక్కులు వాగ్దానం చేయబడిన తర్వాత కూడా భారతదేశ గ్రామాలలో దళితుల పరిస్థితి ఇంత భయం కరంగా ఉందని చెప్పిన స్వాతంత్ర్యానంతరపు తొలి తెలుగు నవల సొరాజ్జెం. ఈ హత్యాకాండ కల్పన కాదు. వాస్తవం. వాస్తవాన్ని నవలారూపంలో చెప్పటమే కుటుంబరావు సాహితీ వ్యూహం.

సొరాజ్జెం నవలంతా రాజ్యాంగ ఉల్లంఘనలే. ఆ సంఘటనల ద్వారా పాఠకులలో రాజ్యాంగ నైతికత పెరగాలనే రచయిత ఆశయం ఒక్కరోజుతో నెరవేరేది కాదు. కానీ ఆ దిశగా 1984 నుంచీ దళిత ఉద్యమంలో గుణాత్మకమైన మార్పులు రావటం, అందరం హర్షించ దగిన విషయం.

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 6(1), June 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

'అముద్రిత గ్రంథ చింతామణి' పూండ్ల రామకృష్ణయ్య సాహిత్య సేవ

- ఆచార్య డి.వి.శ్రవణ్‌కుమార్, ప్రొఫెసర్-కం-డైరెక్టర్, ప్రచురణల కేంద్రం, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

తెలుగునాట పత్రికోద్యమం 18వ శతాబ్దంలోనే ప్రారంభమైంది. అయితే తొలి పత్రికల ఆనవాళ్ళు మిగలకుండా పోయాయి. అందువల్లే తొలి తెలుగు పత్రిక విషయంలో ఇప్పటికీ కొంత వివాదాస్పదంగానే ఉంది. 1865 ప్రాంతాలకే తెలుగు సారస్వత విషయాలతో వృత్తాంతిని పత్రిక వెలువడింది. చిన్నయసూరి మొదలైనవారు ముద్రించిన 'సుజనరంజని'లో విద్యా సారస్వత విషయాలనేకం ఉండేవని తెలుస్తోంది. కొక్కొండ వేంకటరత్నంపంతులు గారు 1871లో 'ఆంధ్ర భాషా సంజీవని' ప్రారంభించి పన్నెండేళ్లు నడిపారు. ఆ రోజుల్లోనే బందరు నుండి 'పురుషార్థ ప్రదాయిని', స్వధర్మ ప్రకాశిని వంటి పత్రికలు వెలువడేవి. కందుకూరి వీరేశలింగం పంతులు గారు రాజమహేంద్రవరం నుండి 'వివేకవర్ధని'ని నడిపారు. కాకినాడ, విశాఖపట్నం, మద్రాసు నగరాల నుండి అనేక పత్రికలు వెలువడుతూ ఉండేవి. అనాటి ఈ పత్రికా ఉద్యమమే నెల్లూరు వారికి కూడా ప్రేరణ కల్గించిందేమో! నాటి కలెక్టరాఫీసులో పనిచేసే ఉల్లిగొండం రామచంద్రరావు అనే ఉద్యోగి 1882వ సంవత్సరంలో 'విద్యార్థి కల్ప భూజ'మనే పత్రికను నెల్లూరులో ప్రారంభించి సుమారు ఒక సంవత్సరం పాటు మాత్రమే నడిపారు. ఈ పత్రిక 1883వ సంవవత్సరంలో నిలిచిపోయింది.నెల్లూరులో పుట్టిన తొలి సారస్వత పత్రికగా దీన్ని చెప్పుకోవచ్చు.

అయితే లభించే ఆధారాలను అనుసరించి నెల్లూరు తొలి తెలుగు పత్రికగా పూండ్ల రామకృష్ణయ్య గారి "అముద్రిత గ్రంథ చింతామణి"గా ప్రముఖ పరిశోధకులు డా॥ కాళిదాసు పురుషోత్తం గారు పేర్కొన్నారు. పూండ్ల రామకృష్ణయ్య సారస్వత సేవ గురించి వీరు విశేషమైన పరిశోధన చేశారు. 18వ శతాబ్ది చివరి పాదంలో తెలుగునాట జరిగిన భాషాకృషికి, సారస్వత సేవకు, జరిగిన పండిత వివాదాలకూ 'అముద్రిత గ్రంత చింతామణి' ఒక దర్పణంలా నిలిచింది. 1885వ సంవత్సరం నుండి దాదాపు ఇరవయ్యేళ్ళు ఈ పత్రిక కొనసాగింది. జూలై 14, 1860న నెల్లూరుకి సమీప గ్రామమైన దువ్వూరులో పూండ్ల రామకృష్ణయ్య జన్మించారు. తన పాతికేళ్ల వయసులో 1885లో 'అముద్రిత గ్రంథ చింతామణి' పత్రికను ప్రారంభించారు. ఆర్థికంగా తగిన స్తోమత లేకపోయినా, సంపన్న మిత్రుల సహాయ సహకారాలతో ఈ పత్రికను నిర్వహించారు. ఆనాటి తెలుగు సాహిత్య వికాసాన్ని పరిశోధించే పరిశోధకులకు ఈ పత్రిక ఒక ఆకర గ్రంథమైంది. పూండ్ల రామకృష్ణయ్య తన స్నేహితుడైన వీరనాగయ దేవరతో కలిసి తొలి పత్రికను జూన్ 1, 1885న 16 పుటలతో ప్రకటించారు. మొదటి నాలుగు పుటల్లో ఛందో వ్యాకరణాది విశేషాలు, గ్రంథ విమర్శ, వసు చరిత్ర, మనుచరిత్రల్లోని కఠిన పద్యాలకు అర్థ నిరూపణ, చాటు పద్య ప్రచురణ, విద్యా విషయ సంబంధమైన లేఖలు వంటివి ప్రచురించే వారు. మిగిలిన పుటల్లో తాము సేకరించిన అముద్రిత గ్రంథాలను పరిష్కరించి ముద్రించేవారు. నిరాదరణకు గురై నశించిపోతున్న తాళపత్ర గ్రంథాలను పరిష్కరించి ముద్రించడం ఈ పత్రిక ప్రధానాశయం. ఈ విషయాన్ని తమ మొదటి సంచికలోనే,

"జతనంబు మీఱగ నము
ద్రిత సద్గ్రంథముల సేకరించి కడు పరి
ష్కృతములు గావించి యథా
మతి బత్రిక గూర్చెదము క్రమంబుగ వానిన్" అని పేర్కొన్నారు.

'అముద్రిత గ్రంథ చింతామణి' పత్రిక మొదటి రెండేళ్లూ ఎటువంటి ఆటంకాలు లేకుండా నడిచింది.

అయితే రామకృష్ణయ్య గారు అనారోగ్యంతో ఐదారు నెలలు అనారోగ్యంతో మంచం పట్టడం వలన మూడవ సంవత్సరం పత్రికా ప్రచురణ సాధ్యం కాలేదు. ఆరోగ్యం కుదుటపడినా 1887 అక్టోబరులో పత్రిక ప్రచురించాలన్నా అనేక అవాంతరాలు వచ్చి పడ్డాయి. ఈయన మిత్రుడు వీరనాగయకవి నెల్లూరు వదిలిపెట్టి వెళ్లాడు. ఆ సమయంలో రామకృష్ణయ్య న్యాయస్థానంలో ఒక సివిల్ వ్యాజ్యం ఎదుర్కొన్నాడు. ఇన్ని ఆటుపోట్ల మధ్య 1890 డిసెంబరుకు మూడవ సంపుటాన్ని పూర్తి చేశారు. అయినా ఇంకొక సమస్య వచ్చి పడింది. తమ రచనలు వేయడం లేదని, వార్తలు ప్రచురించడం లేదని కొందరు చందా దారులు, మిత్రులు నిందించారు. వార్తలు వేయకపోతే పత్రికకు పేరు రాదని సలహా ఇచ్చారు. రామకృష్ణయ్య గారు ఆ సమయంలో ఆనాటి పత్రికా పోషకుల్లో ఒకరు, సుప్రసిద్ధ న్యాయవాది రావుబహదూర్ పనప్పాకం అనంతాచార్యులను సంప్రదించారు. అందుకాయన వార్తల్ని ప్రచురించాల్సిన అవసరం లేదని, ఇంగ్లీసులో "అధీనియం" అనే పత్రిక ఇలాగే వస్తోందని, దానిలాగే 'అముద్రిత గ్రంథ చింతామణి'ని నడపమని సూచించారు. అందువల్ల ఈ పత్రికను విద్యా విషయ సారస్వత పత్రికగానే కొనసాగించాలని పూండ్ల రామకృష్ణయ్య నిర్ణయించుకున్నారు. ఆవిధంగా జనవరి, 1891 నుండి నాలుగవ సంపుటి ఆరంభమైంది. నాటి నుండి రామకృష్ణయ్య గారు చివరి వరకూ పత్రిక, పుస్తక ప్రచురణకై తన జీవితాన్ని అంకితం చేశారు.

ఒకవైపు పత్రికను కొనసాగిస్తూనే, మరోవైపు తాళ పత్రాలను పరిష్కరించి పుస్తక ప్రచురణ చేస్తూ వచ్చారు. భోగినీ దండకం, వసుంధరా పరిణయం, యాదవ రాఘవ పాండవీయం, తిమ్మన భర్తృహరి నీతిశతకం, హరిశ్చంద్ర నలోపాఖ్యానం, మిత్రవిందా పరిణయం వంటి ప్రాచీన గ్రంథాలనేకం పరిహరించి, చక్కని పీఠికలు రాసి అచ్చు వేశారు. రామకృష్ణయ్య గారి పీఠికల గురించి "ఆ మూల్య గ్రంథముల కంటె వానికి బూండ్ల రామకృష్ణయ్య వారొనర్చిన పీఠికలు మిక్కిలి చక్కగా నున్న"వని కొక్కండ వేంకటరత్నం పంతులు గారు ప్రశంసించారు. ఇంకా వడ్డాది సుబ్బరాయుడి గారి ముకుంద శతకాన్ని, మచ్చవేంకటకవి గారి శుద్ధాంధ్ర నిరోష్ట్య నిర్వచన కుశ చరిత్రాన్ని ప్రచురించారు. ఇలా ఆయన ప్రచురించిన గ్రంథాలనేకం ఉన్నాయి.

రామకృష్ణయ్య గార్కి చాటుపద్యాల సేకరణపై బాగా ఆసక్తి ఉండేది. వందకుపైగా చాటు పద్యాలు సేకరించి 'అముద్రిత గ్రంథ చింతామణి'తో ప్రచురించారు. ఈయన ప్రకటించిన చాటు పద్యాలు కొన్ని వేటూరి వారి సంకలనంలో, మరికొన్ని దీపాల పిచ్చయ్య శాస్త్రి గారి సంకలనంలోనూ చోటుచేసుకున్నాయి. అయితే పూండ్ల రామకృష్ణయ్య గారిని మాత్రం చాటుపద్య సంకలనకర్తగా ఎవరూ పేర్కొనలేదు. రామకృష్ణయ్య గారు 'అరింటికి తా' అనే వ్యాసంలో తిట్టు కవిత్వాన్ని గురించి రాస్తూ, అప్పకవి వంటివారు ఉదాహరించిన తిట్టు పద్యాలన్నీ వెలికి తీశారు. ఇదే వ్యాసాన్ని సాహిత్య అకాడమీ తమ వ్యాస సంపుటిలోనూ ప్రచురించారు.

వేదం వేంకటరాయ శాస్త్రి, కందుకూరి వీరేశలింగం పంతులు, కొమర్రాజు వెంకట లక్ష్మణరావు, వెల్లాల సదాశివ శాస్త్రి, వావిలికొలను సుబ్బారావు, ధర్మవరం రామకృష్ణమాచార్యులు, వడ్డాది సుబ్బరాయుడు, కొక్కొండ వేంకటరత్నం పంతులు వంటి ఆనాటి పండితులంతా అముద్రిత గ్రంథ చింతామణిలో రచనలు చేసిన వారే. అనేక సాహిత్యాంశాలపై వాద, ప్రతివాదాలు జరుగుతుండేవి. కోలాచలం వారి నాటకాలను, వావిలి కొలను వారి కుమారాభ్యుదయాన్ని విమర్శిస్తూ రాసిన వ్యాసాల్ని ఇందులో ప్రకటించారు. ఈ విధంగా అనేక మంది పూండ్ల రామకృష్ణయ్య గార్కి వ్యతిరేకులు ఏర్పడ్డారు. దీంతో కొంత మంది పోషకులుగా ఉన్న వారు సహాయ నిరాకరణ చేశారు. 1900వ సంవత్సరం నాటికి పత్రిక ఆర్థిక దుస్థితిలోకి వచ్చింది. అయినా వెంకటగిరి రాజాల సహాయంతో అముద్రిత చింతామణి ఆగిపోకుండా వచ్చింది.

రామకృష్ణయ్య గార్కి ఆనాటి పండితులతో సత్సం బంధాలు ఉండేవి. వారితో ఉత్తర ప్రత్యుత్తరాలు చేసేవారు. 1897లో విక్టోరియా రాణి అరవయ్యేళ్ల పాలన పూర్తి అయిన సందర్భంలో రాజమండ్రిలో ఒక సభ జరిగింది. చిలకమర్తి లక్ష్మీ నరసింహం పంతులు గారు ఆ సభలో చదివిన ప్రశంసాపూర్వక పద్యాలు 'అముద్రిత గ్రంథ చింతామణి'లో అచ్చు వేశారు. ఈ పద్యాలు చదివిన ఆంధ్రదేశపు వివిధ ప్రాంతాల నుండి తన కవిత్వాన్ని మెచ్చుకుంటూ లేఖలు వచ్చాయని చిలకమర్తి వారు తన జీవిత చరిత్రలో రాసుకున్నారు. హరిశ్చంద్ర నలోపాఖ్యానాన్ని పరిష్కరించి ప్రకటించే సందర్భంలో భట్టుమూర్తి, రామరాజభూషణుడు వేరువేరనే ఒక వాదాన్ని పూండ్ల రామకృష్ణయ్య గారు ప్రతిపాదించారు. ఆ సందర్భంలో కందుకూరి వీరేశలింగం పంతులు గారి కవుల చరిత్రను తీవ్రంగా విమర్శించారు. అయితే తర్వాతి కాలంలో తాను తొందరపాటున అంత పరుషంగా రాశానని, మన్నించవలసిందనీ పత్రికా ముఖంగానే పూండ్ల వారు ప్రకటించుకున్నారు. రామకృష్ణయ్య గారి కోరికపై వీరేశలింగం పంతులు గారు ఎనభైకి పైగా గ్రంథాలను పంపినట్లు తెలుస్తోంది. వీరేశలింగం పంతులు గారు ఎంత పేరు ప్రఖ్యాతులు కల్గిన వారైనా అవసరమైన సమయంలో ఆయన్ను పూండ్ల వారు విమర్శించే వారు. రామకృష్ణయ్య గారు ప్రకటించిన గణపవరపు వేంకటకవి రచించిన ప్రబంధరాజ వేంకటేశ్వర విలాసాన్ని ఈ పత్రికలో వీరేశలింగం గారు సమీక్షించారు. ఆ విమర్శలో బంధ గర్భ కవిత్వ గ్రంథాలు ఉపయోగకరం కావని, చిత్రబంధ కవిత్వాన్ని చూసి సంతోషించే కాలం పోతుందని కూడా రాశారు. రామకృష్ణయ్య గారు 'ఒజ్జల పుచ్చకాయ' అనే శీర్షికతో రాసిన వ్యాసంలో కందుకూరి వారి ఈ మాటలను విరహానించారు. వీరేశలింగం గారి రసిక జన మనోభిరామం, శుద్ధాంధ్ర నిరోష్ఠ్య నిర్వచన నైషధాల్లో ఉన్న చిత్రబంధ కవిత్వాన్ని చూపి, ఇది ఒజ్జల పుచ్చకాయ సామెతగా ఉందని విమర్శించారు. వీరేశలింగం పంతులు గారి జీవిత చరిత్రను అముద్రిత గ్రంథ చింతామణిలో ప్రకటించారు.

వేదం వేంకటరాయ శాస్త్రి గారికి పూండ్ల రామకృష్ణయ్య గార్కి మంచి స్నేహం ఉండేది. అందువల్లే 'అముద్రిత గ్రంథ చింతామణి' అన్ని విషయాల్లోనూ వేదం వారికి కొమ్ము కాసేది. ఈ కారణం వల్ల కూడా కావచ్చు. ఆనాటి కొందరు పండితుల ఆగ్రహానికీ ఈ పత్రిక గురి కావలసి వచ్చింది. గిడుగు రామమూర్తి పంతులు గారు సైతం ఒక సందర్భంలో 'అముద్రిత గ్రంథ చింతామణి పత్రికాధి పతులయిన పూండ్ల రామకృష్ణయ్య గారున్ను వేదం వేంకటరాయ శాస్త్రుల వారున్ను జట్టుగా ఉన్నట్టు తోస్తుంది'' అని రాశారు. వేదం వారి నాటకాలను ప్రత్యేకంగా ఆడించడానికి రామకృష్ణయ్య గారు మార్చి 30, 1899న 'ఆంధ్ర భాషాభిమాన సమాజా'న్ని నెల్లూరులో స్థాపించారు.

పూండ్ల రామకృష్ణయ్య గారి విమర్శ సంప్రదాయ రీతిలో ఉంటుంది. సర్వసాధారణంగా శాబ్ధిక విచారమే (శబ్ద సంబంధమైన విమర్శ) ఎక్కువగా కనిపిస్తుంది. ఈ విషయం శకటరేఫ విచారం, పయేశ్శబ్ధ విచారం, శ్యమంతక శబ్ద విచారం, క్షకారము సంయుక్తాక్షరమా? వటుడు శబ్దము ప్రయోగార్హమా?, ఓష్ఠ్య నిరోష్ఠ్య విచారము, నాటకములందు గ్రామ్య భాష ఉపయోగించ దగునా? వంటి ఆయన రాసిన వ్యాసాలు, ఆయన విమర్శనా విధానాన్ని వివరిస్తున్నాయి. ఆనాటి ఉత్తమ రచనలుగా పేర్కొనబడిన కన్యాశుల్కం, ప్రతాప రుద్రీయం, ధర్మవరపు కృష్ణమాచార్యుల వారి నాటకాలు, కవుల చరిత్ర, కవి జీవితములు మొదలైన గ్రంథాలకు చక్కటి సమీక్షలు రాశారు. పార్వతీశ్వర కవి చూపిన తటవర్గ బిందుయతి (అనుస్వార సంబంధ యతి) ప్రయోగాలను పూండ్ల రామకృష్ణయ్య ప్రామాణికంగా అంగీకరించలేదు. ఈ విషయమై వారిమధ్య సుదీర్ఘమైన వాదం జరిగింది. ఈ సందర్భంలో పార్వతీశ్వర కవి రాసిన

సీన మాలిక పద్యాలు పూండ్ల వారిని ఆవేదనకు గురిచేశాయి. తన హృదయావేదనను అక్షర రూపంలో వ్యక్తీకరిస్తూ, తమ పత్రిక వల్లే ఆయనకు విఖ్యాతి కల్గిందని, ఆయన చరిత్ర, కొన్ని పుస్తకాలను తామే ప్రకటించామని, కవులను, పండితులను ఆక్షేపించకుండా స్తుతించే వరకు వారి లోతు, గుణగణాలు తెలియనవి తెలిపారు. ''లక్షణములను, లక్షణానుసారములగు ప్రయోగములను జూపుచు నాక్షేపించినను శ్రీ శాస్త్రుల వారొప్పక మా విషయమై యొక సీస మాలిక వ్రాసిరి'' అని రాసి బాధపడ్డారు.

పూండ్లరామకృష్ణయ్య గారి జీవితమంతా సాహిత్య సేవలో గడిపారు. ఆరోజుల్లోనే సారస్వతం కోసం ఒక పత్రికను నడపడం మామూలు విషయం కాదు. మార్చి, 1900 సంచికలో ఆయన ''మాకితర వ్యాయామములు లేవు. విద్యా విషయిక వ్యాయామమునందే మా జన్మ కడతేరవలయునని శ్రీ శ్రీధరు నెల్లప్పుడు బ్రార్థింపు చుందుము'' అనిరాసుకున్నారు. ఆయన కోరుకున్నట్లు గానే జరిగింది. జూలై, 1904 సంచిక వెలువడిన తర్వాత సెప్టెంబరు 1, 1904న పూండ్ల రామకృష్ణయ్య నెల్లూరులో మరణించారు. పూండ్ల వారి జీవితమంతా సాహిత్య సేవకూ, పత్రికానిర్వహణకూ పూర్తిగా అంకితమైంది. అయన మరణంతో నెల్లూరు పత్రికోద్యమంలో ఏర్పడ్డ శూన్యం మళ్లీ ఎప్పటికో గానీ పూరింపబడలేదు. ఈ విషయంలో సమగ్ర పరిశోధన చేసిన డా.కాళిదాసు పురుషోత్తం గారికి అభినందనలు.

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 6(1), June 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావ వీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

విడదల సాంబశివరావు – దృశ్య రూపకం, సామాజిక ప్రయోజనం

– **టి. డేవిడ్‌రాజు,** తెలుగు విభాగం, పరిశోధక విద్యార్థి, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు.

నవల, నాటకం, కథ, కవిత్వం, వెండితెర, బుల్లితెర మొదలగు వివిధ సాహిత్య ప్రక్రియల్లో విశేష కృషి చేస్తున్న ఈతరం నేటి మేటి సాహితీవేత్త మరియు వెండితెర.. బెల్లితెర నటుడు మన విడదల సాంబశివరావు గారు ఒకరు. వారు రెండు తెగల రాష్ట్రాల ప్రజల హృదయాలలో చెరగని ముద్ర వేసుకున్న గొప్ప రంగస్థల నటుడు. బహుశా ఆయన పేరు తెలియని వారు లేరు అని చెప్పడంతో ఎంత మాత్రం అతిశయోక్తి లేదు.

శ్రీ విడదల సాంబశివరావు గారు 1952 జనవరి 22వ తేదీన గుంటూరు జిల్లా (ప్రస్తుతం పల్నాడు జిల్లా) చిలకలూరిపేట పట్టణ పరిధిలోని పురుషోత్తమపట్నంలో శ్రీమతి సీతమ్మ, రాములు దంపతులకు జన్మించారు. వీరి ప్రాథమిక విద్య పురుషోత్తమపట్నం, హైస్కూల్ విద్య చిలకలూరిపేట, 1969-72 సంవత్సరాలలో తెనాలి వి.యస్.ఆర్. కళాశాలలో బి.ఎస్సీ పూర్తిచేశారు. వీరికి 1974లో వీరికి కోటేశ్వరమ్మ గారితో వివాహం జరిగింది. భర్తకు అన్ని విధాలా తగిన భార్య వీరి అన్యోన్య దాంపత్యానికి గుర్తుగా వారికి ముగ్గురు పిల్లలు. ఇద్దరు మగ పిల్లలు ఒక ఆడపిల్ల. పెద్ద కుమారుడు కమలేంద్ర రెండవ కుమారుడు శిఖేంద్రనాథ్. ఆడపిల్ల సాయి ధనలక్ష్మి నిహారిక అందరికి వివాహాలు చేశాడు. మనుమళ్లు.. మనుమరాళ్ళతో ఎంతో సంతోషంగా సాగిపోతుంది విడదల వారి జీవితం.

విడదల సాంబశివరావు గారు హైస్కూల్‌లో చదివే రోజులలోనే 'నటన' పట్ల మక్కువ పెంచుకున్నారు. అప్పటినుండే ముఖానికి మేకప్ వేసుకోవడం ప్రారంభించారు. 1968 సంవత్సరంలో ''బాలచంద్రుడు'' ఏకపాత్రాభినయంతో వారి నటనా జీవితం ప్రారంభమైంది. 45 సంవత్సరాలు వారి నట జీవితంలో రెండు తెలుగు రాష్ట్రాల్లో అన్నీ నాటక పరిషత్తుల్లోను నటించారు. ప్రముఖ రచయితలు.. వర్ధమాన రచయితలు రాసిన నాటికలు, నాటకాల్లో అద్భుతమైన పాత్రలెన్నింటినో ఆయన ఉత్తమ నటుడిగా, కార్యక్టర్ ఆర్టిస్టుగా ఎన్నో పాత్రలు పోసించి బహుమతులు అందుకున్నారు. విడదల సాంబశివరావు ప్రధాన పాత్ర పోషించిన 'ధ్వంస రచన' నాటికకు 2008 బంగారు నంది బహుమతి గెలుచుకున్నాడు. అదేవిధంగా 2001 సంవత్సరం ఉత్తమ నటుడిగా బంగారు పతకం పొందాడు. విడదల సాంబశివ రావు గారు అద్భుతమైన నటన ప్రదర్శించి ఉత్తమ నటుడిగా.. ఉత్తమ క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా వారు బహుమతులు అందుకున్న నాటికలు మరియు నాటకాలు అవి..

1) బాలచంద్రుడు (ఏకపాత్రాభినయం) - 1968
2) సికిందర్ (అలెగ్జాండర్ ఏకపాత్రాభినయం) - 1969
3) భజంత్రీలు (నాటిక) - 1968
4) మంచం మీద మనిషి (నాటిక) - 1969
5) మంచుతెర (నాటిక) - 1970
6) ఒక చెట్టు - రెండు పూలు (నాటకం) - 1971
7) సమిధ (నాటకం) - 1972
8) నటనాలయం (నాటకం) - 1973
9) రక్తజ్వాల (నాటకం) - 1974
10) రాబంధుల రాజ్యమా ఇక వర్ధిల్లవు (నాటకం) - 1974-76
11) గాలి-వాన (నాటకం) - 1977
12) గులకరాళ్ళు - గులాబిముళ్ళు (నాటిక) - 1978
13) సమాజం చావనివ్వదు (నాటిక) - 1978-80
14) ఛీ..ఛీ...(నాటిక) - 1980-81
15) మృగయా వినోదం (నాటిక) - 1983-84
16) మృగమైధానం (నాటిక) - 1992-93

17) జాతిస్మరామి (నాటిక) - 1994-96
18) పృథ్వీసూక్తం (నాటిక) - 1996-1998
19) నాన్నా! .. బొమ్మ కావాలి! - 1998
20) సాలభంజిక (నాటిక) - 1999
21) వఱుడు (నాటిక) - 2001-03
22) హాచ్ (హాస్యనాటిక) - 2003-04
23) ఏరువాక సాగాలి (నాటిక) - 2005-06
24) ఏకాకి నౌకచప్పుడు (నాటకం) - 2006-07
25) దేవుడా ... దేవుడా (నాటిక) - 2008-09
26) ధ్వంస రచన (నాటిక) - 2008-09
27) బహుజన హితాయ (నాటకం) - 2008-09
28) జూలియస్ సీజర్ (ఇంగ్లీషు నాటకం) - 1970

1970 సంవత్సరంలో 18 సంవత్సరాల వయస్సులో విఖ్యాత ఆంగ్ల నాటక రచయిత షేక్స్పియర్ రచన ''జూలియస్ సీజర్'' నాటకంలో మహోన్నతమైన ''మార్క్ ఆంథోని'' పాత్రను పోషించి ప్రేక్షకుల ప్రశంసలు పొందారు. న్యూఢిల్లీలోని రవీంద్రభవన్‌లో ప్రసిద్ధ దర్శకులు శ్రీ సురేంద్రనాథ్‌భక్తి దర్శకత్వంలో శ్రీ విడదల వారు పోషించిన పాత్ర ఆయన నటనా జీవితంలో ఒక మధుర స్మృతిగా మిగిలిపోయింది.

శ్రీ విడదల వారి స్వీయ రచనలు 'పుణ్యభూమి నాదేశం' (నాటకం) మరియు 'తలారి తీర్పు' (నాటకం) 2007, జనవరిలో నిజామాబాద్ రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో జరిగిన నంది నాటకోత్సవాలలో ప్రదర్శించబడి ప్రేక్షకుల ప్రశంసలు పొందాయి. 'దేవుడా' నాటకం కూడా ప్రదర్శించబడింది. ఈ విధంగా ఒకే సంవత్సరంలో నంది నాటకోత్సవాలలలో రచయితగా.. నటుడిగా... నాటక న్యాయనిర్ణేతగా మూడు విభాగాల్లో విశిష్ట కృషి చేసి నాటకరంగంలో ఓ అరుదైన విశేషంగా ఎందరో కళారంగ ప్రముఖుల ప్రశంసలు పొందారు. శ్రీ విడదల వారు రచించి నటించిన నాటకాల్లోని సామాజిక ప్రయోజనం.

మనిషి స్వార్థపరుడు. స్వప్రయోజనం లేకుండా ఎవ్వరూ ఏ పని చేయడు. ప్రతి పనిలోనూ స్వార్థమే ఉంటుంది. కాని సాహితీవేత్తలు చేసే ప్రతి పనిలోను వ్యక్తిగత ప్రయోజనం కన్నా సామాజిక ప్రయోజిక శ్రేయస్సుకు, సమాజికాభివృద్ధికి తోడ్పడే పనులు చేస్తారు. విడదల సాంబశివరావు గారి దృశ్యరూపక రచనలలో కూడా ఎంతో సామాజిక ప్రయోజనం ముడిపడి ఉంది. దానికి కారణం సామాజిక ప్రయోజనం కోసమే సాహిత్యం పుట్టింది. ఇది సమాజాన్ని చైతన్యపర్చి సంఘంను సంస్కరించటానికి తోడ్పడుతుంది. విడదల వారి దృశ్య రూపకంలోని సామాజిక ప్రయోజనాన్ని పరిశీలిద్దాం.

ప్రజాస్వామ్యంలో ప్రజలచే ఎన్నుకోబడ్డ ప్రజా ప్రతినిధులు తన పరిధిలో ఉన్న చట్టాలు మరియు శాసనాల ద్వారా ప్రజా సంక్షేమానికి కృషి చేయాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది. అవినీతి, అక్రమాలు మరియు లంచాలకు కక్కృతి పడకుండా ప్రజారంజకంగా పరిపాలించాలి. కాని దయానందం (రాంబందుల రాజ్యమా - ఇక వర్ధిల్లవు) ప్రజల చేత ఎన్నుకోబడ్డ ప్రజా ప్రతినిధి మరియు దేవాలయ ట్రస్టీ బోర్డు ఛైర్మన్ రాజకీయ, ఆర్థిక, అంగబలం ఉన్న భూస్వామి. పోలీసులను అడ్డుపెట్టుపెట్టుకుని ఎన్నో అవినీతి, అక్రమాలకు పాల్పడ్డాడు. అన్యాయాలను ప్రశ్నించిన అమాయకులనుచాలా దారుణంగా చంపేశాడు. గ్రామంలో ప్రజా సంపదలను, ప్రభుత్వ భూములను ఆక్రమించుకుని రాక్షసరాజ్యం యేలుతున్నాడు. అంతేకాకుండా అయన అనుచరులు కుమార్ సొసైటీ ప్రెసిడెంట్ అధిక ధరలో ఎరువుల విక్రయం, రైతులపై ధౌర్జన్యాలు, రామాచార్యులు దేవుని మాన్యంపై వచ్చే ఆదాయం దోపిడీ చెయ్యడం, అతని అరాచకాలు, ధౌర్జన్యాలు, దోపిడాలకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమం లేవనెత్తి ఈ రాంబందుల రాజ్యాన్ని అంతం చేశాడు రాజశేఖర్. అధికారం ఎప్పుడూ శాశ్వతం కాదు. అధికారం, ధౌర్జన్యాలు, లంచగొండితనంతో విర్రవీగే నాయకులకు ప్రజలే బుద్ధి చెపుతారని ఋజువైంది.

ప్రస్తుత సమాజంలో ప్రజల మధ్య స్వార్థం పెరిగి పోయింది. అవినీతి, అక్రమాలు, ధౌర్జన్యాలు చెయ్యటానికి ఎంతమాత్రం వెనుకాడడం లేదు. కామంతో కళ్ళు మూసుకుపోయిన కామాంధులు అమాయకురాలైన ఆడపిల్లల జీవితాలను చిదిమేస్తున్నారు. జనారణ్యంలో మానవ మృగాల్లా ప్రవర్తిస్తున్నారు. మానవత్వం మరచి పోయిన పైశాచిక ఆనందం కోసం కౄరమృగాల్లా ప్రవర్తిస్తున్నారు. ఇలాంటి దయనీయ పరిస్థితులలో మానవ సంబంధాలు ఇంకా మిగిలే ఉన్నాయని డా॥. రాధాదేవి (అవనీతలంపై అమృత కలశం) నిరూపించిన గొప్ప మానవతామూర్తి. ఆమె సంఘం మంచి పేరు ప్రఖ్యాతులున్న సంఘసంస్కర్త. సమాజ శ్రేయస్సు కోసం తన జీవితంను త్యాగం చేసిన త్యాగమూర్తి డా॥. రాధాదేవి. అనాథలకు, వృద్ధులకు, నిరుపేదలకు కోట్ల రూపాయలు ఖర్చు చేసి విశిష్ట సేవలు చేస్తుంది. వృద్ధులకోసం ''వాత్సల్య వృద్ధాశ్రమం'', అనాథ పిల్లల కోసం ''ఆదరణ అనాథశ్రమం''. వృద్ధాప్యంలో కళ్ళ చూపులు కోల్పోయిన వారికోసం ''నేత్రాలయం'' అనాథలకు, నిరుపేదలకు విద్యాభ్యాసం కోసం ''సరస్వతీ నిలయాలు'' మొదలగు అనేక సంస్థలను ఏర్పాటు చేసి నిస్వార్థమైన సామాజిక సేవ చేస్తున్న గొప్ప సామాజికవేత్త. మంచి మానవత్వం గల ఉత్తమ ఇల్లాలు. ఆడపిల్లలపై జరిగే అఘాయిత్యాల సుదీర్ఘ పోరాటం చేస్తుంది. డా॥. రాధాదేవి భర్త కృష్ణ ప్రసాద్ స్వార్థపరుడు. డబ్బుతో ఏదైనా సాధించవచ్చు అని నమ్మిన వ్యక్తి. స్త్రీ వ్యసన పరుడు. అమాయకురాలు, అన్యంపుణ్యం తెలియని 'జాబిలి' అనే ఒక పల్లెటూరి అమ్మాయిని నమ్మించి మోసం చేసి ఆమె జీవితాన్ని నాశనం చేశాడు. గొప్ప సంఘ సంస్కర్తగా డా॥ రాధాదేవి తన భర్త కృష్ణప్రసాద్‌ను జాబిల్లికి ఇచ్చి వివాహం చేసిన అభ్యుదయవాది డా॥. రాధాదేవి. ఎందరో స్త్రీలకు ఆదర్శంగా నిలిచింది.

జీవితం అంటే కేవలం సుఖసంతోషాలతో సరదాగా గడపడం కాదు. మనతోపాటు ఎదుటి వారి సుఖం, ఆనందం కోరుకోవడంలోనే ఉంది మన ఆనందం. సమాజంలో నలుగురితో కలసి జీవిస్తున్నప్పుడు ఎదుటి వారికి సహాయం చెయ్యడంలో ఉండే ఆనందం వర్ణించరానిది. నాగరాజు చాలా కష్టాల్లో ఉన్నాడు. ఒక్కగానొక్క కొడుకు ప్రమాదంలో చనిపోయాడు. దాంతో భార్య కొడుకుపై దిగులుతో కృంగి కృషించి చనిపోయింది. ఈ మానసికి ఆందోళనను తట్టుకోలేక ఉన్నత అధికారులకు చెప్పకుండా ఉద్యోగంలోనుండి పారిపోయి వచ్చి శ్రీపతి పండితారాధ్యుల శ్రీరామచంరదమూర్తి గారి ఇంటి ముందు పడిపోయాడు. ఆయన మనుమరాలు శ్రీదేవి అతని దయనీయ పరిస్థితిని చూసి జాలిపడి ఇంట్లో ఆశ్రయం కల్పించింది (తలారి తీర్పు) శ్రీదేవి. వాళ్ళ మధ్య తల్లిబిడ్డల మధ్యగల సంబంధం ఏర్పడింది. ఒక అగాంతకుడు ప్రేమిస్తున్నానని శ్రీదేవి వెంటపడ్డాడు. చివరకు ఆమె అతని ప్రేమను తిరస్కరించడంతో అతి కిరాతకంగా నరికి చంపాడు. ఫలితంగా కోర్టు అతనికి ఉరిశిక్ష విధించింది. కాని భారతదేశంలో ఉరిశిక్షను అమలు పరిచే తలారీలు ఇద్దరే ఇద్దరు ఉన్నారు. ఒకరు ఢిల్లీలోని తీహార్ జైల్లో ఉన్న మహావీర్‌సింగ్ అతను ఈ మధ్యనే చనిపోయాడు. ఇక రెండోవాడు రాజమండ్రి సెంట్రల్ జైల్‌లో ఉండే నాగరాజు. విధుల్లో లేడు. తనకోసం భారత ప్రభుత్వ యంత్రాంగం మొత్తం వెదుకుతుంది. అతను దొరకకపోతే శ్రీదేవి హతకుడికి ఉరిశిక్ష రద్దు అవుతుంది. తలారి నాగరాజే శ్రీదేవి ఇంట్లో ఉన్న నాగరాజు. చిన్నారి తల్లి కోసం నాగరాజు విధులకు హాజరయ్యాడు. జైలు యంత్రాంగం నిందితుడికి ఉరిశిక్ష ఖరారు చేశారు. జైలు సూపరింటెండెంట్, జిల్లా మేజిస్ట్రేట్, డాక్టర్ ఉన్నారు. తలారి నాగరాజు నిందితుడికి ఉరి తియ్యటానికి సిద్ధపడ్డాడు. ఇంతలో రాష్ట్రపతి క్షమాభిక్ష పెట్టాడు. ఆ సమాచారం తెలియపర్చాడు. వీఒషయం గ్రహించిన తలారి నాగరాజు ఇక వెనకా ముందు ఆలోచించకుండా నిందితుడిని ఉరితీసి చంపేశాడు. ఇదే తలారి తీర్పు.

మన సంస్కృతులు, సంప్రదయాలు, ఆచార వ్యవహారాలు వ్యక్తి జీవితానికి, సామాజిక శ్రేయస్సుకు ప్రతిబింబాలు కాకూడదు. అవి సంఘశ్రేయస్సుకు, మానవ జీవన విధానానికి తోడ్పడాలి. ఈ సంప్రదాయాలు కేవలం మన కొరకు మన ప్రయోజనాల కోసం మన అవసరాల కోసం ఏర్పరచుకున్నవి. మాధవరావు పరమ నిష్టాగరిష్టుడు. సనాతన సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు గల బ్రాహ్మణ కుటుంబం. అగ్రకుల అహంకారం. కులం, మతం, వంశం, పట్టింపులు మొదలగునవి మాధవరావు (అభ్యుదయానికి సంకెళ్ళా...?) చాలా నిష్టగా పాటిస్తారు. ఆయమనకు ఒక్కగానొక్క కూతురు సుధ. చదువు, సంస్కారం, ఆచార వ్యవహారాలు గల మంచి అందమైన అమ్మాయి. తన బాల్య స్నేహితుడు కృష్ణమోహన్‌ను ప్రేమించింది. కృష్ణమోహన్ గజపతులు వంశానికి చెందినవాడు. మంచి మానవత్వం కలవాడు. ఇద్దరూ చాలా గాఢంగా ప్రేమించుకున్నారు. పెద్దల అనుమతితో పెళ్ళి చేసుకోవాలనికుని మాధవరావు గారి అనుమతి కోసం ఆయన దగ్గరకు వచ్చారు. కాని ఛాందసవాది అయిన మాధవరావు సంప్రదాయాలు, ఆచారాలు, వ్యవహారాలుకు పుట్టినిల్లు నా వంశం. మా పూర్వీకులు అగ్నితో సమానులు.. పట్టింపుల్లో నిష్టాగరిష్టులు ఇప్పటి వరకూ నా వంశంలో మచ్చలేదని.. అహంకారంతో మాట్లాడి కృష్ణమోహన్‌ని వెనక్కి పంపించాడు. వాస్తవంగా చూస్తే కృష్ణమోహన్ గజపతుల రాజవంశీకులు. ఆర్థిక, అంగబలంతో ఏమాత్రం సరితూగని కుటుంబం అతనిది. ఐనా ప్రేమించిన అమ్మాయి కోసం తలదించుకుని వెనుదిరిగాడు. మాధవరావు తను కూతురిని తన కులంలోనే మంచి సంప్రదాయ కుటుంబంలో ఇచ్చి పెళ్ళి చేశాడు. అల్లుడు దుర్మార్గుడు ఎందరో ఆడపిల్లల జీవితాలను సర్వనాశనం చేసినందుకు ప్రభుత్వం ఉరితీసి చంపింది. తన కూతురి జీవితాన్ని చేజేతుల నాశనం చేశాడు. విషయం తెలుసుకున్న కృష్ణమోహన్ తను మనసారా ప్రేమించిన సుధ తెల్లచీర కట్టుకుని బొట్టు, గాజులు, పూలు కోల్పోయి వితంతువుగా చూసి తట్టుకోలేక పోయాడు. ఆమెను పెళ్ళి చేసుకుని కొత్త జీవితాన్ని ప్రసాదిస్తానన్నాడు కృష్ణమోహన్. కులపిచ్చి తలకెక్కిన మాధవరావు ఇలాంటి పరిస్థితుల్లో కూడా కులం, మతం గౌరవ ప్రతిష్టలు అని విర్రవీగుతున్నాడు. ఆయన ఆచార సంప్రదాయాలను తుంగలో తొక్కి కృష్ణమోహన్ పెళ్ళి చేసుకుని ఆనందంగా వుంది సుధ. ఈ కంప్యూటర్ యుగంలో అభ్యుదయ భావాలకు ఎవ్వరూ సంకెళ్ళు వేయలేరని నిరూపించింది సుధ.

ఆధార గ్రంథాలు :

1) తెలుగు నాటక వికాసం - డా॥. పోణంగి శ్రీరామ అప్పారావు.
2) సాంఘిక నాటకం - పరిణామ వికాసం (వ్యాస సంకలనం) - డా॥. పి.వి. రమణ
3) తెలుగు పద్యనాటకాలు - అనుశీలన - డా॥. దేవురపల్లి ప్రబుదాస్
4) తెలుగు సాహిత్య చరిత్ర - డా॥. ద్వా.నా. శాస్త్రి.
5) తెలుగు సాహిత్య చరిత్ర - ప్రా॥. వెలమల సిమ్మన్న
6) తలారి తీర్పు - విడదల సాంబశివరావు
7) రాబందుల రాజకీయమా - ఇక వర్ధిల్లవు - విడదల సాంబశివరావు.
8) అభ్యుదయానికి సంకెళ్ళా - విడదల సాంబశివరావు
9) జనారణ్యంలో జానకి - విడదల సాంబశివరావు

★★★

BHAVAVEENA
Vol. 19, Issue. 6(1), June 2022
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC CARE List Group - 1 Journal
under Arts and Humanities Category

వేమన పద్యాలు – నీతి ప్రబోధ గుళికలు

– డా॥. పెండ్యాల లావణ్య
అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగుశాఖ,
ఆంధ్రా విశ్వవిద్యాలయం, విశాఖపట్టణం.

– డా॥. బూసి వెంకటస్వామి
అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగుశాఖ,
ఆంధ్రా విశ్వవిద్యాలయం, విశాఖపట్టణం.

వేమన లోకకవి, ప్రజాకవి, సంఘసంస్కర్త. వానకు తడవనివారు, ఒక్క వేమన పద్యం రాని తెలుగువారి ఉండరని లోకోక్తి. వేమన పద్యాలు లోకనీతులు. సామాజిక చైతన్యం వేమన పద్యాలలో కనిపిస్తుంది. సమాజంలోని అన్ని సమస్యలు భిన్నకోణల్లోంచి దర్శించి ఆ దర్శన వైశిష్ట్యాన్ని వేమన తన పద్యాలలో ప్రదర్శించాడు. సమాజంలో ఉన్న మూఢ నమ్మకాలు, మూఢాచారాలు, కుల వ్యవస్థ, మత సిద్ధాంతాలపై ఒకటేమిటి ప్రతి విషయంపై తన ఆటవెలదులను ఈటెలుగా విసిరిన మహాఋషి. వేమన పద్యాలు తెలుగు సాహిత్యవనంలో విరబూసిన రత్నహారాలు. వేమన పండితులకు మాత్రమే పరిమితమైన 'వేదాంతము'ను అతిసామాన్య మానవునికి కూడా అందుబాటులో వుండేట్లు స్వచ్ఛమైన తేనెవంటి తేట తెలుగు పద్యాలతో వివరించిన మహానుభావుడు. వేమన ప్రతి పద్యానికి ఆనాటి చారిత్రక, నైసర్గిక, సాంఘిక, నైతిక, ఆర్థిక, రాజకీయ, మత వ్యవస్థలతో సంబంధం ముడిపడి ఉంది. అందుకే ఒకే పద్యం అనే కోణాలలో అనేక అర్థాలను ఇవ్వగలుగుతుంది. వేమన మొదట వేదాంతి. తరువాత కవి. ఎవరైతే వేమన యొక్క సంపూర్ణ వేదాంత వైఖరిని తెలుసుకోగలరో, వారే వేమన పద్యాలకు సరియైన వ్యాఖ్యానాన్ని రాయగలరు. విభిన్న సామాజిక పార్శ్వాలను తడిమిన తొలి తెలుగు కవి వేమన.

సామాన్య నీతులను ప్రజల హృదయాలకు హత్తుకునేటట్లు వ్యవహారిక భాషలో, స్పష్టమైన రీతిలో సూటిగా వ్యక్తీకరించడం, సామాన్యులైన వారితో తనను ఒకనిగా భావించుకుని నీతిని ఉపదేశం చేశారు. నీతి పద్యాల ద్వారా వేమన సంఘాన్ని ఉద్ధరించదలిచారు.

"నీతి తెలియజెప్పనిజముగ వేమన
పాతకములనెల్ల పారబట్టి
లోతుతత్త్వమరసి లోకులకును జెప్పె
విశ్వదాభిరామ వినురవేమ"

నిజంగా నీతిని తెలియజేయడానికి వేమన గారు పాపాలన్నింటిని నిరోధించి, తత్త్వాన్ని లోతుకెళ్ళి చూశాక, లోకులకు చెప్పారని చదివీ చదవగానే ఈ పద్యం ద్వారా స్ఫురిస్తుంది. అయితే నీతి అంటే ఏమిటి? మంచినడతను బోధించేది నీతి అని మనం అర్థం చేసుకుంటాము. కానీ లోకంలో చాలా రకాల నీతులున్నాయి. అందులో రాజనీతి, దండనీతి అనే రెండే భారత దేశంలో ముఖ్యంగా ఉండేవి. రాజనీతిని, దండనీతిని అర్థశాస్త్రం వివరిస్తుంది. కౌటిల్యుడి అర్థశాస్త్రమే పరమ ప్రామాణికమైనది.

